
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 266

శనివారం 17-12-2022



బంగ్లా లక్ష్యం 513

శతక్కొట్టిన గిల్, పుజారా.. భారత్ రెండో ఇన్నింగ్స్ 258/2 డిక్లేర్డ్ - 12లో



హోండా కారు ప్రియం

జనవరి 23 నుంచి పెరగనున్న ధరలు.. రూ.30 వేల వరకు భారం - 15లో

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఇది వర్గాల యుద్ధం

పేదలకు న్యాయం జరగాలంటే మళ్లీ మనం అధికారంలోకి రావాలి

ప్రతి గడపలో మనం కనీసం ఐదు నిమిషాలు గడపాలి

ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం

- మూడున్నరేళ్లలో చేసిన మంచిని ప్రతి ఇంటా చెప్పండి..
- ఎన్నికలకు ఇంకా 16 నెలలు ఉంది.. అన్ని ఇళ్లూ తిరగండి
- మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరండి
- మనం పాలకులం కాదు.. సేవకులమనేది గుర్తుంచుకోండి
- 21న ట్యాబ్‌ల పంపిణీ, జనవరి 1–7 వరకు పెన్షన్ పెంపు వారోత్సవాల్లో పాల్గొనండి
- సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, ప్రతి 50 ఇళ్లకు ఇద్దరు గృహ సారథులను నియమించండి



"మనం పాలకులం కాదు ప్రజా సేవకులం. అధికారం చలాయించడం కోసం కాదు మనం ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా ఉండేది.. నేను సీఎంగా ఉండేది.. ఎదిగే కొద్దీ ఒదగాలి. అధికారంలో ఉండేకొద్దీ ఇంకా ఎక్కువ ఒదగాలి. అప్పుడే ప్రజల నుంచి ఇంకా మంచి స్పందన లభిస్తుంది. ఈ వాస్తవాన్ని గుర్తించకపోతే నష్టపోతాం. ప్రతి గ్రామానికి వెళ్లండి. ప్రతి ఇంటినీ సందర్శించండి. ఏ ఇంటికైనా వెళ్లకపోతే.. మీరు తమ ఇంటికి రాలేదని, వారు మనకు వ్యతిరేకం అయ్యే అవకాశం ఉంది. వారు మనకు ఓటేయరని తెలిసినా వెళ్లండి. ఎందుకంటే వారికి ఎంతగా మంచి చేశామనే రికార్డులు మన దగ్గర ఉన్నాయి. వాటిని చిరునవ్వుతో వివరిస్తే, వారి మనసు మారొచ్చు.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో ఇవాళ కులాల మధ్య కాదు.. క్లాస్‌ల మధ్య.. అంటే పేదలు, పెత్తందార్ల మధ్య యుద్ధం జరుగుతోంది. మనం పొరపాటున అధికారంలోకి రాకపోతే, రాష్ట్రంలో ఉన్న ఏ పేదవాడికీ న్యాయం జరగదు. పేదవాడి ప్రతినిధి మనమే. మనం నష్టపోతే పేదలు నష్టపోతారు. వారికి న్యాయం జరగాలంటే మళ్లీ మనం తప్పకుండా అధికారంలోకి రావాలి. ఇందుకోసం ప్రతి గడపనా కనీసం ఐదు నిమిషాల పాటు గడపాలి. మూడున్నరేళ్లలో మనం చేసిన మంచి గురించి చెప్పాలి' అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలకు ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్బోధించారు. 'దయచేసి అందరూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై ధ్యాస పెట్టండి.. మూడున్నరేళ్లగా

మిగతా 2వ పేజీలో ▶





పల్నాడు జిల్లా మాచర్లలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై బండరాయితో దాడి చేస్తున్న టీడీపీ గుండాలు

టీడీపీ రౌడీల స్వైర విహారం

మాచర్లలో పథకం ప్రకారం రెచ్చిపోయిన జూలకంటి బ్రహ్మారెడ్డి ముఠా

- బండరాళ్లతో, కర్రలతో ముగ్గురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి
- ముగ్గురికీ తీవ్రగాయాలు, ఆసుపత్రిలో చేర్చిన బంధుమిత్రులు
- గంటసేపు పట్టణంలో ఈలలు, కేకలతో రెచ్చిపోయిన టీడీపీ మూకలు
- తరవాత రైల్వే గేటు వరకూ ప్రదర్శన; అక్కడో వాహనానికి నిప్పు
- మాచర్ల టీడీపీ ఇన్‌చార్జిగా వచ్చినప్పటి నుంచే ఘర్షణ ధోరణిలోనే బ్రహ్మారెడ్డి
- తాగుబోతుల్ని అరెస్టు చేసినందుకు రెండ్రోజుల కిందట పోలీస్ స్టేషన్‌పై దాడి
- శుక్రవారం విలేకరుల సమావేశం పేరిట రాడ్లు, కర్రలతో అనుచరుల సంసిద్ధత
- అనంతరం పథకం ప్రకారం దాడులు చేస్తూ బీభత్సం సృష్టించిన తీరు

సాక్షి, నరసరావుపేట, మాచర్ల: ఎదుట ఉన్నది కూడా మనుషులేనన్న విచక్షణ కోల్పోయి... బలంకొద్దీ బండరాళ్లతో బాదారు. కర్రలతో తరిమి తరిమి దారుణంగా కొట్టి... మళ్లీ లేవలేనంతగా గాయపరిచారు. మారణాయుధాలతో వీధుల్లో స్వైరవిహారం చేశారు. ఇదీ... శుక్రవారం రాత్రి మాచర్లలో తెలుగుదేశం పార్టీ గూండాల అత్యంత కిరాకతమైన ప్రవర్తన. విలేకరుల సమావేశం పేరిట పక్కా పథకం ప్రకారం రాడ్లు, కర్రలు ముందే తెచ్చుకుని... తమను అడ్డుకున్నారంటూ ఏ సంబంధం లేని

మిగతా 7వ పేజీలో ▶

న్యూస్‌రీల్

భారత ప్రధాని కసాయి



పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో భారత ప్రధానిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో పాల్గొనేందుకు అమెరికా వెళ్లిన బిలావల్ అక్కడ మాట్లాడుతూ..'ఒసామా బిన్ లాడెన్ చచ్చిపోయాడు. కానీ, గుజరాత్ ప్రజల ప్రాణాలను బలితీసుకున్న కసాయి బతికే ఉన్నాడు. ఆయనే భారత ప్రధాని' అని అన్నారు.

వివరాలు 6 ▸

వ్యక్తిగత స్వేచ్ఛ అమూల్యమైనది



వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించి సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ''అది రాజ్యాంగమే గుర్తించిన అత్యంత అమూల్యమైన, విస్మరించేందుకు వీల్లేని హక్కు. దానికి విఘాతం కలిగిందంటూ వచ్చే విన్నపాలను ఆలకించడం మా రాజ్యాంగపరమైన విధి. అది మా బాధ్యత కూడా.'' అని పేర్కొంది.

వివరాలు 6 ▸

చైనా దురాక్రమణపై చర్చించాల్సిందే



అరుణాచల్‌ప్రదేశ్‌లో భారత్, చైనా జవాన్ల మధ్య ఘర్షణ, చైనా దురాక్రమణపై చర్చించాలని ప్రతిపక్ష కాంగ్రెస్ రాజ్యసభలో డిమాండ్ చేసింది. శుక్రవారం ఉదయం సభ ప్రారంభం కాగానే ఆ పార్టీ ఎంపీలు నినాదాలు చేస్తూ వెల్‌లో బైఠాయించారు.

వివరాలు 6 ▸

ఇంటర్‌లో 75 శాతం సాధిస్తేనే జేఈఈ మెయిన్స్‌కు అర్హత

కరోనా సమయంలో సడలించిన నిబంధన పునరుద్ధరణ

- ఎన్ఐటీ, ఐఐఐటీ, సీఎఫ్టీఐలలో సీట్ల కేటాయింపునకు వీలుగా మార్పులు
- పరీక్ష జరిగే ప్రాంతాల సంఖ్య కుదింపు
- మెయిన్స్‌కు వయోపరిమితి సడలింపు
- విద్యాసంస్థల్లో వయో పరిమితి నిబంధన పాటించాల్సిందే
- సెషన్ల వారీగా దరఖాస్తు చేయాలి
- అభ్యర్థికి ఒక్క దరఖాస్తు మాత్రమే..
- దరఖాస్తులో తల్లిదండ్రులు లేదా సంరక్షకుల వివరాలు తప్పనిసరి



- వివరాలు 2లో

వచ్చే ఏడాది మే 7న 'నీట్'



- దరఖాస్తుల ప్రక్రియ త్వరలో ప్రారంభం.. నీట్ యూజీ–2023 క్యాలెండర్‌ను ప్రకటించిన ఎన్‌టీఏ
- ఏపీలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 5,360 ఎంబీబీఎస్ సీట్లు
- మరో 5 కాలేజీల్లో 2023 నుంచి అకడమిక్ కార్యకలాపాలు ప్రారంభించడానికి సన్నాహాలు

2లో

వాక్-ఇన్ ఇంటర్వ్యూలకు..

143 మంది వైద్యుల హాజరు

30 పోస్టులు శాశ్వత, 5 పోస్టులు కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ

సాక్షి, అమరావతి: ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్, శాశ్వత ప్రాతిపదికన స్పెషలిస్ట్ వైద్యుల పోస్టుల భర్తీ కోసం శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన వాక్-ఇన్ ఇంటర్వ్యూలకు 143 మంది వైద్యులు హాజరయ్యారు. శుక్రవారం రాత్రికి మెరిట్ జాబితాలను సిద్ధం చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. శాశ్వత ప్రాతిపదికన ఏడుగురు గైనిక్, నలుగురు ఈఎన్‌టీ, ఆరుగురు పెథాలజీ, 13మంది అనస్తీషియా స్పెషాలిటీ వైద్యులకు పోస్టింగ్‌లు ఇచ్చారు. కాంట్రాక్టు ప్రాతిపదికన నలుగురు ఈఎన్‌టీ, ఒక పెథాలజీ వైద్యులకు పోస్టింగ్ ఇచ్చారు. శనివారం జూమ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించి మిగిలిన వారికి పోస్టింగ్‌లు ఇవ్వనున్నారు.

స్నానానికి వెళ్లి..

'కృష్ణా'లో ఐదుగురు గల్లంతు

- ఇద్దరి మృతదేహాలు లభ్యం.. మరో ముగ్గురి కోసం గాలింపు
- కృష్ణాజిల్లా యనమలకుదురు వద్ద రేవులో క్రికెట్ ఆట..
- ఆ తర్వాత మూడున్నర కిలో మీటర్ల దూరంలోని పాతూరు వద్ద నదిలోకి..
- అందరూ 17 ఏళ్లలోపు వారే
- చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపివేత
- బాధిత కుటుంబాల వారంతా విజయవాడ దర్శిపేట వాసులే

- వివరాలు 2లో

ప్రసవాల గమ్యం.. ప్రభుత్వాస్పత్రులు!

- పార్వతీపురం మన్యం జిల్లాలో గర్భిణులకు భరోసా
- మూడున్నరేళ్లలో ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సదుపాయాలు
- పూర్తిస్థాయిలో వైద్యులు, వైద్య సిబ్బంది నియామకాలు
- అత్యాధునిక వైద్య పరికరాలు
- శిశువుల సంరక్షణకు ప్రత్యేకంగా యూనిట్లు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: గ్రామీణ, గ్రామీణ ప్రాంతాల మహిళలకు ప్రభుత్వాస్పత్రులు భరోసానిస్తున్నాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రజారోగ్య శాఖ.. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయినప్పటి నుంచి గాడిలో పడింది. గత మూడేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రభుత్వాస్పత్రులపై ప్రజల్లో మళ్లీ నమ్మకం కలుగుతోందనడానికి పార్వతీపురం మన్యం జిల్లాలో జాయింట్ కలెక్టర్ భార్య కార్తీక, పాచిపెంట మండల అధ్యక్షురాలు ప్రమీల వైద్యసేవలు పొందడమే నిదర్శనంగా చెప్పొచ్చు. పునర్విభజనతో కొత్తగా ఏర్పాటైన పార్వతీపురం మన్యం జిల్లాలో గత 8 నెలల కాలంలో మొత్తం 8,266 ప్రసవాలు జరగ్గా.. వాటిలో 6,417 ప్రసవాలు ప్రభుత్వాస్పత్రుల్లోనే జరగడం విశేషం.

గర్భిణులకు పూర్తి భరోసా..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో గర్భిణులకు పూర్తి భరోసా ఇస్తున్నాం. వారు చేరగానే అవసరమైన వైద్య పరీక్షలు చేస్తున్నాం. సాధారణ ప్రసవాలు జరిపేందుకు ప్రాధాన్యమిస్తున్నాం. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్ చేస్తున్నాం. గర్భిణులకు ప్రత్యేక ప్రసూతి విభాగం, ఆపరేషన్ థియేటర్‌ను జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటుచేశాం. తల్లీ బిడ్డల సంరక్షణకు మెరుగైన వైద్య సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చింది. అందుకే గతంలో కన్నా ఇప్పుడు ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య ఎంతో పెరిగింది.

– డాక్టర్ సి.దుర్గా కళ్యాణి, ఇన్‌చార్జి డీఎం అండ్‌హెచ్‌వో, పార్వతీపురం మన్యం జిల్లా



డాక్టర్ వైఎస్సార్ తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం వద్ద ఉన్న వ్యక్తి పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆనంద్. ప్రభుత్వాస్పత్రి నుంచి తల్లీ బిడ్డలను వారి ఇంటికి క్షేమంగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ఉచితంగా సమకూర్చుతున్న వాహనం అది. అందులోనే ఆ ఐఏఎస్ అధికారి బిడ్డ, బాలింతరాలైన ఆయన భార్య కార్తీక క్షేమంగా ఆస్పత్రి నుంచి ఇద్దరు నర్సుల సాయంతో బంగ్లాకు చేరుకున్న చిత్రమే ఇది. మరో విశేషమేంటంటే.. ఆ ఉన్నతాధికారికి తీపి వార్త అందించిన ఆస్పత్రి ఏ కార్పొరేట్ ఆస్పత్రో అనుకుంటే పొరపాటే! కార్తీక ఇటీవల పండంటి బిడ్డకు జన్మనిచ్చింది పార్వతీపురంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోనే.



ఈ చిత్రంలో కనిపిస్తున్న బాలింత పార్వతీపురం మన్యం జిల్లాలోని పాచిపెంట మండల అధ్యక్షురాలు బద్నాన ప్రమీల. ఇటీవల ఆమె ప్రసవం కోసం సాలూరులోని ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ఎలాంటి శస్త్రచికిత్స అవసరం రాలేదు. సుఖప్రసవమవగా.. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు.

అత్యుత్తమ సేవలు

పార్వతీపురం మన్యం జిల్లాలో 48 ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులకు, బాలింతలకు, శిశువులకు వైద్య సౌకర్యాలు అందించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. వీటిలో 24 గంటలు పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలే 37 వరకూ ఉన్నాయి. అవే గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో సంజీవనిలా పనిచేస్తున్నాయి. మరో ఐదు సాధారణ పీహెచ్‌సీలు, మరో మూడు ఏరియా ఆస్పత్రులున్నాయి. పార్వతీపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో వైద్య సేవలు గతం కన్నా ఎంతో మెరుగయ్యాయి. తక్కువ బరువు, నెలలు నిండకుండానే జన్మించే శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించేందుకు వీలుగా ప్రత్యేకంగా ఎస్ఎన్‌సీయూ వార్డును కూడా పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో అందుబాటులోకి తెచ్చారు. మిగిలిన ఆస్పత్రుల్లో ఎస్ఎన్‌సీయూ యూనిట్లను ఏర్పాటు చేశారు. పిల్లలకు వ్యాధి నిరోధక వ్యాక్సిన్లను అక్కడే వేస్తున్నారు. జిల్లా ఆస్పత్రితో పాటు మూడు ఏరియా ఆస్పత్రుల్లో బ్రీత్ అనలైజర్లు, వెంటిలేటర్లు, సీటీజీ, కలర్ డోప్లర్ స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే, ఈసీజీ, బ్లడ్ ఫ్రిజ్, హాట్ ఎయిర్ వంటి ఆధునిక వైద్య సౌకర్యాలను ప్రభుత్వం కల్పించింది. అత్యవసర పరిస్థితుల్లో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంత గర్భిణులు ఇబ్బందులు పడకుండా ప్రసవానికి కొద్ది రోజుల ముందస్తుగానే తీసుకొచ్చి వారికి వైద్యం, పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం రెండు చోట్ల మాతాశిశు సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అలాగే, పీహెచ్‌సీల్లో ఇద్దరేసి చొప్పున డాక్టర్లు, ముగ్గురేసి చొప్పున స్టాఫ్ నర్సులు కచ్చితంగా ఉండేలా ప్రభుత్వం నియామకాలను పూర్తి చేసింది. అవసరమైన పారామెడికల్ సిబ్బందినీ నియమించింది. ఎక్కడైనా ఖాళీలు ఏర్పడినా తక్షణమే భర్తీ చేయడానికి వెనువెంటనే ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

క్లుప్తంగా...

ఎయిడెడ్ ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసు 62ఏళ్లకు పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం గతంలో ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఉద్యోగ విరమణ వయసు పెంపును తమకూ వర్తింపజేయాలని ఎయిడెడ్ స్కూళ్ల సిబ్బంది కోరుతున్నారు. ఈ మేరకు ఎయిడెడ్ సంస్థల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి కూడా ఉద్యోగ విరమణ వయసు పెంపును వర్తింపజేస్తూ తాజాగా పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సర్క్యులర్ జారీచేశారు.

డిప్యూటీ కలెక్టర్‌గా జ్యోతి సురేఖ నియామకం

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



సాక్షి, అమరావతి: అర్జున అవార్డు గ్రహీత, అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖను డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతర్జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభను కనబరుస్తూ దేశ, రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న సురేఖకు క్రీడాకారుల కోటాలో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. స్పోర్ట్స్ కోటాలో ఆమె నియామకం కోసం ప్రభుత్వం కేబినెట్ ఆమోదంతో ఏపీ యాక్ట్–1994ను సవరించింది. ఉత్తర్వులు అందిన 30 రోజుల్లోగా భూ పరిపాలనా ప్రధాన కమిషనర్‌కు రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

మద్రాస్ ఎగుమతి విధాన మండలి బృందం శ్రీసిటీ సందర్శన




మద్రాస్ ప్రతినిధుల బృందంతో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

వరదయ్యపాళెం: మద్రాస్ ఎగుమతి విధాన మండలి (మద్రాస్ ఎక్స్‌పోర్ట్ ప్రాసెసింగ్ జోన్–ఎంఈపీజెడ్)కు చెందిన 40 మంది అధికారుల బృందం డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.కె.షణ్ముగ సుందరం, ఐఏఎస్ నేతృత్వంలో శుక్రవారం శ్రీసిటీని సందర్శించింది. వీరికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి శ్రీసిటీ ప్రత్యేకతలు, వాణిజ్య అవకాశాలు, సులభతరమైన వ్యాపారానికి దోహదపడే అంశాల గురించి వివరించారు. మెగా ఇండస్ట్రియల్ పార్కులో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, వ్యాపార అనుకూల వాతావరణం బాగుందని డాక్టర్ షణ్ముగ సుందరం కితాబిచ్చారు. బిజినెస్ కార్యాలయంలో చర్చల అనంతరం పారిశ్రామికవాడ పరిసరాలను పరిశీలించారు. వెర్మిరిస్, ఆస్ట్రోటెక్ స్టీల్స్, ఎవర్టస్, ఎస్‌జీసీ ట్రాన్స్‌మిషన్ పరిశ్రమలను సందర్శించారు.

ఆస్తుల విభజనపై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ : ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం షెడ్యూలు 9, 10 సంస్థలతోపాటు మరో 12 సంస్థలకు చెందిన ఆస్తులు, అప్పుల విభజనపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన ఈ పిటిషన్ శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌తో కూడిన ధర్మాసనం ముందు కొచ్చింది. ఏపీ తరపు సీనియర్ న్యాయవాది కేసీ విశ్వనాథన్ వాదనలు వినిపిస్తూ విభజన చట్టం జూన్ 2, 2014న అమలులోకి వచ్చిందని, ఉమ్మడి రాజధాని హైదరాబాద్ అని తెలిపారు. సంస్థల్ని 58:42గా విభజించారని పేర్కొన్నారు. ఇదే అంశానికి సంబంధించి మరికొన్ని పిటిషన్లు ఉన్నాయిగా అని ధర్మాసనం ప్రశ్నించింది. అవన్నీ వ్యక్తిగత పిటిషన్లు అని, ఇది ఒక అసాధారణ పరిస్థితి అని ధర్మాసనానికి వివరించారు. అడ్వాన్స్ కాపీలను ప్రతివాదులకు అందజేయాలని సూచించిన ధర్మాసనం తదుపరి విచారణను జనవరి రెండో వారానికి వాయిదా వేసింది.

అమరవీరులకు తూర్పు నావికా దళం నివాళులు



అమర వీరులకు నివాళులర్పిస్తున్న వైస్ అడ్మిరల్ శ్రీకుమార్ నాయర్

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): విజయ దివస్ సందర్భంగా తూర్పు నావిక దళం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా అమరవీరులకు నివాళులర్పించారు. బీచ్‌రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వద్ద అమరవీరులకు నావల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వైస్ అడ్మిరల్ శ్రీకుమార్ నాయర్ పూలమాల వేశారు. 1971లో పాకిస్తాన్‌పై జరిగిన యుద్ధంలో అమరులైన భారత సైనికులకు నాయర్ శ్రద్ధాంజలి ఘటించారు.

ఇంటర్ లో 75 శాతం సాధిస్తేనే జేఈఈ మెయిన్‌కు అర్హత

సాక్షి, అమరావతి: జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్–2023లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఈసారి పలు మార్పులు చేసింది. కరోనా సమయంలో సడలింపులిచ్చిన అంశాలను పునరుద్ధరించింది. కొన్ని కొత్త సడలింపులను ప్రకటించింది. జేఈఈ మెయిన్‌కు హాజరయ్యే అభ్యర్థులకు ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులు సాధించి ఉండటం సహా పలు నిబంధనలను పెట్టింది. సెంట్రల్ సీట్ అలకేషన్ బోర్డు నిబంధనల ప్రకారం ఎన్ఐటీ, ఐఐఐటీ, సీఎఫ్ఐటీ తదితర సంస్థల్లో ప్రవేశానికి అభ్యర్థులు జేఈఈలో ఆలిండియా ర్యాంకుతో పాటు ఇంటర్మీడియెట్‌లో 75 శాతం మార్కులు సాధించి ఉండాలి. అలాగే ఇంటర్మీడియెట్‌లోని ప్రతి సబ్జెక్టులోనూ అభ్యర్థి నిర్ణీత అర్హత మార్కులను సాధించాలి. అందువల్ల మెయిన్‌కు 75 శాతం మార్కులు తప్పనిసరి చేసింది.

మరికొన్ని నిబంధనలు

జేఈఈ మెయిన్ తొలి దశ పరీక్షలు జనవరి 24 నుంచి 31 వరకు, రెండో దశ ఏప్రిల్ 6 నుంచి 12వ తేదీ వరకు జరగనున్నాయి. తొలి దశ పరీక్షలకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. రెండో దశ రిజిస్ట్రేషన్లు ఫిబ్రవరి 7న ప్రారంభమవుతాయి. అభ్యర్థులు రెండు విడతల పరీక్షలకు వేర్వేరుగా దరఖాస్తు చేయాలి. ఒక సెషన్‌కు ఒక్క దరఖాస్తే సమర్పించాలి. ఒకటికి మించి దరఖాస్తులు ఇస్తే.. ఆ తరువాత ఎప్పుడు దాన్ని గుర్తించినా ఆ అభ్యర్థిపై కఠిన చర్యలు తీసుకుంటారని ఎన్టీఏ స్పష్టంచేసింది. 2021, 2022 సంవత్సరాల్లో ఇంటర్మీడియెట్, తత్సమాన బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈసారి వయోపరిమితిని విధించకుండా బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణతను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటోంది. అయితే, అడ్మిషన్ల సమయంలో విద్యా సంస్థలు నిర్ణయించే వయోపరిమితి నిబంధనలను అభ్యర్థులు అనుసరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. అలాగే డ్రాపర్ల (గత ఏడాది మెయిన్‌లో ఫెయిలై, మళ్లీ ఈ ఏడాది రాసే వారు, ఇంటర్మీడియెట్ పూర్తి చేసి కొన్ని సంవత్సరాలు వ్యవధి ఇచ్చి జేఈఈకి దరఖాస్తు చేసేవారు)కు వయోపరిమితిని సడలించి వరుసగా మూడుసార్లు మెయిన్‌కు అవకాశం కల్పించింది.

కరోనా సమయంలో సడలించిన నిబంధన పునరుద్ధరణ



ముందుగానే రిజర్వు తేదీల ప్రకటన

రెండు దశల పరీక్షల తేదీల్లో మార్పులు చేయాల్సి వచ్చినా, ఇతర పరీక్షలకు ఆటంకం లేకుండా కొన్ని రిజర్వు తేదీలను కూడా ఎన్టీఏ ఈసారి ముందుగానే ప్రకటించింది. తొలివిడత పరీక్షలకు ఫిబ్రవరి 1, 2, 3 తేదీలను రిజర్వుగా ప్రకటించింది. రెండో విడతకు ఏప్రిల్ 13, 15 తేదీలను రిజర్వు తేదీలుగా పేర్కొంది.

తగ్గిన పరీక్ష కేంద్రాలు

కరోనా సమయంలో భౌతిక దూరం పాటించడం, ఇతర నిబంధనల కారణంగా మెయిన్ పరీక్షలను ఎక్కువ నగరాల్లో నిర్వహించింది. గత ఏడాది కూడా దేశవ్యాప్తంగా 514 నగరాలు, పట్టణాల్లో నిర్వహించింది. ఈసారి వాటిని 399కు కుదించింది. ఇతర దేశాల్లో పరీక్షల కేంద్రాలు గత ఏడాది 24 కాగా ఈసారి 13కు తగ్గించింది.

రిజిస్ట్రేషన్ల ఫీజు పెంపు

రిజిస్ట్రేషన్ల ఫీజులను కూడా ఎన్టీఏ పెంచింది. జనరల్ కేటగిరీ అభ్యర్థుల ఫీజు రూ.650 నుంచి రూ.1,000కి పెంచింది. మహిళలకు రూ.800 చేసింది. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఫీజును రూ.325 నుంచి రూ.500కు పెంచింది. ఇతర దేశాల అభ్యర్థుల ఫీజును రూ.3 వేల నుంచి రూ.5 వేలకు, మహిళల ఫీజును రూ.1500 నుంచి రూ.3 వేలకు పెంచింది. అభ్యర్థులు జేఈఈ మెయిన్ ఆన్‌లైన్ దరఖాస్తులో తల్లిదండ్రులు లేదా సంరక్షకుల ఈమెయిల్, మొబైల్ నంబర్లు తదితర వివరాలను తప్పనిసరిగా ఇవ్వాలని, లేదంటే రిజిస్ట్రేషన్ పూర్తి కాదని ఎన్టీఏ స్పష్టంచేసింది. ఇదిలా ఉండగా కరోనా పరిస్థితులు సద్దుమణిగినా గతంలోని పరిస్థితుల ప్రభావం ఇంకా ఉన్నందున, ఇంటర్మీడియెట్‌లో 75% మార్కుల నిబంధనను ఈసారి కూడా మినహాయించాలని అభ్యర్థులు కోరుతున్నారు. తొలివిడత సెషన్ పరీక్షలకు వ్యవధి తక్కువగా ఉందని, దీనినీ పునఃపరిశీలన చేయాలని అభ్యర్థిస్తున్నారు.

వచ్చే ఏడాది మే 7న 'నీట్'

దరఖాస్తుల ప్రక్రియ త్వరలో ప్రారంభం

సాక్షి, అమరావతి: దేశ వ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర యూజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ, ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) యూజీ–2023 తేదీ ఖరారైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నీట్ యూజీ–2023 క్యాలెండర్‌ను శుక్రవారం ప్రకటించింది. వచ్చే ఏడాది మే 7న దేశ వ్యాప్తంగా నీట్ యూజీ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపింది. పరీక్ష రాయడానికి దరఖాస్తుల ప్రక్రియను త్వరలోనే ప్రారంభించనున్నట్లు పేర్కొంది. 17 ఏళ్ల వయసు కలిగి, గుర్తింపు కలిగిన బోర్డుల్లో బయోలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్ కోర్ సబ్జెక్టులుగా ఇంటర్ లేదా సమానమైన డిప్లమో కోర్సులు చేసిన విద్యార్థులు ఈ పరీక్ష రాయడానికి అర్హులు. దేశ వ్యాప్తంగా 645 మెడికల్, 318 డెంటల్, 914 ఆయుష్, ఇతర కళాశాలల్లో నీట్–యూజీ అర్హత ఆధారంగా ప్రవేశాలుంటాయి. నీట్ యూజీ–2022ను ఈ ఏడాది జూలై 17న దేశ వ్యాప్తంగా నిర్వహించారు. ఈ పరీక్షకు ఏపీలో 65,305 మంది హాజరు కాగా 40,344 మంది అర్హులుగా నిలిచారు. దేశవ్యాప్తంగా 17,64,571 మంది పరీక్ష రాశారు. వీరిలో 9.93 లక్షల మంది అర్హత సాధించారు. రాష్ట్రంలో 11 ప్రభుత్వ, 16 ప్రైవేట్, 2 మైనారిటీ, శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలలున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో 2,185, ప్రైవేట్, మైనారిటీ కళాశాలల్లో 3,175 ఎంబీబీఎస్ సీట్లు కలిపి రాష్ట్రంలో 5,360 ఉన్నాయి. మరోవైపు ప్రభుత్వం 5 వైద్య కళాశాలల్లో 2023 నుంచి అకడమిక్ కార్యకలాపాలు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తోంది. 2023 నుంచి ఒక్కో చోట 150 చొప్పున 750 సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

కొప్పర్తికి రైల్వే లైన్

- కృష్ణాపురం స్టేషన్ నుంచి కొప్పర్తికి అనుసంధానం
- త్వరలో సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న కొప్పర్తిలోని వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్ (ఎంఐహెచ్), వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)లను అనుసంధానిస్తూ కొత్తగా రైల్వే లైన్ నిర్మిస్తోంది. కొప్పర్తికి సమీపంలోని కృష్ణాపురం రైల్వే స్టేషన్ నుంచి కొప్పర్తి వైఎస్సార్ జగనన్న ఎంఐహెచ్‌ను అనుసంధానిస్తూ రైల్వే సైడింగ్‌ను అభివృద్ధి చేయనున్నారు. పీఎం గతిశక్తి మల్టీమోడల్ కార్గో టెర్మినల్ (జీసీటీ) పథకం కింద ఈ రైల్వే సైడింగ్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీఐఐసీ వీసీ, ఎండీ సృజన తెలిపారు. కొప్పర్తి పారిశ్రామిక పార్కు నుంచి సులభంగా సరుకు ఎగుమతి, దిగుమతి చేసుకునేలా కృష్ణాపురం ప్రధాన లైన్ నుంచి సుమారు మూడు కిలోమీటర్లు ప్రత్యేక లైన్ నిర్మిస్తారు. ఇందుకు రూ.50 కోట్లు ఖర్చవుతుందని అంచనా. పారిశ్రామిక పార్కులో నిర్మించే గోడౌన్లను సైడింగ్ లైనుతో అనుసంధానిస్తారు. దీనివల్ల ప్రధాన లైన్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా సులభంగా సరుకు రవాణా చేసుకోవచ్చు. ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ సర్వీస్‌కు ఏపీఐఐసీ టెండర్లను ఆహ్వానించింది. కొప్పర్తిలో ఈ రైల్వే సైడింగ్‌తో పాటు రూ.100.18 కోట్లతో బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ నుంచి నీటి సరఫరా, రూ.21 కోట్లతో అభివృద్ధిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ కేంద్రానికి త్వరలో సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏపీఐఐసీ ప్రణాళికలు సిద్ధంచేసింది.



నూతన వధూవరులకు సీఎం జగన్ ఆశీర్వాదం

మంగళగిరి సీకే కన్వెన్షన్స్‌లో శుక్రవారం జరిగిన మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు మనవడి (గోకరాజు రామరాజు కుమారుడు) వివాహ రిసెప్షన్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై నూతన వధూవరులు సాయిసంజన, ఆదిత్యవర్మలను ఆశీర్వదించారు. - సాక్షి, అమరావతి



ఇంధన శాఖకు సీఎం జగన్ అభినందనలు

ప్రతిష్టాత్మక జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డును రాష్ట్రం గెలుచుకున్న సందర్భంగా ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ పృథ్వీతేజ్, ఏపీ ఇంధన పరిరక్షణ మిషన్ సీఈవో చంద్రశేఖరరెడ్డిలను శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్ అభినందించారు. - సాక్షి, అమరావతి

175 స్థానాల్లో విజయమే లక్ష్యం

- అన్ని చోట్లా అత్యధిక మెజార్టీతో గెలవాలన్నది సీఎం ఆకాంక్ష
- అందుకే చిత్తశుద్ధితో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం
- టీడీపీ క్యాడర్‌ను కాపాడుకునేందుకే చంద్రబాబు ముందస్తు ఎన్నికల జపం
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో 175కు 175 శాసనసభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గడప గడపకు మన ప్రభుత్వంపై వర్క్‌షాప్ ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడున్నరేళ్లుగా సంక్షేమ, అభివృద్ధి పథకాల ద్వారా ప్రతి ఇంటికీ చేసిన మంచిని వివరించి.. ప్రజల ఆశీస్సులు కోరడానికే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అర్హత ఉండీ, ఇంకా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వారికి అందించడం ఈ కార్యక్రమం ఉద్దేశం అని చెప్పారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలుగా ఉన్న వారంతా మళ్లీ అత్యధిక మెజార్టీతో గెలవాలని సీఎం కోరుకుంటున్నారని, అందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారన్నారు. సంక్షేమాభివృద్ధి పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజలు లబ్ధి పొందారని.. గడప గడపకూ వెళ్తోన్న ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీకి నానాటికీ ప్రజాదరణ పెరగడం వల్ల టీడీపీ శ్రేణులు కకావికలం అవుతున్నాయని చెప్పారు. టీడీపీ క్యాడర్‌ను కాపాడుకోవడం కోసం చంద్రబాబు ముందస్తు ఎన్నికల జపం చేస్తున్నారని తెలిపారు. ఆ పేరుతో టీడీపీ నేతలతో డబ్బులు ఖర్చు పెట్టించి కార్యక్రమాలు చేపట్టే ఆలోచనలో చంద్రబాబు ఉన్నట్టుగా అర్థమవుతోందన్నారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచన సీఎం జగన్‌కు, వైఎస్సార్‌సీపీకి లేదని తేల్చి చెప్పారు.

ఇది వర్గాల యుద్ధం



గడప గడపకు మన ప్రభుత్వంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లు, జిల్లాల అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు

▶ మొదటి పేజీ తరువాయి

మనం చేస్తున్న మంచిని.. రానున్న రోజుల్లో చేయబోయే మేలును వివరించండి. మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరండి. మీరు ఆ ఇంటికి కేటాయించే సమయం మీకు ఎంతో మేలు చేస్తుంది. మీ నియోజకవర్గంలో ప్రతి ఇంటిని మీకు చేరువ చేస్తుంది. మీ గెలుపునకు బాటలు వేస్తుంది' అంటూ దిశా నిర్దేశం చేశారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమం కొనసాగుతున్న తీరుపై సమీక్షించారు. ఇకపై మరింత మెరుగ్గా నిర్వహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లు, జిల్లాల అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలకు మార్గ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

సమర్థులనే పార్టీ కన్వీనర్లుగా నియమించండి

- నాయకత్వం వహించే సామర్థ్యం ఉన్న ముగ్గురు కార్యకర్తలనే సచివాలయ కన్వీనర్లుగా నియమించాలి. అందులో తప్పనిసరిగా ఒక మహిళ ఉండాలి. ఎమ్మెల్యేలకు ఇష్టం వచ్చిన వారిని నియమించుకోవచ్చు. వారికి తప్పనిసరిగా స్మార్ట్ ఫోన్ ఉండి తీరాలి. ఆ తర్వాత ప్రతి 50 ఇళ్లకు ఒక తమ్ముడు, ఒక చెల్లిని గృహ సారథులుగా నియమించాలి. వారు ఆ 50 ఇళ్లకు సంబంధించిన వారై ఉండాలి. ఎక్కడా వలంటీర్లు గృహ సారథులుగా ఉండకూడదు.
- పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు జనవరిలో ఆసరా మూడో దఫా రూ.6,500 కోట్లు చెల్లించబోతున్నాం. దానికి సంబంధించి ఇంటింటా ప్రచారం చేస్తూ, వారికి లేఖలు అందిస్తాం. ఆ తర్వాత గృహ సారథుల నియామకానికి సంబంధించి మరో దఫా వెరిఫికేషన్ ఉంటుంది.

మీరంతా మళ్లీ గెలవాలి

మీ మీద నాకు ప్రేమ ఎక్కువ. మీలో ఎవరినీ పోగొట్టుకోవడం నాకిష్టం లేదు. మీ అందరినీ మళ్లీ చట్టసభలో చూడాలి. అదే నా కోరిక. మనం మన బాధ్యత సక్రమంగా నెరవేర్చకపోతే, కోట్ల మంది నష్టపోతారు. మోసంతో కూడిన రాజకీయాలు.. ప్రజలను ఉపయోగించుకుని వదిలేసే రాజకీయాలు.. వెన్నుపోటు రాజకీయాలు.. అబద్ధాల రాజకీయాలు.. ప్రజల మీద, పేదవాడి మీద ప్రేమ లేని రాజకీయాలు రాజ్యమేలుతాయి. మనకు ఎన్నికలకు ఇంకా 16 నెలల సమయం ఉంది. గడప గడపకు.. కార్యక్రమం ఎందుకు చేస్తున్నాం? అని ఒక్కసారి ఆలోచించండి. ప్రతి ఇంట్లో కనీసం 5 నిమిషాలు గడిపి, ఆ ఇంటికి చేసిన మంచిని వివరించి, వారి ఆశీర్వాదం కోరండి. అప్పుడే వారి నుంచి మనకు సానుకూలత లభిస్తుంది. ఎన్నికల ముందు మీకు అంత సమయం ఉండదు కాబట్టి ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరితో మమేకం అవ్వండి. అదే మన గెలుపునకు బాటలు వేస్తుంది.

ఎమ్మెల్యేల ద్వారా ట్యాబ్‌ల పంపిణీ

- రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఎమ్మెల్యేల ద్వారా ట్యాబ్‌ల పంపిణీ మొదలవుతుంది. పగలు ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని.. సాయంత్రం గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించాలి. జనవరి 1వ తేదీ నుంచి పెంచిన పెన్షన్ రూ.2,750 పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాం. పెన్షన్ పెంపుదలపై వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. ఈ వారోత్సవాలలో రోజూ ఏదో ఒక మండలంలో ఎమ్మెల్యేలు పాల్గొనాలి. సాయంత్రం గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించాలి.
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్దేశించిన విధంగా జరగాలి. ప్రతి సచివాలయ పరిధిలో కనీసం రెండు రోజులు.. రోజుకు కనీసం 6 గంటల పాటు తిరగాలి. అలా తిరగని ఎమ్మెల్యేలు.. మరోసారి ఆయా సచివాలయాలు సందర్శించాలి. ప్రతి ఇంటికి వెళ్లాలి. వారికి ప్రభుత్వం వల్ల కలిగిన ప్రయోజనాలు వివరించాలి. ఒక వేళ ఒక గ్రామంలో రెండు రోజుల్లో మొత్తం తిరగలేమనుకుంటే.. మూడు, నాలుగు రోజుల సమయం తీసుకోండి. ఎక్కడా తొందర పడకూడదు. మొక్కుబడిగా పని చేయొద్దు.

ప్రభావం చూపే పనుల్లో రాజీ వద్దు

- గ్రామాల్లో అత్యధిక ప్రభావం చూపే పనులనే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించండి. ఎక్కడా స్వప్రయోజనాలు ఆశించకండి. ఎవరినో సంతోష పరచాలని కూడా ఆలోచించొద్దు. ఆ పనుల కోసం ప్రతి సచివాలయానికి కేటాయిస్తున్న నిధుల్లో ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. అందువల్ల మీరు పనుల ప్రాధాన్యతను గుర్తించి, అక్కడికక్కడే ప్రతిపాదనలతో అప్‌లోడ్ చేస్తే, వెంటనే ఆమోదం లభిస్తుంది.
- అత్యంత ప్రాధాన్యత కలిగిన 23,808 పనులకు సంబంధించి రూ.930.28 కోట్లతో ఎమ్మెల్యేల నుంచి ప్రతిపాదనలు రాగా, వాటిలో 21,275 పనులకు అనుమతి ఇచ్చాం. ఆ పనుల విలువ రూ.828.45 కోట్లు. వాటిలో 17,905 పనులు మొదలయ్యాయి. ఈ పనుల విలువ రూ.662.14 కోట్లు.

సచివాలయంలో సీఎస్ ఆకస్మిక తనిఖీలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి శుక్రవారం సచివాలయం మూడో బ్లాక్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం 11 గంటల సమయంలో మూడో బ్లాక్‌లోని మొదటి అంతస్తులో సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయాలను సందర్శించిన ఆయన.. అక్కడ గుట్టలుగా ఉన్న ఫైళ్లను చూసి ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమైన ఫైళ్లను రికార్డు రూమ్‌కు తరలించాలని, అనవసరమైన వాటిని పద్ధతి ప్రకారం వెంటనే డిస్పోజ్ చేయాలని ఆదేశించారు. పలు సెక్షన్లను పరిశీలిస్తూ సిబ్బంది, వారి పనులపై ఆరా తీశారు. రోజూ ఎన్ని కరెంట్స్ వస్తున్నాయి, ఎన్ని డిస్పోజ్ చేస్తున్నారు, ఎన్ని ఫైళ్లను సర్క్యులేట్ చేస్తున్నారు.. తదితర అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. తరువాత అదే బ్లాక్ గ్రౌండ్‌ఫ్లోర్‌లోని ఉద్యోగుల గ్రంథాలయాన్ని సందర్శించారు. రోజూ ఎంతమంది ఉద్యోగులు వస్తున్నారు, ఎంతమంది గ్రంథపఠనం చేస్తున్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. సెంట్రల్ రికార్డు రూమ్‌లో రికార్డులు భద్రపర్చే ర్యాక్‌లను పరిశీలించారు. అనంతరం ఉద్యోగుల క్యాంటీన్‌ను సందర్శించారు. ఉద్యోగులకు రాయితీపై అందజేస్తున్న అల్పాహార, భోజన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిస్పెన్సరీలోని విభాగాలను, ఉద్యోగుల పిల్లల ప్లే స్కూల్‌ను, ఎస్‌బీఐ బ్రాంచిని ఆయన సందర్శించారు.

స్నానానికి వెళ్లి.. 'కృష్ణ'లో ఐదుగురు గల్లంతు

- ఇద్దరి మృతదేహాలు లభ్యం.. మరో ముగ్గురి కోసం గాలింపు

పెనమలూరు/పటమట (విజయవాడ తూర్పు) : కృష్ణానదిలో స్నానానికి వెళ్లిన ఐదుగురు బాలురు గల్లంతయ్యారు. వారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ముగ్గురి ఆచూకీ కోసం పోలీసులు, రెస్క్యూ సిబ్బంది గాలింపు చేపట్టారు. కృష్ణాజిల్లా పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామ పరిధిలో శుక్రవారం ఈ విషాద ఘటన జరిగింది. విజయవాడ పటమట ప్రాంతంలోని దర్శిపేట అంబేడ్కర్ నగర్‌కు చెందిన షేక్ బాజీ (15), షేక్ హుస్సేన్ (15), తోట కామేష్ (15), మద్దాల బాలు (17), ఇనకొల్లు గుణశేఖర్ (14), పిన్నింటి శ్రీను, షేక్ ఖాశిం అలీ స్నేహితులు. బాజీ, కామేష్ చదువు మానేయగా, హుస్సేన్, గుణశేఖర్ తొమ్మిదో తరగతి, బాలు ఇంటర్ చదువుతున్నారు. వీరంతా ఆడుకోవటానికి వెళ్తున్నామని ఇళ్లలో చెప్పి యనమలకుదురు వద్ద కృష్ణా నది రేవు వద్దకు చేరుకున్నారు. కొద్దిసేపు అక్కడ క్రికెట్ ఆడి, యనమలకుదురు పాయ నుంచి మూడున్నర కిలోమీటర్లు నడుచుకుంటూ గుంటూరు జిల్లా తాడేపల్లి పరిధిలోని పాతూరు ఏటిపాయ ఒడ్డుకు చేరుకున్నారు. పిన్నింటి శ్రీను తప్ప మిగిలిన ఆరుగురు నదిలో స్నానానికి దిగారు. కొద్దిసేపటికే వారంతా మునిగిపోవటం గమనించిన శ్రీను గట్టిగా అరుస్తూ స్థానికంగా ఉన్న పశువుల కాపర్లు, జాలర్లకు చెప్పటంతో వారు వెంటనే నదిలో దూకి ఖాసిం అలీను రక్షించగలిగారు. మిగిలిన ఐదుగురు చిన్నారులు నీట మునిగి గల్లంతయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న పెనమలూరు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లు, రెస్క్యూ సిబ్బంది సాయంతో శివలింగాల గట్టు ప్రాంతంలో గాలించగా.. ఇనకొల్లు గుణశేఖర్, తోట కామేష్ మృతదేహాలు లభ్యమయ్యాయి. షేక్ హుస్సేన్, షేక్ బాజీ, మద్దాల బాలు ఆచూకీ లభ్యంకాలేదు. అప్పటికే చీకటి పడడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. పెనమలూరు సీఐ గోవిందరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మరోవైపు.. ఘటన సమాచారం తెలియగానే విజయవాడ తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. బాధిత కుటుంబాలను కలిసి వారికి అండగా నిలవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఘటన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని చెప్పారు.



ఇనకొల్లు గుణశేఖర్, తోట కామేష్ మృతదేహాలు



మృతులు కామేష్, గుణశేఖర్ (ఫైల్)



గల్లంతైన డి.హుస్సేన్, షేక్ బాజీ, మద్దాల బాలు (ఫైల్)


దర్శిపేటలో విషాదఛాయలు

ఇనకొల్లు గుణశేఖర్, తోట కామేష్ మృతిచెందడం, షేక్ హుస్సేన్, షేక్ బాజీ, మద్దాల బాలు గల్లంతవడంతో దర్శిపేటలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇక ఇంకొల్లు గుణశేఖర్, దూదేకుల హుస్సేన్, మద్దాల బాలుకు తండ్రి లేకపోవటంతో వారి తల్లులే పండ్లు, పూలవ్యాపారం చేస్తూ తమ రెక్కల కష్టంపై పిల్లల్ని సాకుతున్నారు. మృతిచెందిన పిల్లల కుటుంబాలన్నీ నిత్యం రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలే.

బహిరంగ విచారణ ద్వారా అభిప్రాయాలు తెలుసుకోవాలి

- విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్‌కు టీడీపీ నేత పయ్యావుల లేఖ

సాక్షి, అమరావతి: డిస్కంల వార్షిక ఆదాయ అవసరాల నివేదిక ప్రతిపాదనలపై బహిరంగ విచారణ ద్వారా వినియోగదారుల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని టీడీపీ నేత పయ్యావుల కేశవ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ (ఏపీఈఆర్సీ) జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డిని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు లేఖ రాశారు. బహిరంగ విచారణ ద్వారా కాకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలు తెలుసుకోవాలనుకోవడం వినియోగదారుల హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. కరోనా నిబంధనలు సడలించిన తర్వాత కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయాలు స్వీకరించడం సామాన్యులను తమ అభ్యంతరాలపై విచారణకు దూరం చేయడమేనని తెలిపారు. విద్యుత్ సంస్థల సామర్థ్యం పెంచుకోకుండా ప్రభుత్వ సబ్సిడీలు, ప్రభుత్వ సంస్థల బకాయిల వసూలు చేసుకోకుండా వినియోగదారులపై భారాలు మోపడాన్ని మండలి అనుమతించకూడదని కోరారు.



ఇంధన పెట్టుబడులకు ఏపీ అనుకూలం

- ఇంధన సామర్థ్య పెట్టుబడి బజార్ సదస్సులో బీఈఈ డైరెక్టర్ సునీల్ ఖండారే

సాక్షి, అమరావతి: ఇంధనరంగ పెట్టుబడులకు దేశంలోనే అత్యంత అనుకూల పరిస్థితులు ఏపీలో ఉన్నాయని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) డైరెక్టర్ సునీల్ ఖండారే చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఇంధన పరిరక్షణ మిషన్ నేతృత్వంలో శుక్రవారం విజయవాడలో జరిగిన ఇంధన సామర్థ్య పెట్టుబడి బజార్ సదస్సులో ఆయన మాట్లాడారు. పదేళ్లగా ఏటా జాతీయ స్థాయిలో ఇంధన సంరక్షణ అవార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ఈసారి ఏపీకి ప్రథమస్థానం వచ్చిందని, రాష్ట్రపతి చేతుల మీదుగా రాష్ట్ర ప్రభుత్వం అవార్డు అందుకోవడం గొప్ప పరిణామమని కొనియాడారు. పాట్ పథకం దేశంలో దాదాపు 24.5 మిలియన్ టన్ ఆఫ్ ఆయిల్ ఈక్వివలెంట్ ఇంధనాన్ని ఆదా చేసినట్లు తెలిపారు. అందులో 0.818 మిలియన్ టన్ ఆయిల్ ఈక్వివలెంట్ ఇంధనాన్ని ఏపీలోని దాదాపు 50 పరిశ్రమల్లో ఇంధన సామర్థ్య చర్యలను అమలు చేయడం ద్వారా ఆదా చేయడాన్ని ప్రశంసించారు. దీనివల్ల దాదాపు 3,430 మిలియన్ యూనిట్ల విద్యుత్ మిగిలిందన్నారు. దేశంలో పాట్ పథకం ద్వారా దాదాపు రూ.40 వేలకోట్లు ఆదా చేయగా.. రాష్ట్రంలో రూ.2,180 కోట్లు ఆదాచేశారన్నారు. ఇంధన సామర్థ్య ప్రాజెక్టుల అమలులో ఎంఎస్ఎంఈలకు 3 నుంచి 5 శాతం వడ్డీ రాయితీ పథకం కోసం కేంద్రానికి ప్రతిపాదన పంపిన మొదటి రాష్ట్రం ఏపీ అని తెలిపారు.

గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులపై దృష్టి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీ పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని తెలిపారు. ఇందులో భాగంగానే ఇప్పటివరకు రూ.81 వేలకోట్ల విలువైన గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల కోసం రాష్ట్రం ఎంవోయూలు కుదుర్చుకుందని చెప్పారు. రాష్ట్ర ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 30 ఇంధన సామర్థ్య ఫైనాన్సింగ్ ప్రాజెక్టులను గుర్తించినట్లు తెలిపారు. వీటిద్వారా రూ.412.30 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నట్లు బీఈఈ అంచనా వేసిందన్నారు. ఈ సదస్సులో ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ ఐ.పృథ్వీతేజ్, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మ జనార్దనరెడ్డి, ఏపీఎస్ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.





రాగద్వేషాలను వదిలి, ఏకాంత ప్రదేశంలో వసిస్తూ, ఆహారాన్ని స్వల్పంగా మాత్రమే స్వీకరిస్తూ, నిత్యమూ ధ్యాన యోగంలో నిమజ్జుడైనవాడు బ్రహ్మ స్వరూపుడు అవడానికి అర్హుడౌతాడు.

– భగవద్గీత

సాక్షి

శనివారం, డిసెంబర్, 17

ప్రజాస్వామ్యంపై ఎర్డోగన్‌

నియంతృత్వం బహురూపి. అది ఎప్పుడే రూపంలో ఉంటుందో, ఆద్యంతాలేమిటో ఎవరూ అంచనా కట్టలేరు. దాని ఉనికిని గుర్తించేలోపే అది అందరినీ ముంచేస్తుంది. మూడు దశాబ్దాల క్రితం సోవియెట్ యూనియన్ పతనమైనప్పుడు కాలక్రమంలో ఆ శిథిలాల్లోంచి పుతిన్ పుట్టుకొస్తాడనీ, ముమ్మందు కొరకరాని కొయ్యవుతాడనీ యూరప్ దేశాలు అనుకోలేదు. సరిగ్గా టర్కీ విషయంలోనూ ఇప్పుడదే జరుగుతోంది. గత కొన్నేళ్లుగా టర్కీ అధ్యక్షుడు రిసెప్ తయిప్ ఎర్డోగాన్ విపరీత పోకడలు పోవడం కనబడుతూనే ఉంది. అయినా యూరోపియన్ యూనియన్(ఈయూ) పట్టనట్టు ఉంటోంది. ఇక ఇప్పుడు ఆయన అచ్చంగా పుతిన్‌ను అనుకరిస్తున్న వైనం కళ్లకు కడుతోంది. ఇస్తాంబుల్ మేయర్‌గా 2019లో ఎన్నికైన రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ(సీహెచ్‌పీ) నాయకుడు ఎక్రెమ్ ఇమామోలును ఎర్డోగాన్ ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఎన్నికల అధికారులను దూషించారన్న ఆరోపణతో ఇమామోలుకు గురువారం న్యాయస్థానం రెండేళ్ల ఏడునెలల జైలు శిక్ష విధించింది. వచ్చే ఏడాది జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో ఆయన తనకు బలమైన ప్రత్యర్థి అవుతారన్న భయంతోనే ఎర్డోగాన్ పావులు కదిపి ఈ శిక్ష పడేలా చేశారు. దేశంలో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఉన్నత స్థాయి ఎన్నికల బోర్డు అధికార పక్షం చెప్పినట్టల్లా తలూపడం రివాజైంది. ఇటీవల కింది కోర్టులు సైతం అధికార పక్షం అభీష్టానికి అనుకూలంగా తీర్పులివ్వటం మొదలుపెట్టాయి. ఇస్తాంబుల్ మేయర్ ఎన్నిక వ్యవహారం ఆసక్తికరమైనది. 2019 మార్చిలో ఆ పదవికి జరిగిన ఎన్నికల్లో ఇమామోలు స్వల్ప మెజారిటీతో గెలుపొందారు. దీన్ని జీర్ణించుకోలేని ఎర్డోగాన్ ప్రభుత్వం ఆ ఎన్నిక రద్దయ్యేదాకా నిద్రపోలేదు. చివరకు అదే ఏడాది జూన్‌లో మరోసారి ఎన్నికలు నిర్వహించారు. ఈసారి ఇమామోలు ఏకంగా 8 లక్షల ఓట్ల మెజారిటీతో అధికార పక్ష అభ్యర్థిని చిత్తుచేశారు. రాజకీయంగా తన ఎదుగుదలకు మూలకారణమైన చోట ఎన్ని ఎత్తులు వేసినా ప్రత్యర్థి మేయర్ కావటం ఆయనకు కంటగింపైంది. ఇస్తాంబుల్ నగరం దేశానికి ఆర్థికంగా ఆయువు పట్టు. స్థూల దేశీయోత్పత్తిలో దాని వాటా 40 శాతం. అందుకే ఎర్డోగాన్ ప్రభుత్వం మేయర్ అధికారాలను కత్తిరించి, అడుగడుగునా ఇమామోలుకు అడ్డుపడటం మొదలెట్టింది. ఇది చాలదన్నట్టు అధికారులను దూషించారన్న అభియోగం నమోదైంది. 2019 మార్చి ఎన్నిక రద్దు చేసిన అధికారులు బుద్ధిహీనులని అప్పట్లో ఇమామోలు వ్యాఖ్యానించారు. విధి నిర్వహణలో ఉన్న అధికార గణాన్ని ఇలా అనటం నేరమన్నది సర్కారు అభియోగం. తాజాగా ఈ కేసులో పడిన శిక్షను ఉన్నత న్యాయస్థానం ధ్రువీకరిస్తే అధ్యక్ష ఎన్నికలతో సహా ఏ ఎన్నికలోనూ ఇమామోలు అభ్యర్థిగా నిలబడలేరు. ఓటేసే హక్కు కూడా కోల్పోతారు. ఇప్పటికే సీహెచ్‌పీ పార్టీకి చెందిన మరో నేతకు ఇదే రకమైన శిక్షపడింది.

టర్కీ జాతిపిత ముస్తఫా కెమెల్ అటాటుర్క్ నెలకొల్పిన సెక్యులర్ వ్యవస్థనూ, సంక్షేమ రాజ్య భావననూ 2003లో అధికారంలోకి రాగానే ఎర్డోగాన్ ధ్వంసం చేశారు. నయా ఉదారవాద విధానాలను చకచకా అమలుచేశారు. ఆ విధానాల పర్యవసానంగా అంతవరకూ ఒడిదుడుకుల్లో ఉన్న ఆర్థిక వ్యవస్థ బలపడిన మాట నిజమే. వృద్ధి రేటు 9 శాతం దాటింది. కానీ సంపదంతా గుప్పెడుమంది సంపన్నుల చేతుల్లో కేంద్రీకృతమైంది. అవినీతి ఆకాశాన్నంటింది. అటుపై 2008 ఆర్థిక మాంద్యం తీవ్రంగా దెబ్బతీసింది. వృద్ధిరేటు 3 శాతానికి దిగజారింది. ఆ తర్వాత ఇస్లామిక్ భావజాల పరిరక్షకుడిగా ఎర్డోగాన్ అవతారమెత్తారు. ఒకపక్క ఈయూలో భాగస్వామిగా ఉంటూనే అందులోని భాగస్వామ్య దేశాల వల్ల ప్రమాదం ముంచుకొస్తున్నదని ఊదరగొట్టడం ఆయన ప్రత్యేకత. కుర్దులను దేశానికి శత్రువులుగా చిత్రీకరించి వారి ప్రాంతాలపై వైమానిక దాడులు చేయటం, పెనుముప్పును నివారించినట్టు స్వోత్కర్షలకు పోవటం అలవాటు. ఇస్లామిక్ సిద్ధాంతాలు అవలంబించకపోతే దేశం నాశనమవుతుందని ఒకపక్క, ఐఎస్ ఉగ్రవాదుల నుంచి ముప్పు పొంచివుందని మరోపక్క ప్రచారం చేస్తూ 2015 నవంబర్ అధ్యక్ష ఎన్నికల్లో ఆయన విజయం సాధించారు. అటుపై సైనిక తిరుగుబాటు డ్రామాను నడిపి తన పాలనను మరింత సుస్థిరం చేసుకున్నారు. ఇలా ఎప్పటికప్పుడు జనం భావోద్వేగాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటూ వస్తున్న ఎర్డోగాన్‌ను 2019 ఇస్తాంబుల్ మేయర్ ఎన్నిక ఊహించని రీతిలో దెబ్బతీసింది.

టర్కీలో దాదాపు అన్ని రంగాలూ దెబ్బతిన్నాయి. నిర్మాణ రంగం కుదేలైంది. అన్ని రకాల సరఫరాలూ దెబ్బతిన్నాయి. ఆహారం, ఇంధనం ధరలు ఆకాశాన్నంటి ద్రవ్యోల్బణం 170 శాతం వరకూ పోయిందని ఆర్థికవేత్తల అంచనా. ఇలాంటి సమయంలో ఎర్డోగాన్‌ను ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న దురాక్రమణ యుద్ధం ఒకవిధంగా ఆదుకుంది. ఈయూకూ, పుతిన్‌కూ ఏర్పడ్డ విభేదాలను తెలివిగా సొమ్ము చేసుకుని లాభపడుతున్న ప్రపంచ నేతల్లో ఎర్డోగాన్ ఒకరు. ఎంతకాలం ఇలాంటి ఎత్తుగడలతో నెట్టుకొస్తారన్నది చూడాల్సి ఉంది. తనకు 2023 అధ్యక్ష ఎన్నికలే ఆఖరివని ఎర్డోగాన్ చెబుతున్నారు. ఆయన గెలిస్తే భవిష్యత్తులో ఎన్నికలే ఉండవని విపక్షాలు భాష్యం చెబుతున్నాయి. పొరుగున పుతిన్ చేసిందేమిటో గమనిస్తే ఇలా అనటంలో వైపరీత్యమేమీ లేదు. మరో పుతిన్‌లా తయారై దేశంలో రాజకీయ ప్రత్యర్థులను సమాధి చేస్తున్న ఎర్డోగాన్‌ను నియంత్రించటంలో విఫలమైతే, చూసీచూడనట్టు వదిలేస్తే స్వీయ వినాశనం కొనితెచ్చుకున్నట్టేనని ఇప్పటికైనా ఈయూ గుర్తించటం మంచిది.

వారధి కట్టాల్సిన సమయమిది!

దేశంలో ఉన్న ఎన్నో సమస్యలకు సైన్స్, సృజనాత్మకతల సమర్థ మేళవింపుతో మంచి పరిష్కారాలు కనుక్కోవచ్చు. అయితే శాస్త్రవేత్తలు రూపొందించినవే కాదు, గ్రామీణ స్థాయిలో అతితక్కువ ఖర్చుతో కూడుకున్న, కేవలం అవసరానికి తగ్గ సృజనాత్మక పరిష్కారాలూ మనదగ్గర ఉన్నాయి. వీటన్నింటినీ సాధారణ ప్రజలు వారి అవసరానికి తగ్గట్టు అభివృద్ధి పరిచారు. మరి ఈ అట్టడుగు స్థాయి పరిష్కారాలూ, డీప్ టెక్ వంటి అత్యాధునిక పరిష్కారాలూ వేర్వేరుగా ఎదగాల్సిందేనా? ఈ రెండింటినీ మేళవించలేమా? ఈ కీలకమైన ప్రశ్నకు సమాధానం వెతికేందుకు ఒక ప్రయత్నం మొదలైంది. ఢిల్లీలో జరిగిన 'పీపుల్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నొవేషన్స్' ఇందుకు వేదికైంది.

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

భారత్ కేవలం 140 కోట్ల జనాభా ఉన్న దేశం మాత్రమే కాదు, సవాలక్ష సమస్యలతో కూడినది కూడా. సైన్స్, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకతల సమర్థ మేళవింపు, వినియోగాలతో ఈ సమస్యలకు పరిష్కారాలు కనుక్కోవచ్చు. కూడు, గూడు, ఆరోగ్యం, స్వచ్ఛమైన గాలి, నీరు, సమాచార వినిమయం, విద్యుత్తు, విద్య, వ్యవసాయం వంటి అనేక మౌలిక అంశాలకు సంబంధించిన సమస్యలకు పరిష్కారాలు అవసరం. అలాగని వీటికి పరిష్కారాలు, సాంకేతిక పరిజ్ఞానాలు అస్సలు లేవని కాదు. ఉన్నవి అందరికీ అందుబాటులో లేవు, లేదా భరించగలిగే స్థాయిలో లేకపోవచ్చు. ఈ రెండు సాధ్యమైనా అవి అంత సుస్థిరమైనవి కాకపోవచ్చు.

ఒకవైపు మనకు సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత పరిష్కారం ఉండవచ్చు కానీ, కొత్త పరికరాలు, పరిష్కారాలన్నీ ఆధునిక టెక్నాలజీలతో కూడుకున్నవి. ఇప్పుడేమో అన్నింటికీ 'డీప్ టెక్' అన్నది అలవడిపోతోంది. ఇవన్నీ ఇంజినీరింగ్ రంగంలోని వేర్వేరు శాఖల్లో వచ్చిన తాజా మార్పుల ఆధారంగా రూపొందినవే. డీప్ టెక్ అన్నా అది కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, హ్యాప్టిక్స్, రోబోటిక్స్, బ్లాక్‌చెయిన్, బిగ్ డేటా వంటి ఎదుగుతున్న ఇంజినీరింగ్ రంగ సాంకేతిక పరిజ్ఞానాలే.

ఇంకోవైపు... గ్రామీణ స్థాయిలో అతితక్కువ ఖర్చుతో కూడుకున్న, కేవలం అవసరానికి తగ్గ సృజనాత్మక పరిష్కారాలూ ఉన్నాయి. వీటన్నింటినీ శాస్త్రవేత్తలు కాకుండా... స్థానిక సమస్యలకు సాధారణ ప్రజలు అభివృద్ధి చేసిన పరిష్కారాలు. ప్రశ్న ఏమిటంటే... ఈ అట్టడుగు స్థాయి పరిష్కారాలూ... డీప్ టెక్ వంటి అత్యాధునిక పరిష్కారాలూ... వేర్వేరుగా ఎదగాల్సిందేనా? రెండూ కలిసి పనిచేయగల స్థితి ఉందా?

ఈ కీలకమైన ప్రశ్నకు సమాధానం వెతికేందుకు ఇప్పుడిప్పుడే ఒక ప్రయత్నం మొదలైంది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న టెక్నాలజీ ఇన్‌క్యుబేటర్ 'సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ ప్లాట్‌ఫామ్స్'; ప్రొఫెసర్ అనిల్ గుప్తా స్థాపించిన 'గ్రాస్‌రూట్ ఇన్నొవేషన్స్ అగ్మెంటేషన్ నెట్‌వర్క్' (జీఐఏఎన్) సంయుక్తంగా ఇటీవల ఏర్పాటు చేసిన 'పీపుల్స్ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నొవేషన్స్' ఇందుకు వేదికైంది. అట్టడుగు స్థాయి సృజనాత్మక ఆవిష్కరణలు, శాస్త్రాధారిత ఆవిష్కరణలు రెండింటినీ ప్రదర్శించడం దీని ప్రధాన ఉద్దేశం. ఈ క్రమంలో ఇరు పక్షాలు ఒకరి నుంచి ఇంకొకరు నేర్చుకునేందుకు, సామాజిక అవసరాల కోసం పరస్పర సహకారంతో కృషి చేసేందుకు అవకాశం కల్పించడం కూడా ఇందులో ఉన్నాయి.

బహుళార్థక ఆహార శుద్ధి యంత్రాన్ని తయారు చేసిన ధరమ్‌వీర్ కంబోజ్ (యమునా నగర్), గ్యాస్‌బండను సులువుగా మోసుకెళ్లేందుకు మడిచే యంత్రం సిద్ధం చేసిన ముష్తాక్ అహ్మద్ దార్(కశ్మీర్)... కుంగుబాటు సమస్య పరిష్కారానికి ఓ వేరబుల్ యంత్రాన్ని



తయారు చేసిన స్టీమ్ వేదా న్యూరోసైన్సెస్‌కు చెందిన యల్లాప్రగడ రమ్య, లక్ష్య సహాని, సీలింగ్ ఫ్యాన్‌కు చిన్న పరికరాన్ని అమర్చడం ద్వారా వాయు కాలుష్యాన్ని తొలగించగల 'స్వచ్ఛ్.ఐఓ' స్థాపకుడు కరణ్ రావులతో ఇక్కడ చెట్టాపట్టాలేసుకుని తిరగడం చూస్తాం.

ఇలాంటి వేదికలు ఇరు పక్షాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు బాగా ఉపయోగపడతాయి. ఒక వర్గం టెక్నాలజీ సంస్థలు, ఇన్‌క్యుబేటర్స్, వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ వంటి అధికారిక సంస్థల నుంచి వచ్చే ఆవిష్కరణలు ఒక వర్గంగా ఉంటే... అట్టగు వర్గాల సృజనశీలుర సామాజిక, విద్య, ఆర్థిక నేపథ్యం వేర్వేరుగా ఉంటోంది. తమ ఆవిష్కరణలను పరిశీలించే, పరీక్షించే, నిర్ధారించే ఏర్పాట్లు వీరి వద్ద అస్సలు ఉండవు. చాలామంది పాఠశాల విద్య కూడా పూర్తి చేసి ఉండరు. అయితే ఇవి వాస్తవికంగా ఉంటాయి. బాగా అవసరం అనుకున్న సమస్యలకు పరిష్కారాలుగా ఉంటాయి. తగిన సాంకేతిక పరిజ్ఞాన సహకారంతో వీటిని మరింత ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉంది.

కొన్నేళ్లుగా అట్టడుగు వర్గ సృజనశీలురకు జీఐఏఎన్ వంటి సంస్థలు సహాయ, సహకారాలు అందిస్తున్నాయి. ఉదాహరణకు ధరమ్‌వీర్ కంబోజ్ ఫుడ్ ప్రాసెసర్ ఇప్పుడు వందల మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చేరింది. వారు మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు ఏటా కోట్లలో ఆదాయమూ సంపాదిస్తున్నారు. అంతేకాదు... ఈ ఫుడ్ ప్రాసెసర్ ఇప్పుడు ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాలకు ఎగుమతి అవుతోంది కూడా. ఒకప్పుడు ఢిల్లీ వీధుల్లో రిక్షా తొక్కిన ధరమ్‌వీర్ ఇప్పుడు ఈ స్థాయికి చేరడం నిజంగానే స్ఫూర్తిదాయకం. బంకమట్టితో చేసిన ఫ్రిడ్జ్‌లాంటి పరికరం 'మిట్టీ కూల్' కూడా ఇలాంటి ఓ గ్రాస్‌రూట్ ఉత్పత్తే. మార్కెట్‌లోనూ ఇది మంచి విజయం సాధించింది.

సామాజిక అవసరాలకు టెక్నాలజీ ఆసరా...

సామాజిక అవసరాల కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం కొత్తేమీ కాదు. 1970లలోనే మొదలైంది. దేశంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థలు గ్రామీణ పేదలకు చేసిందేమీ లేదన్న స్పృహ కలిగిన శాస్త్రవేత్తలు కొంతమంది పారిశ్రామికవేత్తలతో కలిసి కొన్ని కార్యక్రమాలు చేపట్టారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (బెంగళూరు) అధ్యాపకుడు ఏకేఎన్ రెడ్డి 'అప్లికేషన్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ టు రూరల్ ఏరియాస్' (అస్త్ర) పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేశారు. అధిక సామర్థ్యమున్న పొయ్యి ఒకదాన్ని ఏకేఎన్ రెడ్డి అభివృద్ధి చేశారు. కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాల్లో ఈ టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చారు.

1980లలో రాజీవ్ గాంధీ ప్రభుత్వం కూడా సామాజిక అవసరాల కోసం టెక్నాలజీ వాడకాన్ని మొదలుపెట్టింది. రైల్వే రిజర్వేషన్ల కంప్యూటరీకరణ, గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజిలు, వాతావరణ అంచనా కోసం సూపర్ కంప్యూటర్ల వాడకం అప్పుడే మొదలైంది.

భారతీయుల సమస్యకు టెక్నాలజీ ఆధారిత పరిష్కారానికి 'సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ టెలిమాటిక్స్' (సీ–డాట్) ఓ అద్భుత నిదర్శనం. గ్రామీణ ప్రాంతాల్లో టెలిఫోన్ల సంఖ్య తక్కువగా ఉండటం, నెట్‌వర్క్ కూడా అంత బాగా లేకపోవడం తెలిసిందే. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న టెలిఫోన్ ఎక్స్ఛేంజిలను వాడుతూండటం దీనికి కారణం. ఈ విదేశీ ఎక్స్ఛేంజిలు అధిక ఉష్ణోగ్రతలను, ఎక్కువ కాల్స్‌ను తట్టుకునేలా డిజైన్ చేయలేదు. ఎయిర్ కండీషనర్ ఉంటేనే వీటిని ఏర్పాటు చేసుకునే పరిస్థితి ఉండేది. కాల్స్ సంఖ్య ఎక్కువైతే పని చేయడం ఆగిపోయేది. ఈ సమస్యలకు పరిష్కారంగా అతితక్కువ విద్యుత్తును ఉపయోగించుకునే సర్క్యూట్ల ద్వారా సీ–డాట్ ఓ డిజిటల్ స్విచ్‌ను తయారు చేసింది. ఫలితంగా బయటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీ సెల్సియస్ దాటినా టెలిఫోన్ ఎక్స్ఛేంజిలు నిరాఘాటంగా పనిచేసేవి.

ఈ నేపథ్యంలో అసంఘటిత రంగంలో ఉన్న సృజనశీలురను వెలికితీసేందుకు అహ్మదాబాద్ ఐఐఎం అధ్యాపకుడు ప్రొఫెసర్ అనిల్ గుప్తా ఓ వినూత్నమైన కార్యక్రమాన్ని చేపట్టారు. 1990లలో అట్టడుగు వర్గాల అసలైన సృజనలను గుర్తించి, పరీక్షించి, నిర్ధారించడం మొదలుపెట్టారు. అంతేకాకుండా ఈ సృజనశీలురను అధికారిక వ్యవస్థలో పనిచేస్తున్న శాస్త్రవేత్తలతో అనుసంధానించేందుకూ, తద్వారా వారి ఉత్పత్తులు, ఆవిష్కరణలను మరింత మెరుగు పరిచేందుకూ ఏర్పాట్లు చేశారు. ఇరవై ఏళ్లుగా వేల మంది సృజనశీలురలను గుర్తించడం... వారి ఆవిష్కరణలను వాణిజ్య స్థాయికి తీసుకురావడం జరిగింది. ఇన్నొవేషన్ ఫెస్టివల్ కూడా సృజన శీలురలను టెక్నాలజీ ఆధారిత స్టార్టప్‌లతో అనుసంధానిస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

ఏతావాతా... అడ్డంకులను బద్దలు కొట్టాల్సిన సమయమిది!

వ్యాసకర్త విజ్ఞానశాస్త్ర వ్యాఖ్యాత

('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

అంతా కలిస్తేనే...



వార్షిక స్మరణ: 1971లో బంగ్లాదేశ్‌లో భారత క్షేత్రస్థాయి బలగాలను నడిపినది ఒక సిక్కు. తూర్పు విభాగపు వైమానిక దళాన్ని నడిపినది ఒక ముస్లిం. అప్పటి భారత సాయుధ బలగాల అధిపతి ఒక పార్శీ. ఇక పాకిస్తాన్ లొంగుబాటును సాధ్యం చేసిన అసమాన వ్యూహకర్త ఒక యూదు.

– కపిల్ కొమిరెడ్డి, రచయిత

సంపూర్ణ లొంగుబాటు



1971లో జరిగిన బంగ్లాదేశ్ యుద్ధంలో ఇండియాకు లొంగి పోయిన పాక్ సాయుధ బలగాలు కేవలం 34,000 మంది మాత్రమే ననీ, మిగిలినవాళ్లు ముఖ్యంగా పౌరులనీ అబద్ధ మాడుతున్న పాకిస్తానీలు అందరూ 'ది ఇన్‌స్ట్రుమెంట్ ఆఫ్ సరెండర్' చదవాలి. "ఈ లొంగుబాటు మొత్తం పాకిస్తాన్ నేల, గగనతలం, నావికా దళాలు, ఇంకా పారా– మిలిటరీ బలగాలు, పౌరాయుధ బలగాలు అన్నీ కలిపి."

– గౌరవ్ ఆర్యా, ఆర్మీ మేజర్ (రిటైర్డ్)

శ్రమే దయ్యం



ఎలాంటి పరిస్థితుల్లో కూలివాళ్లు విషాదంగా పరిణమించే చవకరకం మద్యం తాగుతారో బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు తెలిసినట్టు లేదు. చారిత్రకంగా, మితిమీరిన పని, కూలీ నష్టం నుంచి కాపాడే చట్టాల గైర్హాజరీలో కూలివాళ్లు తమ కఠినశ్రమను మరిచిపోయి ఇంద్రియాలను మొద్దుబార్చుకోవడానికి తాగుతారు.

– రుబీ కుమార్, జర్నలిస్ట్

నిర్మాణ ప్రతిభ



భారత రెండు గొప్ప ఇతిహాసాల్లో రామాయణం ఒకటి. తమిళనాడులోని రామేశ్వరంలో రామాంజనేయుల విజయాన్ని ఉత్సవం చేస్తున్న విస్మయ కర శివాలయం దర్శించాను. అద్భుతమైన దక్షిణ భారత కౌశలం. ఎంత మనోహరమైన యాత్ర!

– ఎరిక్ సోల్‌హెయిమ్, నార్వే మాజీ దౌత్యవేత్త

ఇదీ 'అమృత' భారతం!

దేశం స్వాతంత్య్రం పొంది ఏడున్నర దశాబ్దాలు అయినా ఇంకా అనేక రంగాల్లో దయనీయంగానే ఉండటం విచారకరం. ప్రభుత్వాలు, పార్టీలు మారినా... విధానాలు, సిద్ధాంతాలు, ఎజెండాలు, జెండాలు మారినా దేశం అనేక సమస్యలతో అతలాకుతలం అవుతూనే ఉంది. విద్య, వైద్యం, కూడు, గూడు, గుడ్డ వంటి ప్రజల కనీస అవసరాలు తీరని వైనం కళ్ల ఎదుట నాట్యం చేస్తూనే ఉంది. దేశ స్వాతంత్య్ర అమృతోత్సవ కాలంలోనూ కరెంటు లేని గ్రామాలు, పాఠశాలలు లేని ఊళ్లు, రోడ్డు సౌకర్యంలేని ప్రాంతాలూ అనేకం ఉన్నాయి. ఇటువంటి సమస్యలెన్నో ఇవ్వాళ సోకాల్డ్ అతి పెద్ద ప్రజాస్వామ్య దేశానికి సవాళ్లుగా నిలిచాయి. ఇదే సమయంలో వ్యక్తిగత భద్రత, సామాజిక రక్షణ, దేశ రక్షణ వెక్కిరిస్తూ నిలుచున్నాయి. అంకెల్లో అభివృద్ధి ఆకాశానికి చేరుకున్నా వాస్తవంలో పాతాళం దగ్గరే ఉండిపోయింది. ఈ స్థితిలో ఉన్న దేశం... భవిష్య ప్రణాళికల కోసం ఎదురుచూస్తోంది.

స్వతంత్ర దేశంగా 3 శాతం ప్రపంచ జీడీపీలో భాగం కలిగిన భారత్ 36 కోట్ల జనాభా, 12 శాతం అక్షరాస్యతతో భవిష్యత్‌లోకి ప్రయాణం ఆరంభించింది. ఏడున్నర దశాబ్దాల తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే, జనాభా దాదాపు నాలుగు రెట్లు (దాదాపు 140 కోట్లు) పెరిగింది. అక్షరాస్యత ఆరింతలకు (74.37 శాతం) పైగా పెరిగింది. ప్రపంచ జీడీపీలో 2018 లెక్కల మేరకు రెండింతలు మాత్రమే పెరిగి 7.74 శాతంగా మిగిలింది.



1990 దశకాల నుండి ఎన్ని ఆర్థిక, వాణిజ్య, వ్యాపార సరళీకృత విధానాలను అమలుపరిచినా దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి అంతంత మాత్రంగానే ఉంది. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతన్న ఆత్మహత్యలను ఆశ్రయిస్తున్నాడు. శాస్త్ర సాంకేతిక విజ్ఞానం, ఐటీ పరిశ్రమలు... పెరిగినా పేదరికాన్నీ, నిరుద్యోగాన్నీ, తిండీ బట్టలనూ సమకూర్చలేకపోయింది దేశం. చదువుకున్న చదువుకు అనుగుణమైన ఉపాధి, ఉద్యోగం జనానికి లభించడం లేదు.

సగటు మనిషి ప్రయాణాన్ని సులభతరం, సుఖమయం చేసిన రైల్వే వ్యవస్థ 1961లో జాతీయీకరణ పొంది, దినదినం నవీనీకరణ పొందుతూ ఉన్నా... నేటి కాలంలో పెరుగుతున్న పన్నుపోట్లు రైలు యానాన్ని కూడా దుర్భరం చేస్తున్నాయి. రక్షణ విభాగంలో ఆధునికీకరణను పెంచుకుంటున్నా... ఇరుగు పొరుగు దేశాలతో సంబంధాలు మెరుగు పడనంతవరకూ దేశ అభివృద్ధిపై దృష్టి నిలపడం అసాధ్యమనే చెప్పాలి.

'చిప్కో' లాంటి ఉద్యమాలు పర్యావరణం మీద ఎంత అవగాహన పెంచినా... ప్రకృతిని కొల్లగొట్టడంలో అవలంబిస్తున్న విపరీత ధోరణులు గ్లోబల్ వార్మింగ్‌కు దారితీస్తూనే ఉన్నాయి. ఫలితంగా అకాల వర్షాలు, విపరీత ఉష్ణోగ్రతలు వంటి ఉపద్రవాలు సంభవించి మానవ జీవనానికీ, పంటలకూ... విపరీతమైన కష్ట నష్టాలు సంభవిస్తున్నాయి. పంచాయతీరాజ్, మండల వ్యవస్థ, స్థానిక సంస్థల పరిపాలనను సుసంపన్నం చేసినా దేశానికి పట్టుగొమ్మలైన పల్లెలింకా అనుకున్నంత పురోగతిని సాధించలేదనే చెప్పాలి. అవినీతి, అక్రమాలు, లంచగొండితనం, పక్షపాతం, బంధుప్రీతి, వారసత్వ రాజకీయాలు తీరని నష్టాన్ని కలిగిస్తూనే ఉన్నాయి.

అలాగని భారతదేశం బాగుపడలేదని కాదు. 75 ఏళ్ల స్వతంత్ర భారతం ప్రపంచంలో తనదైన అస్తిత్వాన్ని చాటుకుంటూ కొన్ని రంగాల్లో స్వావలంబన సాధిస్తూనే ఉన్నా... సాధించాల్సింది ఎంతో ఉంది. స్వతంత్ర పోరాట కాలంలో పెల్లుబుకిన ఐక్యతా స్ఫూర్తి ప్రస్తుతం దేశ అభివృద్ధికి కంకణ బద్ధం కావడంలోనూ వెల్లివిరియాలి. నేటి దుఃస్థితికి మీరంటే మీరని నిందించుకోవడం; జరిగిన అంతో ఇంతో అభివృద్ధికి తామే కారణమని అని ప్రగల్భాలు పలకడం మాని చిత్తశుద్ధితో పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పెద్దలు కృషి చేయవలసి ఉంది.

– ఎ. వి. సుధాకర్

వ్యాసకర్త అసోసియేట్ అధ్యక్షులు, ఎస్టీయూటీఎస్

ఉషాగమనంతో నవశకం వస్తుందని...

సందర్భం



గుత్తా జ్వాల

భారతీయ పరుగుల యంత్రం పీటీ ఉషకు ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) అధ్యక్ష పదవి చాలా కాలం తర్వాతే వచ్చిందని చెప్పాలి. ఆమె ఒక లెజెండ్. ఒక ఆదర్శ క్రీడాకారిణి. పైగా ఆమెకు నేను వీరారాధకురాలిని కూడా. నేను ఎల్లప్పుడూ ఆదర్శమూర్తిగా భావించిన ఒక మాజీ క్రీడాకారిణి ఐఓఏ ప్రప్రథమ మహిళా అధ్యక్షురాలు కావడం నాకు విస్మయం కలుగజేస్తోంది.

ఒక క్రీడాకారిణి అసోసియేషన్ అధ్యక్షురాలిగా... క్రీడా నేపథ్యం లేని అధ్యక్షులకన్నా తప్పకుండా తనదైన ప్రత్యేకతను చూపే అవకాశం ఉంది. క్రీడాకారుల పట్ల సహానుభూతిని ప్రదర్శించగలగడమే అందుకు కారణం. నేను ఇలా చెప్పడానికీ హేతువుంది. ఒక మంచి పాలనా నిర్వాహకుడితో క్రీడాపరమైన అనుభవాన్ని పొందే అదృష్టం నాకు లేకుండా పోయింది. పలు కారణాల వల్ల నేను లక్ష్యంగా మారుతూ వచ్చాను. క్రీడాకారిణిగా నిలకడతనం ప్రదర్శించినప్పటికీ నాకు ఎంతగానో అవసరమైన మద్దతును నేను పొందలేకపోయాను.

మహిళా అధ్యక్షురాలిగా ఉష తన బాధ్యతా నిర్వహణలో వ్యత్యాసాన్ని ప్రదర్శించగలరు. అలా చేయడానికి ఆ పదవిలో ఆమెకు అలాంటి అవకాశం ఉంటుంది మరి. నిజం చెప్పాలంటే అధికార స్థానాలు గొప్ప బాధ్యతలను తీసుకొస్తాయి. పైగా తరచుగా అవి మీ కళ్లను తెరిపిస్తాయి కూడా. ఈరోజు నేను అకాడెమీ నడుపుతూ నేర్చుకుంటున్నది ఇదే. ప్రతి ఒక్కరినీ సంతృప్తిపర్చాల్సిన అవసరం వల్ల... ఎవరైనా సరే జాగరూకతతో, సమతూకంతో ఉండాల్సి ఉంటుంది. అదే సమయంలో మీరు తీసుకునే నిర్ణయాల వల్ల ఎవరూ చింతించకూడదు. ఇది ఎవరు నడవడానికైనా కఠినమైన దారిగానే ఉంటుంది. అందుకే ఇది ఉషకు సులభమైన పనిగా మాత్రం ఉండదు. కానీ ఒక గోచరనీయమైన మార్పును ఆమె తీసుకువస్తుందని నా నమ్మకం.

కొత్త ఐఓఏ అథ్లెట్స్ కమిషన్‌కి సంబంధించి సంతవరకు... క్రీడా సంస్థల విషయంలో నేను చూసిన ఒత్తిళ్లకు లొంగిపోదనే భావిస్తున్నాను. ఒక ఎదుగుతున్న క్రీడాకారుల అసోసియేషన్‌లో నేను భాగం కావాలనుకున్నప్పుడు అది ఊపిరాడకుండా చేస్తుందని తెలుసుకున్నాను. అందుకనే ఉష ఐఓఏలో గణనీయమైన మార్పులను తీసుకువస్తారనీ, అథ్లెట్స్ కమిషన్‌కి నిర్ణయాలు తీసుకోవడంలో మరింత స్వాతంత్య్రాన్ని ఇస్తారనీ, బోర్డులోని క్రీడాకారుల్లో భద్రతనూ, ఆత్మవిశ్వాసాన్నీ పెంపొందిస్తారనీ నేను నమ్ముతున్నాను. అది భారతదేశంలో క్రీడలకు గొప్ప విజయాన్ని తెచ్చిపెడుతుంది.

యువ ఆకాంక్షలతోనూ, అనుభవజ్ఞులైన క్రీడాకారులతోనూ నిండి ఉండే సంస్థలో అందరి అభిప్రాయాలను తప్పక వినాల్సి ఉంటుంది. యువ క్రీడాకారులకు వారికి మద్దతిచ్చే బలమైన సంస్థ అవసరం ఉంటుంది. ఇక సీనియర్లకైతే ప్లాట్‌ఫాం ప్రాధాన్యతను ప్రభావితం చేసే సంస్థ అవసరం ఉంటుంది. ఎందుకంటే క్రీడలకు మరోవైపు ఎలా ఉంటుందనేది వారు తెలుసుకుంటారు.



పీటీ ఉష

మనందరం ఒకటిగా కలిసి నడిస్తే, మార్పును తీసుకురాగలమని నేను నమ్ముతాను. అప్పుడు ఇది కమిషన్ పరిధిని దాటి ప్రభావం చూపుతుంది. క్రీడాకారులు గొంతెత్తి మాట్లాడాల్సి ఉంటుంది. వారు కచ్చితంగా మాట్లాడాలి. అన్నిటికంటే ముఖ్యంగా వారు మాటమీద నిలబడాల్సి ఉంటుంది. ఇది అతి స్పష్టమైన విషయం. అందుకే నేను కంటికి కనిపించే, మనం స్పృశించగల మార్పు రావలసిన అవసరాన్ని నొక్కి చెబుతున్నాను. ఇది ఎవరూ తిరస్కరించలేనిది. చరిత్ర కఠినమైన గురువుగా నన్ను కాస్త సంశయవాదిగా తయారుచేసింది. అదే సమయంలో సంస్థ భవిష్యత్తుపై నాదైన వ్యక్తిత్వంతో ఆశాభావంతోనే ఉన్నాను.

ఉష సంస్థ లోపల క్రీడాకారులకు మరింత స్వాతంత్య్రం గురించి సలహా ఇవ్వాలి. దీనివల్ల క్రీడాకారులందరి శ్రేయస్సుకు ఐఓఏ ప్రాధాన్యత ఇవ్వగలదు. ఈ శ్రేయస్సు క్రీడలను దాటి ముందు కెళ్లడమే కాదు, మానసిక సమస్యల నుంచి వేధింపుల దాకా... చివరకు లైంగిక వేధింపు వరకూ క్రీడాకారులు ఎదుర్కొనే అన్ని రకాల సమస్యలను పట్టించుకుంటుంది. ఒక క్రీడాకారిణిగా ఈ వ్యవస్థలో ఉన్న అనేక వేధింపులు, దోపిడీకి చెందిన కేసులు నాకు తెలుసు. పలువురు క్రీడాకారులు వాటి గురించి మాట్లాడటానికి భయపడతారని కూడా నాకు తెలుసు. తమ క్రీడా విన్యాసాలను నిజంగా ప్రదర్శించడానికి క్రీడాకారులకు, సంస్థకు మధ్య నిజమైన దాపరికం లేని కమ్యూనికేషన్ ఇప్పుడు అత్యంత అవసరం.

దేశానికి ప్రాతినిధ్యం వహించాలనీ; స్వదేశానికి విజయాలు, ట్రోఫీలు తీసుకుని రావాలనీ కోరుకునే క్రీడాకారులు ముందు తాము సురక్షితంగా ఉన్నామని ఎవరికి వారు అనుభూతి చెందగలగాలి. క్రీడల్లో భాగమై ఉండే ఒత్తిళ్లను మైదానంలోనే వదిలేయాల్సి ఉంటుందని వారు తెలుసు కోవాలి. నిరంతర స్క్రూటినీ భయం వెంటాడుతూ ఉండే క్రీడాకారుల కోసం సంస్థ ఎల్లప్పుడూ పారదర్శకంగా, సంసిద్ధంగా ఉండే కమ్యూనికేషన్ చానల్‌ను కలిగి ఉండాలి. సమస్య ఎంత చిన్నదైనా, పెద్దదైనా క్రీడాకారులను సంస్థ పట్టించుకుంటే వారు వాటిని అధిగమించి ముందుకెళ్ల గలుగుతారు. క్రీడాకారులు కోరుకునే గౌరవం, మర్యాదను కల్పించినట్లయితే... అప్పుడు వారు తమ పోరాటాలకు మద్దతు కోసం మీడియా వద్దకు లేదా న్యాయస్థానాల దగ్గరకు పరుగెత్తాల్సిన అవసరం ఉండదు. బాధితులను బాధించే కాలం ఇంకెంత మాత్రం కొనసాగరాదు. ఇప్పుడే, ఈ క్షణమే తప్పకుండా దానికి ముగింపు పలకాలి.

పీటీ ఉష భారత ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష బాధ్యతలు చేపడుతున్నందున క్రీడాకారుల ఈ ఆకాంక్షలను ఆమె నెరవేర్చుతారని నేను ఆశిస్తున్నాను. అప్పుడు మాత్రమే ప్రతి క్రీడాకారుడూ, క్రీడాకారిణీ తాము ఎవరైనప్పటికీ... క్రీడా రంగ పురోగమనంలో తమ పాత్రను తాము అర్థం చేసుకుని దాని పురోభివృద్ధికి తోడ్పడతారు.

వ్యాసకర్త బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: బ.నవమి రా.10.44 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: హస్త పూర్తి (24గంటలు), వర్జ్యం: ప.2.13 నుండి 3.55 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.27 నుండి 7.55 వరకు, అమృతఘడియలు: రా.8.53 నుండి 10.22 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు; సూర్యోదయం 6.31; సూర్యాస్తమయం 5.28.

క్లుప్తంగా...

శ్రీవారి సర్వ దర్శనానికి 24 గంటలు



ఆలయం వెలుపల భక్తుల రద్దీ

తిరుమల: తిరుమలలో రద్దీ అధికంగా ఉంది. 14 క్యూ కంపార్ట్‌మెంట్లు నిండి ఉన్నాయి. సర్వ దర్శన టోకెన్లు లేని వారికి 24 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటలు పడుతోంది. గురువారం హుండీ ఆదాయం రూ.4.13 కోట్లు వచ్చినట్లు టీటీడీ తెలిపింది.

పెద్దదర్గాలో సినీ నటుడు మంచు మనోజ్



పెద్దదర్గాలో ప్రార్థనలు చేస్తున్న సినీ నటుడు మంచు మనోజ్

కడప కల్చరల్: కడపలోని సుప్రసిద్ధ సూఫీ పుణ్యక్షేత్రమైన పెద్ద దర్గాను సినీ హీరో మంచు మనోజ్ శుక్రవారం దర్శించుకున్నారు. ప్రధాన గురువుల మజార్లకు పూలచాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. దర్గాలోని ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ త్వరలో కొత్త ప్రాజెక్టులు, కొత్త సినిమా మొదలు పెడుతున్నామని తెలిపారు. తొలుత బంధుమిత్రులతో కలిసి వచ్చిన మనోజ్‌కు దర్గా ముజావర్ అమీర్ స్వాగతం పలికారు.

నేడు విశాఖలో పద్మనాభరెడ్డి స్మారక ఉపన్యాసం

- హాజరు కానున్న హైకోర్టు న్యాయమూర్తులు

విశాఖ లీగల్: ప్రముఖ న్యాయవాది దివంగత చాగరి పద్మనాభ రెడ్డి స్మారక ఉపన్యాసాన్ని శనివారం ఉదయం విశాఖలోని దసపల్లా హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేష్ కుమార్ చెప్పారు. చేతిరాత నిపుణుల సాక్ష్యం, అదనపు న్యాయపరమైన అంగీకారం, సాంకేతిక సాక్ష్యం, సాక్ష్యంపై న్యాయ ప్రశంసలు అంశాలపై పద్మనాభ రెడ్డి కుమారుడు, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్ కుమార్ ప్రసంగిస్తారు. ఏపీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ బి.శ్యామ్ సుందర్, జస్టిస్ భీమపాక నగేష్ తదితర ప్రముఖులు పాల్గొంటున్నట్లు చెప్పారు.

జనవరి 6 నుంచి విశాఖలో గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్

మహారాణిపేట (విశాఖ దక్షిణ): జనవరి 6 నుంచి 8 వరకు విశాఖలో గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. దేశ విదేశాల నుంచి ఎంతో మంది వైద్య నిపుణులు ఈ సమ్మిట్‌లో పాల్గొంటున్నారన్నారు. మానసిక వైద్యం, నెఫ్రాలజీ, చిన్నారుల ఆరోగ్యం, హృద్రోగ సమస్యలపై విస్తృత స్థాయిలో చర్చలు జరుగుతాయన్నారు. అధునాతన పద్ధతులు, మారుతున్న పరిస్థితులపై వైద్య నిపుణులు చర్చిస్తారన్నారు. అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ ఆధ్వర్యంలో ఈ సమ్మిట్ జరుగుతుందన్నారు.

అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే అమరావతి ఉద్యమం

- 810వ రోజు రిలే నిరాహార దీక్షలో మండిపడ్డ బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: తమ హయాంలో రాజధానిలో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే బాబు అండ్ కో అమరావతి ఉద్యమంతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 810వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లాడారు. రాష్ట్ర ప్రజలందరి నుంచి వచ్చిన ఆదాయాన్ని కేవలం ఓ సామాజికవర్గం మాత్రమే అభివృద్ధి చెందేలా పెట్టుబడులు పెట్టాలనుకోవడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. పెట్టుబడిదారుల కనుసన్నల్లో అమరావతి ముసుగులో ఢిల్లీ వెళ్లిన టీడీపీ నాయకులు సాధించేదేమీ ఉండదని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి ఇంగ్లిష్ మీడియం విద్య అందించడం శుభపరిణామమన్నారు. దానిని కూడా అడ్డుకునేలా చంద్రబాబు దుర్మార్గంగా వ్యవహరించి తప్పుడు కేసులు వేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. నాయకులు నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, పల్లె బాబు తదితరులు పాల్గొన్నారు.

‘పాపికొండల’ ప్రత్యేక ప్యాకేజీలు

- రాజమండ్రి, గండి పోచమ్మ, పోచవరం నుంచి బోట్లు రెడీ
- వివరాలు వెల్లడించిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ

క్రిస్మస్, సంక్రాంతి వేళ బోటులో విహార యాత్ర



భవానీపురం(విజయవాడపశ్చిమ): పర్యాటకుల మనస్సుదోచే తూర్పు గోదావరి జిల్లా పాపికొండల విహార యాత్రకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి శాఖ (ఏపీటీడీసీ) ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించింది. క్రిస్మస్, సంక్రాంతి పండుగల వేళ కుటుంబ సభ్యులతో కలిసి బోటులో విహరించేందుకు ఒకటి, రెండు రోజుల టూర్‌లను రాజమండ్రి, పోచవరం, గండి పోచమ్మ ప్రాంతాల నుంచి సిద్ధం చేసింది. ఆ ప్యాకేజీ వివరాలను ఏపీటీడీసీ కాకినాడ డివిజనల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్ శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. రాజమండ్రి, గండి పోచమ్మ నుంచి పాపికొండలు వెళ్లే వారు సెల్ : 98486 29341, 98488 83091 నంబర్లలో, పోచవరం నుంచి పాపికొండలు వెళ్లే వారు సెల్ : 63037 69675 నంబర్లో సంప్రదించాలని కోరారు.

రాజమండ్రి నుంచి ఒక రోజు పర్యటన

రాజమండ్రి నుంచి పాపికొండలకు ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు పెద్దలు ఒక్కొక్కరికి రూ.1,250, చిన్నారులు ఒక్కొక్కరికి రూ.1,050 చార్జీగా నిర్ణయించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం శాఖాహార భోజనం, సాయంత్రం స్నాక్స్ ఇస్తారు.

రాజమండ్రి నుంచి 2 రోజుల పర్యటన

రాజమండ్రి నుంచి పాపికొండలకు ఉదయం 7.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 7.30 గంటలకు తిరిగి వస్తారు. పెద్దలకు రూ.3,000, పిల్లలకు రూ.2,500 చార్జీ. మొదటి రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం శాఖాహార భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రికి 2 నాన్‌వెజ్ కూరలతో భోజనం, 2వ రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం 2 నాన్‌వెజ్ కూరలతో భోజనం, సాయంత్రం స్నాక్స్.

పోచవరం నుంచి ఒక రోజు పర్యటన

పోచవరం నుంచి పాపికొండలకు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు. పెద్దలకు రూ.950, పిల్లలకు రూ.750 చార్జీ. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం శాఖాహార భోజనం, సాయంత్రం స్నాక్స్.

పోచవరం నుంచి 2 రోజుల పర్యటన

పోచవరం నుంచి పాపికొండలకు ఉదయం 7.30 గంటలకు బయలుదేరి తిరిగి మరుసటి రోజు సాయంత్రం 7.30 గంటల వరకు. పెద్దలకు రూ.2,500, పిల్లలకు రూ.2,000 చార్జీ. మొదటి రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం శాఖాహార భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రికి 2 నాన్‌వెజ్ కూరలతో భోజనం, 2వ రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం రెండు నాన్‌వెజ్ కూరలతో భోజనం, సాయంత్రం అల్పాహారం.

గండి పోచమ్మ నుంచి ఒక రోజు పర్యటన

గండి పోచమ్మ నుంచి పాపికొండలకు ఉదయం 9.30 గంటలకు బయలుదేరి సాయంత్రం 5 గంటల వరకు. పెద్దలకు రూ.1,000, పిల్లలకు రూ.800 చార్జీ. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం శాఖాహార భోజనం, సాయంత్రం స్నాక్స్.

గండి పోచమ్మ నుంచి 2 రోజుల పర్యటన

గండి పోచమ్మ నుంచి పాపికొండలకు ఉదయం 7.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 7.30 గంటల వరకు. పెద్దలకు రూ.2,500, పిల్లలకు రూ.2,000 చార్జీ. మొదటి రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం శాఖాహార భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రికి రెండు నాన్‌వెజ్ కూరలతో భోజనం. 2వ రోజు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం రెండు నాన్‌వెజ్ కూరలతో భోజనం, సాయంత్రం అల్పాహారం.

ఇద్దరు కోడళ్లను హతమార్చిన మామ

- హత్యకు సహకరించిన అతని కుమారులు
- నిందితులను పట్టించిన కాలి చెప్పు..
- నాటువైద్యురాలు, తండ్రీ, ఇద్దరు కొడుకులు అరెస్ట్



నిందితుల అరెస్ట్‌ను చూపుతున్న పోలీసులు

కర్నూలు: తనకు నాటు మందు పెట్టారనే అనుమానంతో తన కుమారుల సాయంతో ఇద్దరు కోడళ్లను మామ హతమార్చాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనాస్థలిలో కాలి చెప్పు దొరకడంతో తమదైన శైలిలో విచారించారు. దీంతో హత్యను తామే చేసినట్లు తండ్రీ కొడుకులు ఒప్పుకున్నారు. ఘటనకు సంబంధించి నాటు వైద్యురాలిని, తండ్రీ కొడుకులను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. కర్నూలు జిల్లా అడిషనల్ ఎస్పీ డి.ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. ఓర్వకల్లు మండలం నన్నూరుకు చెందిన పెద్దగోగన్న, మంగమ్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు రామగోవిందుకి రామేశ్వరితో ఏడేళ్ల క్రితం వివాహమైంది. చిన్నకుమారుడు చిన్న రామగోవిందు..రేణుకను ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కుమారులిద్దరికీ సంతానం లేదు. దీనిపై గోగన్న తన కోడళ్లతో ఘర్షణ పడుతుండేవాడు. కొన్నాళ్ల క్రితం తనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో చిన్న కుమారుడిని తీసుకుని జొహరాపురంలో ఉన్న నాటువైద్యురాలు మతం పార్వతమ్మ వద్దకు గోగన్న వెళ్లాడు. నాటు వైద్యురాలు తండ్రీ, కొడుకులకు కషాయం తాగించి వాంతి చేయించి ఇంట్లోని ఆడవారు నాటు మందు పెట్టారని చెప్పింది. దీంతో మందు పెట్టింది చిన్నకోడలే అనే అనుమానంతో ఆమెను తుదముట్టించేందుకు ఇద్దరు కుమారులతో కలిసి గోగన్న పథకం వన్నాడు. ఈ నెల 14న పొలంలో గడ్డి కోసుకు రమ్మని చిన్న కోడలు రేణుకను పంపించాడు. కొద్దిసేపటి తరువాత అక్కడికి వెళ్లి గడ్డి కోస్తున్న రేణుకపై కర్రతో తలపై బాదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పక్కనే ఉన్న పెద్ద కోడలు రామేశ్వరి వారించేందుకు యత్నించగా..ఆమెపై కూడా కర్రతో దాడి చేశాడు. దీంతో ఆమె కూడా మృతి చెందింది. అనంతరం తండ్రీ, ఇద్దరు కుమారులు తమకు ఏమీ తెలియనట్లుగా సాయంత్రం ఇంటికి చేరుకున్నారు.

నిందితులను పట్టించిన కాలి చెప్పు...

ఈ హత్యల ఘటనలో జరిగిన పెనుగులాటలో చిన్నకుమారుడి చెప్పు నేర స్థలంలో పడిపోయింది. హతురాలి బంధువు కురువ పెద్ద సుంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నేరస్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతదేహాల సమీపంలో ఒక చెప్పు కనిపించింది. అది చిన్న రామగోవిందుదని విచారణలో బయటపడగా అతడిని గట్టిగా ప్రశ్నించగా తొలుత బుకాయించాడు. దీనికి తోడు ఇంట్లో మరో చెప్పు దొరకడంతో తండ్రీకొడుకుల పాత్ర ఉన్నట్లు నిర్ధారణకు వచ్చి తమదైన శైలిలో విచారించి..పక్కా ఆధారాలతో నిందితులను అరెస్ట్ చేసినట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు.

కరెంట్ షాక్‌తో ఏనుగు మృతి



కొదలమడుగు గ్రామంలో కరెంటు షాక్‌తో మృతి చెందిన ఏనుగు

బంగారుపాళెం: చిత్తూరు జిల్లా, పూతలపట్టు నియోజకవర్గం, బంగారుపాళెం మండలం, కొదలమడుగు గ్రామ సమీపంలో వ్యవసాయ పొలం వద్ద ఏర్పాటు చేసిన కరెంట్ తీగలు తగిలి ఓ ఏనుగు మృతి చెందింది. పలమనేరు రేంజ్ కాలువపల్లె సెక్షన్ టేకుమంద బీట్ పరిధిలోని పూలదడి వంక అటవీ ప్రాంతం నుంచి సుమారు 15 ఏనుగులు వచ్చి శుక్రవారం తెల్లవారు జామున రైతులు శేషాద్రి, మొగిలప్ప, రాజమ్మకు చెందిన మామిడితోటలపై దాడులు చేశాయి. అనంతరం అడవిలోకి వెళ్లే క్రమంలో ఓ ఆడ ఏనుగు చిన్నబ్బమందడి వ్యవసాయ బోరు మోటారుకు ఏర్పాటు చేసిన వైర్లను నోట కొరకడంతో కరెంట్ షాక్‌కు గురై మృతి చెందింది. ఈ మేరకు రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సీసీఎఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి, తహసీల్దార్ బెన్నురాజ్, చిత్తూరు, పలమనేరు రేంజ్ అధికారులు బాలకృష్ణారెడ్డి, నయిమ్‌అలీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏనుగుకు సుమారు 20 సంవత్సరాల వయస్సు ఉంటుందని నిర్ధారించారు.

బేసిక్ సైన్స్‌కు విశేష ప్రాధాన్యత

- ‘ఇన్సా’ ప్రతినిధులు చంద్రిమా షాహా, నేటియాల్



మాట్లాడుతున్న చంద్రిమా షాహా, నేటియాల్

సాక్షి, విశాఖపట్నం: బేసిక్ సైన్స్ (ప్రాథమిక విజ్ఞాన శాస్త్రం)కు విశేష ప్రాధాన్యత ఉందని, దానిని విద్యార్థి దశ నుంచే మరింత విస్తృతం చేయాలని ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఇన్సా) అధ్యక్షురాలు చంద్రిమా షాహా అన్నారు. విశాఖలోని ఏయూలో 3 రోజుల పాటు జరిగిన ఇన్సా 88వ వార్షిక సాధారణ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. అనంతరం ఆమె ఇన్సా ప్రోగ్రాం కన్సల్టెంట్ ప్రొఫెసర్ నేటియాల్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఇంజినీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్ కోర్సుల సాంకేతికతకు మూలం బేసిక్ సైన్సే అని చెప్పారు. ప్రాథమిక విజ్ఞాన శాస్త్రంపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో ఆసక్తి కలిగేలా బోధన సాగించాలన్నారు. బేసిక్ సైన్స్‌పై ఆసక్తి, అవగాహన పెంచేందుకు ‘ఇన్సా’ దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతీయ భాషల్లో సదస్సులు, వ్యాస రచన, ఫొటో ప్రదర్శనలు నిర్వహిస్తోందన్నారు. దీనికి సంబంధించిన కోర్సులు, పరిశోధనలు మరింత విస్తృతం కావడానికి కేంద్రానికి ఎప్పటికప్పుడు శ్వేతపత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. తద్వారా ప్రభుత్వం తీసుకునే అనేక విధానపరమైన నిర్ణయాల్లో ‘ఇన్సా’ భాగస్వామ్యం అవుతోందన్నారు. ఈ ఏడాది బేసిక్ సైన్స్ అంశాన్నే తమ అకాడమీ ఎంచుకుందన్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులు, వ్యవసాయంతో పాటు కోవిడ్‌పై కూడా తమ అకాడమీ ప్రభుత్వానికి శ్వేతపత్రాలను అందజేసిందన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ చీఫ్ సైంటిస్ట్ జీపీఎస్ మూర్తి పాల్గొన్నారు.

19న ‘మల్లకంబ్’ ఎంపిక పోటీలు

సాక్షి, అమరావతి: ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2022లో భాగంగా ఏపీకి ప్రాతినిధ్యం వహించే మల్లకంబ్ (బాలబాలికలు) జట్టును ఈ నెల 19వ తేదీన ఎంపిక చేయనున్నారు. భీమవరంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం స్కూల్‌లో ఉదయం నుంచి ఎంపిక పోటీలు ఉంటాయని శాప్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. క్రీడాకారులు ఆధార్, టెన్త్, బర్త్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించింది. అలాగే 32వ జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ (అండర్–16 బాలబాలికలు) రాష్ట్ర కబడ్డీ జట్టుకు 18వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఎంపికలు నిర్వహించనున్నారు.

పోస్టల్ శాఖ ద్వారా సీఎంకు శుభాకాంక్షలు

అవనిగడ్డ: సీఎం వైఎస్ జగన్‌కి రూ.10తో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసే అవకాశం పోస్టల్‌శాఖ కల్పిస్తోంది. ఈ నెల 21న సీఎం జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేయాలనుకునే వారు పోస్టాఫీస్‌లో రూ.10 చెల్లిస్తే వారి అడ్రస్‌తో సందేశం చేరుతుంది. రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీస్‌ల నుంచి వచ్చే సందేశాలను మంగళగిరి ప్రధాన పోస్టాఫీస్ ద్వారా ముఖ్యమంత్రికి చేరవేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 20 లోపు ప్రధాన పోస్టాఫీస్‌కు వచ్చి రూ.10 చెల్లించి సీఎంకు జన్మదిన శుభాకాంక్షల సందేశం పంపవచ్చని కృష్ణా జిల్లా అవనిగడ్డ పోస్టుమాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు తెలిపారు.

ధాన్యం కొనుగోలుతో రైతులకు భరోసా

- అన్ని రకాలుగా వారికి అండగా నిలిచిన సీఎం జగన్
- మద్దతు ధర దక్కుతోందని ఎల్లో మీడియాకు అక్కసు
- అన్నదాతలకు అన్యాయం చేసింది చంద్రబాబే
- పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



సాక్షి, అమరావతి : ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్రంలోని రైతులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుతోందని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తాము ఇంతే కొంటామంటూ ఎలాంటి ఆంక్షలు పెట్టలేదని స్పష్టం చేశారు. మిల్లర్ల ప్రమేయం లేకుండా రైతులు పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తుంటే.. ధాన్యం కొనుగోలులో ఆంక్షలు అంటూ ‘ఈనాడు’ తప్పుడు ఆరోపణలు చేయడం దారుణం అని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడు పంటలు పండే పచ్చని పంట పొలాలను రాజధాని పేరిట సేకరించినప్పుడు రామోజీ ఎందుకు బాధ పడలేదని ఆయన ప్రశ్నించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం మూడున్నరేళ్లుగా రైతులకు అన్ని విధాలుగా అండగా నిలవడం దేశమంతా గుర్తిస్తుండటం కనిపించడం లేదా అని నిలదీశారు. రైతులకు మద్దతు ధర దక్కుతోందనే అక్కసుతో బురద చల్లుతున్నారని ధ్వజమెత్తారు. మంత్రి ఇంకా ఏమన్నారంటే..

రామోజీ.. ఆరోజు ఎందుకు నోరు విప్పలేదు?

- టీడీపీ ఐదేళ్ల పాలనలో రూ.40 వేల కోట్ల విలువైన 2.65 కోట్ల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, ఈ మూడున్నరేళ్లలో మా ప్రభుత్వం రూ.50,699 కోట్ల విలువైన 2.71 కోట్ల టన్నుల ధాన్యం సేకరించింది. టీడీపీ ఐదేళ్లలో రూ.3 వేల కోట్ల విలువైన ఉత్పత్తులు కొనుగోలు చేస్తే, ఈ మూడున్నరేళ్లలో ఈ ప్రభుత్వం రూ.7,500 కోట్ల విలువైన ఉత్పత్తులను కొనుగోలు చేసింది. ఇవి రామోజీకి కన్పించక పోవటం దురదృష్టకరం.
- వ్యవసాయం దండగ అని చంద్రబాబు విమర్శించినప్పుడు రామోజీ ఎందుకు నోరు విప్పలేదు? ఈరోజు రాష్ట్రం పాడి పంటలతో కళకళలాడుతోంది. సాగునీరు పుష్కలంగా అందుతోంది. దిగుబడులు బాగా పెరిగాయి. రైతులు సంతోషంగా ఉన్నారు. కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధరకే రైతులు పంట విక్రయించుకుంటున్నారు.
- రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 56 బీసీ కార్పొరేషన్ల మీద.. టీడీపీ, దాని కుల మీడియా రాసిన కథనాలు వారి పెత్తందారీ పోకడలను, అహంకారాన్ని మరోసారి బయట పెట్టాయి. ఈ కార్పొరేషన్ల ద్వారా వేలాది మంది బీసీలకు రాజకీయంగా గుర్తింపు రావడం నిజం కాదా? అర్హులందరికీ ఫలాలు అందేలా ఈ కార్పొరేషన్లు కృషి చేయలేదా? ఊరికొకరికి మాత్రమే మేలు చేసే గత ప్రభుత్వ దుర్మార్గం బట్టబయలు కాలేదా?
- బీసీలకు ఆర్థిక, సామాజిక, విద్య, మహిళ, రాజకీయ న్యాయాలు ఈ ప్రభుత్వంలో దక్కినంతగా ఏ ప్రభుత్వంలోనూ దక్కలేదనడం వాస్తవం కాదా?

స్వర్ణ సూక్ష్మరూపధారి విజయేంద్ర సరస్వతి



కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ స్వర్ణ సూక్ష్మ రూపం కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత తాళాబత్తు సాయి చేతుల్లో రూపుదిద్దుకుంది. 1.500 గ్రాముల బంగారంతో అంగుళం ఎత్తు కలిగిన ఈ విగ్రహాన్ని రోజుకు గంట చొప్పున 22 రోజుల్లో తయారు చేసినట్లు సాయి తెలిపారు. దాత మట్టే శ్రీను విశ్వకర్మ నాయకులతో కలిసి స్వామీజీకి స్వర్ణ సూక్ష్మ విగ్రహాన్ని త్వరలో అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

– సామర్లకోట

వైభవంగా శ్రీనివాస కల్యాణం



తిరుపతి అలిపిరి: కర్ణాటక రాష్ట్రం, రామనగరలోని జిల్లా స్టేడియంలో టీటీడీ, దాత, మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి, ఎమ్మెల్యే అనిత కుమారస్వామి దంపతులు ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా శుక్రవారం రాత్రి జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ మూర్తులను దర్శించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలు గానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రధాని దేవెగౌడ, చెన్నమ్మ దేవెగౌడ దంపతులు, నిఖిల్ కుమార స్వామి గౌడ దంపతులు, టీటీడీ జేఈవో సదా భార్గవి పాల్గొన్నారు.

ప్రజా న్యాయమూర్తి జస్టిస్ చిన్నప్పరెడ్డి

- సామాన్యుడి పక్షాన న్యాయం ఉండాలని ఆకాంక్షించిన న్యాయమూర్తి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా అనేక చరిత్రాత్మకమైన తీర్పులు
- ఉరిశిక్షను తీవ్రంగా వ్యతిరేకించిన జస్టిస్ చిన్నప్పరెడ్డి
- ఖైదీల నిర్బంధం క్రూరంగా ఉండకూడదని అభిప్రాయం
- ఓపెన్ ఎయిర్ జైళ్ల విధానాన్ని అమలు చేసిన విశిష్ట ఆలోచనాపరుడు
- అనంతపురంలో రేపు శత జయంతి వేడుకలు
- ముఖ్య అతిథిగా విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రు




అనంతపురం కల్చరల్: న్యాయమనేది సామాన్యుని పక్షం ఉండాలని భావించి న్యాయ వ్యవస్థకు విలువలద్దిన న్యాయమూర్తి జస్టిస్ చిన్నప్పరెడ్డి. అట్టడుగుస్థాయి వ్యక్తులకు కూడా న్యాయం దక్కాలన్న మహోన్నత ఆశయ సాధనకు కృషి చేసిన చిన్నప్పరెడ్డి ఆదర్శప్రాయమైన జీవితాన్ని ఈతరం వారికి పరిచయం చేయడానికి ఆదివారం ఆయన శత జయంతి వేడుకలను నిర్వహిస్తున్నారు. విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఇక్కడి ఆర్ట్స్ కళాశాలలో జరిగే ఈ వేడుకల్లో ప్రసిద్ధ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రు పాల్గొననున్నారు. ‘రాజ్యాంగ విలువలు – నేటి పరిణామాలు’ అనే అంశంపై జస్టిస్ చంద్రు కీలకోపన్యాసం చేస్తారు.

గుత్తి మండలం ఒంటిద్దుపల్లికి చెందిన పార్వతమ్మ, శీరిరెడ్డి దంపతుల కుమారుడు చిన్నప్పరెడ్డి. గుత్తి పట్టణంలోని లండన్ మిషన్ స్కూల్లో పాఠశాల విద్య పూర్తి చేశారు. మద్రాసు లయోలా కళాశాలలో న్యాయశాస్త్రం అభ్యసించారు. 1944లో మద్రాసులోనే న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 1956లో హైకోర్టు న్యాయవాదిగా, 1960లో హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. 1967లో ఏపీ అదనపు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తించారు. 1976లో పంజాబ్, హర్యానా హైకోర్టులో పనిచేశారు. 1978లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 10 ఏళ్ల పాటు సుప్రీంకోర్టులో అనేక చరిత్రాత్మకమైన తీర్పులిచ్చారు. న్యాయానికి, చట్టానికి ఉన్న విలువలను కాపాడటంలో రాజ్యాంగానికి ఉన్న శక్తిని ఆకళింపు చేసుకున్న జస్టిస్ చిన్నప్పరెడ్డి అనేక సందేహాలను నివృత్తి చేసిన న్యాయ కోవిదుడిగా ప్రసిద్ధి చెందారు. ‘నేరాన్ని నిర్మూలించాలే తప్ప నేరస్తుడిని నిర్మూలించడం న్యాయం కాదు’ అంటూ ఉరిశిక్షను తీవ్రంగా వ్యతిరేకించారు. ఖైదీల నిర్బంధం క్రూరంగా ఉండకూడదని, ఓపెన్ ఎయిర్ జైళ్ల విధానాన్ని అమలు చేసిన విశిష్ట ఆలోచనాపరుడిగా చరిత్రలో నిలిచిపోయారు. చిన్నప్పరెడ్డికి 1987లో ఎస్కే యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 1987లో పదవీ విరమణ అనంతరం కర్ణాటక బీసీ కమిషన్ చైర్మన్‌గా వ్యవహరించారు. 2013లో ఆయన తుది శ్వాస విడిచారు.

పల్లెల్లో సమస్యల పరిష్కారానికి..

లో కాస్ట్–నో కాస్ట్ విధానం



సాక్షి, అమరావతి: గ్రామాల్లో వివిధ రకాల సమస్యల పరిష్కారానికి ఒక్కోసారి పెద్దగా నిధులు అవసరం ఉండకపోవచ్చు. అలాగే, తక్కువ మొత్తంతోనే పెద్దపెద్ద సమస్యలను పరిష్కరించుకోవచ్చు. మరికొన్ని సందర్భాల్లో గ్రామ స్థాయి అధికారులు తీసుకునే నిర్ణయాలతో కొన్ని పరిష్కారమయ్యే అవకాశం కూడా ఉంటుంది. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం.. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ‘లోకాస్ట్–నో కాస్ట్’ పేరుతో ఓ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు వీలుగా.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో గ్రామ పంచాయతీల స్థాయిలో చేపట్టే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) లలో ఇలాంటి సమస్యలకు పెద్దపీట వేయాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. ఈ మేరకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ కార్యదర్శి అలోక్ ప్రేమ్‌నగర్ వారం రోజుల క్రితం రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ అధికారుల సమావేశంలో ఈ అంశం గుర్తించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు.

అభివృద్ధి ప్రణాళికలో కీలక అంశాలు..

- 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల స్థాయిలో జీపీడీపీల రూపకల్పనపై శిక్షణా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.
- 2023 జనవరి నెలాఖరు నాటికి అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ జీపీడీపీల రూపకల్పన పూర్తికి కసరత్తు చేస్తున్నారు. ఆ వెంటనే మండల, జిల్లా పరిషత్ స్థాయిలోనూ వేర్వేరుగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తారు.
- వీటి రూపకల్పనలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఈ ఏడాది అనేక కీలక మార్పులు సూచిస్తూ రాష్ట్రాలకు ఆదేశాలు జారీచేసింది.
- గ్రామాల్లో స్థానిక ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనలో ప్రధానంగా తొమ్మిది సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్‌డీజీ) సూచికలపై గ్రామసభ నిర్వహించుకోవాలి.
- స్థానిక పరిస్థితుల బట్టి వాటిలో ఒకటి నుంచి మూడు అంశాలను ఎంపిక చేసుకుని వాటి ఆధారంగా ఆ ఏడాదికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళిక రూపొందించుకోవాలి.
- అభివృద్ధి ప్రణాళికలో పేర్కొన్న అంశాలపై చేపట్టే కార్యక్రమాల్లో కనీసం సగం (50 శాతం) కార్యక్రమాలను ప్రత్యేక ‘ఈ–గ్రామ స్వరాజ్’ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
- ఈ అభివృద్ధి ప్రణాళికలో పేర్కొనే కార్యక్రమాలన్నీ ఆర్థిక వనరులకు సంబంధించినవే కానవసరం లేదు.
- లో కాస్ట్–నో కాస్ట్ కార్యక్రమాలను ప్లాన్ చేసుకుని వాటిని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయవచ్చునని కేంద్రం సూచించింది.

ఉగ్ర అడ్డాగా పాక్

ఐరాసలో ఎస్.జైశంకర్ ధ్వజం



ఐక్యరాజ్యసమితి: ఉగ్రవాదానికి పాకిస్తాన్‌ను కేంద్ర స్థానంగా ప్రపంచ దేశాలన్నీ పరిగణిస్తున్నాయని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. ''పాక్ ఇప్పటికైనా కళ్లు తెరవాలి. ఉగ్రభూతాన్ని పెంచి పోషించడం మానుకోవాలి'' అంటూ హితవు పలికారు. ''ఉగ్రవాదం ఎక్కడ పురుడు పోసుకుందో ప్రపంచమంతటికీ తెలుసు. పామును ఇంట్లో పెంచుకుంటే ఎప్పటికైనా కాటేయడం ఖాయమని అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ అప్పట్లో పాక్‌ను హెచ్చరించారు'' అని గుర్తుచేశారు. ఐరాస ప్రధాన కార్యాలయంలో 'అంతర్జాతీయ ఉగ్రవాదం, సవాళ్లు, పరిష్కార మార్గాలు' అంశంపై భేటీకి మంత్రి నేతృత్వం వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆసియాలో, ఇతర ప్రాంతాల్లో ఉగ్ర దాడుల వెనుక ఉన్నదెవరో అందరికీ తెలుసన్నారు. దక్షిణాసియాలో ఉగ్రవాదం ఎప్పుడు అంతమవుతుందని పాక్ జర్నలిస్టు ప్రశ్నించగా 'మీ దేశ మంత్రులనే అడగండి' అని బదులిచ్చారు.

క్లుప్తంగా...

కత్తెరతో దాడి, మొదటి అంతస్తు నుంచి తోసివేత

ఢిల్లీలో విద్యార్థినిపై టీచర్ క్రౌర్యం

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో వందన అనే ఐదో తరగతి విద్యార్థినితో గీతా దేశ్‌వాల్ అనే టీచర్ అత్యంత దారుణంగా ప్రవర్తించింది. అకారణంగా కోపగించుకుని కత్తెరతో దాడి చేసి చితక్కొట్టింది. అంతటితో ఆగక జుట్టు పట్టుకొని మొదటి అంతస్తు నుంచి కిందకి విసిరేసింది. పోలీసులు టీచర్‌ను అరెస్ట్ చేశారు. తోటి టీచర్లు వారిస్తున్నా ఆమె పట్టించుకోలేదని తెలిపారు. విద్యార్థిని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రాణాపాయం తప్పిందని వైద్యులు చెప్పారు. విషయం తెలిసి పాప తల్లిదండ్రులు స్కూలు ముందు ధర్నాకు దిగారు.

ఓటరు కార్డుతో ఆధార్ లింకప్ ఐచ్ఛికమే: కేంద్రం

న్యూఢిల్లీ: ఎన్నికల గుర్తింపు కార్డుతో ఆధార్‌ను అనుసంధానం చేయకపోయినా ఓటర్ల జాబితాలో వారి పేరు కొనసాగుతుందని కేంద్రం స్పష్టం చేసింది. అనుసంధానం పూర్తిగా ఐచ్ఛికమని పేర్కొంది. శుక్రవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు బదులుగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరెణ్ రిజిజు ఈ మేరకు బదులిచ్చారు.

ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం యోచన లేదు

దేశంలో ఎగ్జిట్ పోల్స్‌పై నిషేధం విధించాలన్న ప్రతిపాదన కేంద్రం పరిశీలనలో లేదని మరొక ప్రశ్నకు బదులుగా రిజిజు స్పష్టం చేశారు.

సుప్రీంకోర్టుకు సెలవులు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టుకు డిసెంబర్ 17 నుంచి వచ్చే జనవరి ఒకటో తేదీ దాకా శీతాకాల సెలవులని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తెలిపారు. ఈ సందర్భంగా సుప్రీం ధర్మాసనాలేవీ పనిచేయవని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టుకు రోజుల తరబడి సెలవులు న్యాయార్థులకు ఏమాత్రం సౌకర్యవంతంగా లేదని ప్రజలు భావిస్తున్నారంటూ కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరెన్ రిజిజు గురువారం రాజ్యసభలో వ్యాఖ్యానించిన నేపథ్యంలో సీజేఐ తాజా నిర్ణయం వెలువరించడం గమనార్హం.

ఫ్రాన్సు అపార్టుమెంట్‌లో మంటలు... 10 మంది దుర్మరణం

ప్యారిస్: ఫ్రాన్సులో ఓ 8 అంతస్తుల అపార్టుమెంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు చిన్నారులతో పాటు మొత్తం 10 మంది మృతి చెందారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. రోన్ ప్రాంతంలోని నిరుపేదలుండే వాల్క్స్ ఎన్ వెలిన్ పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున మూడింటికి ఈ ఘోరం జరిగింది. కుట్ర సహా అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుపుతున్నట్లు అధికారులు చెప్పారు.

కొండచరియలు విరిగిపడి... మలేసియాలో 21 మంది మృతి

బటంగ్ కలి: మలేసియాలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోగా మరో 12 మంది గల్లంతయ్యారు. సెలంగోర్ రాష్ట్రం బటంగ్ కలి పట్టణ సమీపంలోని ఓ ఫార్మ్‌హౌస్‌లో గురువారం అర్ధరాత్రి ఈ విషాదం చోటుచేసుకుంది. ఫార్మ్‌హౌస్‌లోని మూడెకరాల్లో 90 మంది పర్యాటకులున్న క్యాంప్ సైట్‌ను 100 అడుగుల ఎత్తైన రోడ్డు నుంచి బురద, రాళ్లతో కూడిన మట్టి ఒక్కసారిగా ముంచెత్తింది. గాఢ నిద్రలో ఉన్న 21 మంది బురద మట్టి కింద సజీవ సమాధి కాగా, 12 మంది జాడ తెలియకుండా పోయారు.

అమితాబ్ వ్యాఖ్యలపై... బీజేపీ, టీఎంసీ వాగ్యుద్ధం

కోల్‌కతా: భావప్రకటన స్వేచ్ఛపై బిగ్ బి అమితాబ్ బచ్చన్ చేసిన వ్యాఖ్యలు బీజేపీ, తృణమూల్ కాంగ్రెస్ మధ్య మాటల మంటలు రేపాయి. గురువారం కోల్‌కతాలో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, నటుడు షారూక్ ఖాన్ సమక్షంలో అమితాబ్ మాట్లాడుతూ పౌర హక్కులు, భావప్రకటన స్వేచ్ఛపై ఇంకా ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. ఆ వ్యాఖ్యలు మమత నిరంకుశ ధోరణికి అద్దం పట్టేలా ఉన్నాయంటూ బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ విమర్శించారు. టీఎంసీ ఎంపీ, నటి నస్రత్ జహాన్ వాటిని ఖండించారు. బీజేపీ పాలనతో నిజంపై అన్ని రంగాల్లోనూ నిర్బంధం కొనసాగుతోందని ఆరోపించారు.

బాలుడ్ని మింగిన హిప్పో..!





కబటోరో (ఉగాండా): ఆ బాలుడి వయసు రెండేళ్లు. చావు అంచులవరకు వెళ్లి మృత్యుంజయుడుగా నిలిచాడు. కనీ వినీ ఎరుగని ఒక అద్భుతం జరగడంతో ప్రాణాలు దక్కించుకున్నాడు. ఉగాండాలోని కబటోరోలోని తన ఇంటికి దగ్గరలో ఉన్న సరస్సు వద్ద రెండేళ్ల వయసున్న పాల్ ఇగా ఆడుకుంటున్నాడు. హఠాత్తుగా అక్కడికి వచ్చిన హిప్పోపొటమస్ ఆ బాలుడ్ని నోట కరచుకొని మింగేసింది. అదే సమయంలో దారిన పోతున్న క్రిస్పస్ బగోంజా అనే వ్యక్తి అది చూసి చేతికందిన రాళ్లు తీసుకొని హిప్పోపై విసిరాడు. అంతే.. అందరూ అవాక్కయ్యేలా ఆ హిప్పో వెంటనే ఆ బాలుడ్ని సజీవంగానే కక్కేసింది. స్వల్ప గాయాలతో బాలుడు హిప్పో పొట్టలోంచి బయటకు రావడంతో బగోంగా ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాడు. వెంటనే ఆ బాలుడ్ని ఆస్పత్రికి తీసుకువెళ్లి యాంటీ రాబిస్ వ్యాక్సిన్లు ఇచ్చి చికిత్స చేశారు. హిప్పో కడుపులోకి వెళ్లి తిరిగి రావడం అత్యంత అరుదైన ఘటనని చెబుతున్న ఉగాండా పోలీసులు ఆ బాలుడ్ని మృత్యుంజయుడిగా కీర్తిస్తున్నారు.

తోకచుక్క కాదు.. అగ్ని–5



న్యూఢిల్లీ: భారత్‌లో పలు ప్రాంతాల్లో గురువారం ఆకాశంలో మిరుమిట్లు గొలిపే కాంతి దర్శనమిచ్చింది. వేగంగా కదులుతున్న ఈ వెలుగు రేఖను చూసి తోకచుక్క కావొచ్చని జనం భావించారు. కొందరు అంతరిక్షం నుంచి జారిపడిన గ్రహశకలగా భ్రమించారు. మరికొందరు ఫ్లయింగ్ సాసరని బల్లగుద్ది మరీ చెప్పారు. ఈ ఫొటోలు, వీడియోలు వైరల్‌గా మారాయి. చివరికి అది మన ఖండాంతర అణు క్షిపణి అగ్ని–5 అని అధికారులు స్పష్టం చేసి ఊహాగానాలకు తెర దించారు! దాన్ని ఒడిశా తీరం నుంచి గురువారం విజయవంతంగా ప్రయోగించడం తెలిసిందే. ఈ క్షిపణి పొడవు 17 మీటర్లు. 1.5 టన్నుల వార్‌హెడ్లను మోసుకెళ్లగలదు. అగ్ని–1, అగ్ని–2, అగ్ని–3, అగ్ని–4 మిస్సైళ్ల పరిధి 700 కిలోమీటర్ల నుంచి 3,5000 కిలోమీటర్లు కాగా, మూడు దశల సాలిడ్ రాకెట్ ఇంజన్‌తో కూడిన అగ్ని–5 పరిధి ఏకంగా 5,000 కిలోమీటర్లు కావడం గమనార్హం. 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను కూడా అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదని సైనిక వర్గాలు వెల్లడించాయి. దేశంలో ఇప్పటిదాకా ఇదే అత్యధిక లాంగ్–రేంజ్ మిస్సైల్ కావడం విశేషం. ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగిస్తారు. చైనా ఉత్తర ప్రాంతంతో సహా మొత్తం ఆసియా ఈ క్షిపణి పరిధిలోకి వస్తుంది. ఐరోపా ఖండంలోని కొన్ని ప్రాంతాలు సైతం అగ్ని–5 స్ట్రైకింగ్ రేంజ్‌లో ఉన్నాయి. క్షిపణి ప్రయోగం పూర్తిస్థాయిలో విజయవంతమైందని అధికార వర్గాలు తెలియజేశాయి. అగ్ని–5 త్వరలోనే భారత సైన్యంలో ప్రవేశపెట్టనున్నారు.

తొలి అడుగులు చెట్ల మీదే!

ఆ తర్వాతే నేలపైకి దిగామట • మానవ పరిణామంలో కొత్త కోణం

భూమిపై మానవ వికాసం జరిగిన తీరు మనకిప్పటికీ పెద్ద మిస్టరీయే. అందులో అత్యంత కీలకమైన 'ముందడుగు' నడక. వెన్నును నిటారు చేసి రెండు కాళ్లపై సాగడం మానవ పరిణామ క్రమంలో నిజానికి చాలా పెద్ద మలుపు. ఇతర చతుష్పాద జంతువులన్నింటి నుంచీ ఇదే మనిషిని పూర్తిగా వేరు చేసి అత్యంత ప్రత్యేకంగా నిలిపింది. ఇంత కీలకమైన నడకను మన పూర్వ మానవుడు ఎప్పుడు నేర్చాడన్నది మనకే గాక పరిశోధకులకు కూడా అత్యంత ఆసక్తికరమైన టాపికే. దీనిపై దశాబ్దాలుగా ఎన్నెన్నో పరిశోధనలు జరిగాయి, జరుగుతున్నాయి. అడవులు, తత్ఫలితంగా చెట్లు బాగా తగ్గి మైదాన ప్రాంతం పెరుగుతూ పోవడం వల్లే మనిషి రెండు కాళ్లపై నడక నేర్చుకోవాల్సి వచ్చిందని అవన్నీ దాదాపుగా ముక్త కంఠంతో చెప్పే మాట. కానీ అది పూర్తిగా తప్పంటోంది తాజా పరిశోధన ఒకటి. మన పూర్వీకులు చెట్లపై నివసించే రోజుల్లోనే రెండు కాళ్లపై నడవడం నేర్చారట. అదీ నిటారుగా! ఆ తర్వాతే పూర్తిస్థాయిలో నేలపైకి దిగారని వాదిస్తోంది! తెలివితేటల్లోనూ ఇతరత్రా కూడా జంతుజాలమంతటిలో మనిషికి అత్యంత సమీప జీవి అయిన చింపాంజీలపై 15 నెలల పాటు లోతుగా పలు కోణాల్లో పరిశోధనలు చేసి మరీ ఈ మేరకు తేల్చామంటోంది!!


ఏం చేశారు?

తూర్పు ఆఫ్రికాలో టాంజానియాలోని ఇసా లోయలో కొద్దిపాటి చెట్లు, కాస్తంత దట్టమైన అడవి, విస్తారమైన మైదాన ప్రాంతం మధ్య జీవిస్తున్న 13 అడవి చింపాంజీలను పరిశోధనకు ఎన్నుకున్నారు. మన పూర్వీకులు నడిచేందుకు దారితీసిందని భావిస్తున్న చెట్ల లేమి, అపారమైన బయలు ప్రదేశం కారణంగా అవి కూడా అలాంటి ప్రయత్నాలేమైనా చేస్తాయేమో గమనించడం అధ్యయనం ఉద్దేశం. ''ఇందుకోసం చింపాంజీల ప్రవర్తనను అతి దగ్గరగా పరీక్షించి ఎప్పటికప్పుడు రికార్డు చేస్తూ వచ్చాం. వాటి తాలూకు ఏకంగా 13 వేల రకాలుగా హావభావాలను లోతుగా గమనించాం'' అని అధ్యయనంలో పాలుపంచుకున్న డాక్టర్ అలెక్స్ పీల్ వివరించారు. కానీ అవి అచ్చం అత్యంత దట్టమైన అడవుల్లోని చింపాంజీల మాదిరిగానే అత్యధిక సమయం తమకందుబాటులో ఉన్న కొద్దిపాటి చెట్లపైనే గడుపుతూ వచ్చాయి నడిచే ప్రయత్నమే చేయలేదని చెప్పుకొచ్చారు. ''కనుక దాదాపు 50 లక్షల ఏళ్ల క్రితం అటవీ సంపద తరిగిపోయి మైదాన ప్రాంతం ఎక్కువైన క్రమంలోనే ఆదిమ మానవుడు చెట్ల నుంచి నేలపైకి దిగి నిటారు నడక నేర్చాడన్న భావన తప్పు. దాన్నతను కచ్చితంగా చెట్లపైనే నేర్చుంటాడు. తర్వాత కూడా ఆహార వృక్షాల అన్వేషణలో చాలాకాలం పాటు చెట్లపై నిటారుగానే నడిచుండాలి. ఆ రకంగా మానవ వికాసానికి చెట్లే ఊతమిచ్చాయని భావించవచ్చు'' అని ఆయన వివరించారు. ఈ అధ్యయనం జర్నల్ సైన్స్ అడ్వాన్సెస్‌లో పబ్లిషైంది.

కొసమెరుపు

ఇంతా చేస్తే, తోకలేని కోతుల (ఏప్)న్నింట్లోనూ మన పూర్వీకులు మాత్రమే రెండు కాళ్ల నడకను ఎలా, ఎందుకు నేర్చారన్నది మాత్రం ఇప్పటికీ మిస్టరీయేనని అధ్యయనకర్తలు అంగీకరించారు! విస్తారమైన మైదాన ప్రాంతం అందుబాటులో ఉన్నా చింపాంజీలు చెట్లపైనే ఎందుకు అత్యధిక సమయం గడిపిందీ తేలితే బహుశా ఈ మిస్టరీని ఛేదించేందుకు ఏమైనా క్లూ దొరకవచ్చంటున్నారు. అందుకే తమ తర్వాతి అధ్యయనం దీని మీదేనని ప్రకటించారు!!

– సాక్షి, నేషనల్ డెస్క్



వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడేందుకే... మేమున్నది: సుప్రీంకోర్టు

ఏ కేసూ చిన్నది, పస లేనిది కాదు: సీజేఐ



న్యూఢిల్లీ: వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించి సుప్రీంకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ''అది రాజ్యాంగమే గుర్తించిన అత్యంత అమూల్యమైన, విస్మరించేందుకు వీల్లేని హక్కు. దానికి విఘాతం కలిగిందంటూ వచ్చే విన్నపాలను ఆలకించడం మా రాజ్యాంగపరమైన విధి. అది మా బాధ్యత కూడా'' అని స్పష్టం చేసింది. యూపీకి చెందిన ఓ వ్యక్తికి రాష్ట్ర విద్యుత్ శాఖ పరికరాలు దొంగిలించిన కేసును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహలతో కూడిన ధర్మాసనం విచారించింది. నిందితునికి 18 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును కొట్టేసింది. 9 అభియోగాల్లో ఒక్కోదానికి రెండేళ్ల చొప్పున అతనికి విధించిన జైలు శిక్షను మొత్తంగా రెండేళ్లకు కుదించింది. ''వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన విన్నపాలను ఆలకించి న్యాయం చేయని పక్షంలో మేమిక్కడ కూర్చుని ఇంకేం చేస్తున్నట్టు? మేమున్నదే అలాంటి పిటిషనర్ల ఆక్రందనను విని ఆదుకునేందుకు! అలాంటి కేసులను విచారణకు స్వీకరించకపోవడమంటే న్యాయ ప్రక్రియకు తీవ్ర విఘాతం కలిగించడమే. చూసేందుకు అప్రాధాన్యమైనవిగా కనిపించే ఇలాంటి చిన్న కేసుల విచారణ సమయంలోనే న్యాయ, రాజ్యాంగపరమైన కీలక ప్రశ్నలు, అంశాలు తెరపైకి వస్తుంటాయి. సుప్రీంకోర్టు చరిత్రే ఇందుకు రుజువు. పౌరుల స్వేచ్ఛను కాపాడేందుకు సుప్రీంకోర్టు జోక్యానికి ఆర్టికల్ 136లో పేర్కొన్న రాజ్యాంగ సూత్రాలే స్ఫూర్తి'' అంటూ సీజేఐ కీలక వ్యాఖ్యలు చేశారు. ''అందుకే ఏ కేసు కూడా సుప్రీంకోర్టు విచారించకూడనంత చిన్నది కాదు, కాబోదు'' అని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులు కొండంత పేరుకుపోయిన నేపథ్యంలో చిన్నాచితకా బెయిల్ దరఖాస్తులు, పసలేని ప్రజాప్రయోజన వ్యాజ్యాల వంటివాటిని సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించొద్దని కేంద్ర న్యాయ మంత్రి కిరెణ్ రిజిజు రెండు రోజుల క్రితం అభిప్రాయపడటం తెలిసిందే. అంతేగాక కొలీజియం వ్యవస్థ విషయంలో కేంద్రానికి, సుప్రీంకోర్టు మధ్య కొంతకాలంగా ఉప్పూ నిప్పు మాదిరి పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో సీజేఐ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

కెన్నెడీ హత్య.. మరిన్ని డాక్యుమెంట్లు బహిర్గతం

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్.కెన్నెడీ హత్యకు సంబంధించి 13 వేల పై చిలుకు డాక్యుమెంట్లను వైట్‌హౌస్ తాజాగా బయట పెట్టింది. దీంతో ఆ ఉదంతానికి సంబంధించి 97 శాతానికి పైగా సమాచారం జనానికి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చినట్టేనని ప్రకటించింది. అయితే మరో 515 డాక్యుమెంట్లను పూర్తిగా, 2,545 డాక్యుమెంట్లను పాక్షికంగా గోప్యంగానే ఉంచనుంది! వాటిని 2023 జూన్ దాకా విడుదల చేయబోమని ప్రకటించింది. హత్యకు సంబంధించిన అతి కీలకమైన విషయాలు వాటిలోనే ఉండొచ్చని భావిస్తున్నారు. హార్వే ఓస్వాల్డ్ అనే వ్యక్తి 1963 నవంబర్ 22న కెన్నెడీని డాలస్‌లో కాల్చి చంపడం తెలిసిందే. దీని వెనక పెద్ద కుట్ర ఉందంటారు. హార్వే కొన్నేళ్లపాటు సోవియట్ యూనియన్‌లో ఉండొచ్చిన వ్యక్తి కావడం పలు అనుమానాలకు తావిచ్చింది. అమెరికా గూఢచారి సంస్థ సీఐఏ కెన్నెడీని చంపించి ఉంటుందని, రహస్యాన్ని శాశ్వతంగా సమాధి చేసేందుకు హార్వేను పోలీసులు కాల్చి చంపారని ఊహాగానాలున్నాయి.

చైనా దురాక్రమణపై చర్చించాల్సిందే

రాజ్యసభలో కాంగ్రెస్ డిమాండ్

న్యూఢిల్లీ: అరుణాచల్‌ప్రదేశ్‌లో భారత్, చైనా జవాన్ల మధ్య ఘర్షణ, చైనా దురాక్రమణపై చర్చించాలని ప్రతిపక్ష కాంగ్రెస్ శుక్రవారం రాజ్యసభలో డిమాండ్ చేసింది. ఉదయం సభ ప్రారంభం కాగానే పార్టీ ఎంపీలు నినాదాలు ప్రారంభించారు. వెల్‌లో బైఠాయించారు. దాంతో సభ 25 నిమిషాలు వాయిదా పడింది. తర్వాత కూడా చర్చకు విపక్షాలిచ్చిన నోటీసులను ఆమోదించాలని, ఇతర కార్యకలాపాలను పక్కనపెట్టి చైనా దురాక్రమణపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ ఎంపీలు పట్టుబట్టారు. దేశ భద్రతకు సంబంధించిన కీలకమైన అంశంపై చట్టసభలో చర్చించకపోవడం ఏమిటని ప్రతిపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే మండిపడ్డారు. జీరో అవర్‌ను ప్రారంభిస్తున్నట్లు డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ప్రకటించడంతో ఎంపీలు నినాదాలకు దిగారు. దాంతో సభ వాయిదా పడింది.



లోక్‌సభలో కీలక అంశాల ప్రస్తావన

రోడ్ల అనుసంధానం, అన్ని ఎన్నికలకు ఒకే ఓటర్ జాబితా, కేంద్ర పథకాలకు నిధులు, కాలుష్యం వంటి కీలకాంశాలను లోక్‌సభలో శుక్రవారం పలు పార్టీల సభ్యులు ప్రస్తావించారు. పెన్షన్లు, రిటైర్మెంట్ ప్రయోజనాల విషయంలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని శివసేన ఎంపీ వినాయక్ రౌత్ కోరారు. కొన్ని రాష్ట్రాల్లో ఆయుష్మాన్ భారత్–ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన దుర్వినియోగం అవుతోందని బీజేపీ సభ్యుడు సుదర్శన్ భగత్ ఆందోళన వ్యక్తం చేశారు.

భారత ప్రధానమంత్రి కసాయి

పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ నోటి దురుసు, మండిపడ్డ భారత్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీపై పాక్ విదేశాంగ మంత్రి బిలావల్ భుట్టో నోటి దురుసు ప్రదర్శించారు. ఐరాస భేటీ సందర్భంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ''భారత్‌కు ఒక విషయం చెప్పదల్చుకున్నా. లాడెన్ చచ్చిపోయాడు గానీ గుజరాత్ ప్రజల ప్రాణాలను బలి తీసుకున్న కసాయి బతికే ఉన్నాడు. ఆయనే భారత ప్రధాని. ఆయన్ను అమెరికాలో అడుగుపెట్టకుండా అక్కడి ప్రభుత్వం నిషేధించింది. ఆయన ఆరెస్సెస్ ప్రధాని. ఆరెస్సెస్ విదేశాంగ మంత్రి. అసలు ఆర్‌ఎస్ఎస్ హిట్లర్ నుంచి స్ఫూర్తి పొందింది!'' అన్నారు. బిలావల్ తొలుత ఐరాస భేటీలో కశ్మీర్ అంశాన్ని లేవనెత్తారు. వేలాది మందిని పొట్టనపెట్టుకున్న ఉగ్ర సంస్థ అల్ ఖైదా అధినేత ఒసామా బిన్ లాడెన్‌కు, భారత పార్లమెంట్‌పై దాడి చేసిన ముష్కరులకు ఆశ్రయమిచ్చిన పాక్‌కు నీతి బోధలు చేసే అధికారం లేదంటూ విదేశాంగ మంత్రి జైశంకర్ ఘాటుగా బదులిచ్చారు. ఈ విమర్శలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ మోదీపై బిలావల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అవి అనాగరికంగా, పాక్ స్థాయిని మరింత దిగజార్చేలా ఉన్నాయంటూ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చీ తీవ్రంగా ఖండించారు. 1971లో ఏం జరిగిందో బిలావల్ మర్చిపోయినట్లున్నారని భారత్ చేతిలో పాక్ ఓటమిని ఉద్దేశిస్తూ ఎద్దేవా చేశారు.

ఉక్రెయిన్‌పై మళ్లీ క్షిపణుల వాన

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా శుక్రవారం మరోసారి క్షిపణుల వర్షం కురిపించింది. 60 రష్యా క్షిపణులు నాలుగు నగరాల్లో విధ్వంసం సృష్టించాయని ఉక్రెయిన్ తెలిపింది. రాజధాని కీవ్‌తోపాటు, ఖర్కీవ్‌లో విద్యుత్, నీటి సరఫరా వ్యవస్థలకు అంతరాయం ఏర్పడింది. ప్రజలు ప్రాణభయంతో భూగర్భ సబ్‌వే స్టేషన్లలో తలదాచుకున్నారు. రష్యా దురాక్రమణ మొదలయ్యాక రాజధానిపై జరిగిన రాకెట్ దాడుల్లో ఇదొకటని అధికారులు చెప్పారు. రాజధాని గగన తలంలోకి ప్రవేశించిన సుమారు 40 క్షిపణుల్లో 37 క్షిపణులను కూల్చివేసినట్లు రక్షణ శాఖ తెలిపింది. కీవ్ టెరిటోరియల్ మొబైల్ ఆర్మీ మెషీన్ గన్‌తో క్రూయిజ్ క్షిపణిని కూల్చివేయడం అసాధారణం, నమ్మలేని నిజమని కమాండర్ ఒకరు పేర్కొన్నారు. అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంతూరైన క్రివ్విరిహ్‌లోని నాలుగంతస్తుల అపార్టుమెంట్‌పై ఒక క్షిపణి పడింది. పేలుళ్లతో ఇద్దరు చనిపోయారని అధికారులు తెలిపారు. జపారిజియాపై 15 క్షిపణులు పడ్డాయి. దాడులతో ఖర్కీవ్, డొనెట్స్క్ తదితర ప్రాంతాల్లో రైల్వే స్టేషన్లకు కరెంటు నిలిచిపోయింది.

చర్చలతోనే పరిష్కారం: మోదీ

న్యూఢిల్లీ: యుద్ధానికి చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే ముగింపు పలకాలని ప్రధాని మోదీ సూచించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో శుక్రవారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్‌పై తమ వైఖరిని అధ్యక్షుడు మోదీకి పుతిన్ వివరించినట్లు రష్యా వర్గాలు తెలిపాయి. వాణిజ్యం, ఇంధన రంగాల్లో ద్వైపాక్షిక సహకారంపై నేతలు చర్చించారు.



విజయ్‌దివస్ సందర్భంగా శుక్రవారం ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం వద్ద పుష్పగుచ్ఛముంచి నివాళులర్పిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్. 1971 యుద్ధంలో పాకిస్తాన్‌పై భారత్ గెలుపును నిర్ణయాత్మక విజయంగా ఈ సందర్భంగా ఆయన అభివర్ణించారు. యుద్ధ ఫలితంగా బంగ్లాదేశ్ అవతరణను అమానుషత్వంపై మానవీయత, అధర్మంపై ధర్మం, అన్యాయంపై న్యాయం సాధించిన విజయంగా పేర్కొన్నారు. "మన సైన్యం ధైర్య సాహసాలకు, త్యాగాలకు జాతి సెల్యూట్ చేస్తోంది. వారి సేవలకు, త్యాగాలకు సదా కృతజ్ఞులమై ఉంటాం" అన్నారు.

అక్వేరియం బద్దలైంది..!

బెర్లిన్: గిన్నిస్ రికార్డులకెక్కిన ప్రపంచంలోకెల్లా అతి పెద్ద అక్వేరియం ఉన్నట్టుండి బళ్లున బద్దలైంది. అందులోని 1,500 చేపలు చనిపోవడంతో పాటు ఏకంగా 10 లక్షల లీటర్లపై చిలుకు నీళ్ల అక్వేరియమున్న హోటల్‌తో పాటు పరిసర వీధులనూ ముంచెత్తాయి! అక్వాడాం అని పిలిచే సిలిండర్ ఆకృతిలోని ఈ 46 అడుగుల ఎత్తైన అక్వేరియం జర్మనీలోని బెర్లిన్‌లో రాడిసన్ బ్లూ హోటల్‌లో ఉంది. 2003 నుంచీ సందర్శకులను అలరిస్తోంది. దీని నిర్మాణానికి రూ.100 కోట్లకు పైగా రూపాయలు ఖర్చయింది. ఇది బెర్లిన్‌లో అతి పెద్ద పర్యాటక ఆకర్షణగా మారింది. ఇందులో 10 నిమిషాల లిఫ్ట్ ప్రయాణం అద్భుతమైన అనుభూతి అని సందర్శకులు చెబుతుంటారు. రెండేళ్ల క్రితం దీన్ని ఆధునీకరించారు. ఉష్ణోగ్రతలు ఏకంగా మైనస్ 10 డిగ్రీలకు పడిపోయినందుకే అక్వేరియం బద్దలై ఉంటుందని భావిస్తున్నారు.



కేంద్రం మొద్దు నిద్ర: రాహుల్

జైపూర్: చైనా మన మీదకి యుద్ధానికి సన్నాహాలు చేస్తూ ఉంటే కేంద్రం నిద్రపోతోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత్ జోడో యాత్ర 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం జైపూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ''చైనా నుంచి మనకు ముప్పు ఉందని రెండు, మూడేళ్లుగా నాకు స్పష్టంగానే తెలుస్తూనే ఉంది. కానీ కేంద్రం దాన్ని దాచిపెడుతూ పట్టనట్టు వ్యవహరిస్తోంది. 2 వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని చైనా ఆక్రమించుకుంది. 20 మంది సైనికుల ప్రాణాలు తీసింది. అరుణాచల్ ప్రదేశ్‌లో మన జవాన్లను కొట్టింది. లద్దాఖ్, తవాంగ్‌లో ఘర్షణలు జరిగాయి. ఇన్ని జరిగినా మోదీ సర్కారు మొద్దు నిద్రపోతోంది'' అంటూ ధ్వజమెత్తారు. చైనా ఆయుధ సంపత్తి, వాటిని నియోగిస్తున్న తీరు చూస్తూ ఉంటే మనపై పూర్తి స్థాయి యుద్ధానికి సిద్ధమవుతున్నట్టు తేటతెల్లమవుతోందన్నారు.



జోడో యాత్రకు 100 రోజులైన సందర్భంగా జైపూర్‌లో ఏర్పాటు చేసిన సంగీత కార్యక్రమంలో రాహుల్

బీజేపీని ఓడించేది మేమే

కాంగ్రెస్‌ను ఎవరూ తక్కువ అంచనా వేయొద్దని, ఎప్పటికైనా బీజేపీని ఓడించేది తమ పార్టీయేనని రాహుల్ అన్నారు. ''కాంగ్రెస్ పనైపోయిందంటున్నారు. కానీ బీజేపీ ఎప్పటికైనా కాంగ్రెస్ చేతిలోనే ఓడుతుంది. కాంగ్రెస్‌కు కోట్లాది మంది కార్యకర్తల బలముంది. వారి సేవల్ని పూర్తిగా వినియోగించుకుంటే రాజస్థాన్‌లో అఖండ విజయం ఖాయం'' అన్నారు. కాంగ్రెస్ నుంచి నేతల నిష్క్రమణను మీడియా ప్రస్తావించగా, 'పోయేవాళ్లందరినీ పోనిస్తాం. కాంగ్రెస్‌పై నమ్మకమున్న వాళ్లే మాతో ఉంటారు'' అన్నారు.

బీజేపీకి బీ టీమ్ ఆప్

ఆమ్ ఆద్మీ పార్టీ బీజేపీకి బీ–టీమ్‌గా మారిందని రాహుల్ ఆరోపించారు. ఆప్ లేకుంటే గుజరాత్ ఎన్నికల్లో గెలిచే వాళ్లమన్నారు. ''ప్రాంతీయ పార్టీలకు జాతీయ దృక్పథం లేదు. దేశానికి ఏం చెయ్యాలి, ఎలా చెయ్యాలన్నది కాంగ్రెస్‌కు మాత్రమే తెలిసిన విద్య. వచ్చే ఎన్నికల్లో ఇతర విపక్షాలతో కలిసి పని చేస్తాం. మా అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అందుకు ప్రణాళికలు రచిస్తున్నారు'' అన్నారు. హిమాచల్ సీఎం సుఖ్వీందర్ సింగ్ తదితరులు రాహుల్‌తో కలిసి నడిచారు.

'నెహ్రూ భారత్' కాదిది: బీజేపీ

న్యూఢిల్లీ: చైనా యుద్ధానికి వస్తూ ఉంటే కేంద్రం నిద్రపోతోందన్న రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ తిప్పికొట్టింది. ఇలాంటి మాటలతో సైనికుల స్థైర్యాన్ని రాహుల్ దెబ్బ తీస్తున్నారని బీజేపీ అధికార ప్రతినిధి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ విమర్శించారు. ''1962లో మనపై చైనా యుద్ధానికి కాలుదువ్వినప్పటి నెహ్రూ కాలపు భారత్ కాదిది. మోదీ నేతృత్వంలోని కొత్త నవీన భారత్. కయ్యానికి కాలు దువ్వే వాళ్లకు గట్టిగా జవాబిస్తాం'' అన్నారు.

ఇదేమి ఖర్మ!

• టీడీపీ నేత ప్రశ్నలు.. దిమ్మతిరిగేలా జనం జవాబులు



టీడీపీ నేతలను నిలదీస్తున్న మహిళలు

శ్రీరంగరాజపురం : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తలపెట్టిన 'ఇదేమి ఖర్మ' కార్యక్రమం ఆ పార్టీ నేతలకు షాక్ ఇచ్చింది. చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు నియోజకవర్గంలోని శ్రీరంగరాజపురం మండలం పీపీపురం పంచాయతీ పరిధిలోని ఆరిమాకులపల్లెలో శుక్రవారం ఆ పార్టీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిట్టిబాబునాయుడు స్థానిక మహిళలకు వేసిన ప్రశ్నలకు వారు దిమ్మతిరిగేలా సమాధానం చెప్పారు. దీంతో చేసేదేమీ లేక ఆయన అక్కడి నుంచి చిన్నగా జారుకున్నారు. 'అదేంటి.. ఈ ఊరోళ్లు ఇలా మొహం మీదే మాట్లాడుతున్నారు' అంటూ టీడీపీ మండల అధ్యక్షుడు జయశంకర్ నాయుడు, ఇతర నేతలు గుండయ్య, వెంకటరమణ, రవి, సిద్దయ్య తదితరులు చిట్టిబాబునాయుడును అనుసరించారు. స్థానిక మహిళలు, టీడీపీ నేత మధ్య జరిగిన సంభాషణ ఇలా ఉంది.

టీడీపీ నేత : సకాలంలో పింఛన్లు అందుతున్నాయా?

మహిళలు : ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారుతుండగానే వలంటీర్ వచ్చి నిద్రలేపి.. మరీ అందిస్తున్నారు

టీడీపీ నేత : అందరికీ ఇవ్వడం లేదట కదా?

మహిళలు : మాకందరికీ ఇస్తున్నారు. ఇంకా ఎవరికైనా రాకపోతే పెట్టుకోండని (దరఖాస్తు చేసుకోవాలని) చెబుతున్నారు.

టీడీపీ నేత : మిగతా పథకాలు అందుతున్నాయా?

మహిళలు : అన్నీ అందుతున్నాయి.

టీడీపీ నేత : రోడ్లు అసలు బాగున్నాయా?

మహిళలు : మీ హయాంలోనే గుంతలు పడ్డాయి. ఇప్పుడు బాగు చేశారు కదయ్యా..

టీడీపీ నేత : రాష్ట్రానికి ఒక్క రాజధాని ఉంటేనే మేలు కదా?

మహిళలు : ఏం మేలు? మూడు రాజధానులు ఉంటే మూడు ప్రాంతాలూ అభివృద్ధి చెందుతాయి.. మీకేంటి అభ్యంతరం?

టీడీపీ నేత : పథకాలకు డబ్బులు అడుగుతున్నారా?

మహిళలు : అప్పట్లా జన్మభూమి కమిటీల్లేవు. ఎవరూ రూపాయి అడగడం లేదు. నేరుగా మా ఖాతాల్లోకి డబ్బులు పడుతున్నాయి. అందుకే జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

హైకోర్టులో ఉద్యోగాలకు జనవరి 20న పరీక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టులో వివిధ పోస్టుల భర్తీ కోసం నిర్వహించనున్న పరీక్షల షెడ్యూల్‌ను శుక్రవారం విడుదల చేశారు. సెక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, కంప్యూటర్ ఆపరేటర్, డ్రైవర్, ఆఫీస్ సబార్డినేట్, అసిస్టెంట్, ఎగ్జామినర్, ఓవర్సీర్, అసిస్టెంట్ ఓవర్సీర్, టైపిస్ట్, కాపీయిస్టులకు 2023 జనవరి 20వ తేదీన పరీక్ష నిర్వహిస్తారు. జనవరి 14వ తేదీ నుంచి హైకోర్టు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

టీడీపీ రౌడీల స్వైర విహారం

▶ మొదటి పేజీ తరువాయి

ముగ్గురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను హతమార్చబోయారు. అంతటితో ఆగారా అంటే అదీ లేదు. 'మా నాయకుడు జూలకంటి బ్రహ్మారెడ్డి. మేం ఎవరినైనా చంపేస్తాం'' అని కేకలు వేస్తూ పట్టణ నడిబొడ్డున వీరంగం సృష్టించారు. అంతు చూస్తామంటూ సవాళ్లు విసిరారు.

అసలు ఈ ఘటన ఎలా జరిగిందంటే....

తెలుగుదేశం పార్టీ కొద్ది రోజులుగా చంద్రబాబు నాయుడి పిలుపు మేరకు 'ఇదేమి ఖర్మ రాష్ట్రానికి' అనే కార్యక్రమం నిర్వహిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించడానికి ప్రయత్నించినా ప్రజల నుంచి పెద్దగా స్పందన లేకపోవటంతో విఫలమైంది. ఇక ఫ్యాక్షన్ రాజకీయాల్లో ఆరితేరిన టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి శుక్రవారం ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. నిజానికి మాచర్లలో రెండు రోజుల క్రితం తాగి రోడ్లపై బీభత్సం సృష్టిస్తున్న యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. తన అనుచరులను అరెస్టు చేస్తారా? అంటూ బ్రహ్మారెడ్డి కొందరితో కలిసి వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌పైనే దాడికి పాల్పడ్డారు. దానికి కొనసాగింపుగానే అన్నట్టుగా... శుక్రవారం స్థానిక సొసైటీ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసే వంకతో... చుట్టుప్రక్కల ఫ్యాక్షన్ గ్రామాలకు చెందిన తన అనుచరులను ముందే పిలిపించుకున్నారు. నిజానికి విలేకరుల సమావేశానికి అన్ని ఊళ్ల నుంచి... అంత మంది రావాల్సిన పనిలేకపోయినా... ముందస్తు పథకం ప్రకారం రాడ్లు, కర్రలతో వారిని సిద్ధంగా ఉంచారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని తెలుగుదేశం కార్యకర్తలు తీవ్రంగా దుర్భాషలాడుతుండటంతో అక్కడి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, స్థానికులు వారిని ప్రశ్నించారు. దీంతో తమను అడ్డుకుంటున్నారంటూ టీడీపీ కార్యకర్తలు దాడులకు తెగబడ్డారు. వెంట తెచ్చుకున్న



వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి చేస్తున్న టీడీపీ వర్గీయులు

రాడ్లు, కర్రలతో వైఎస్సార్‌సీపీ స్థానిక నేతలు చల్లా మోహన్, ఓర్సు కిషోర్, ఉప్పుతోళ్ల శ్రీనివాసరావులపై దాడి చేశారు. వారు కిందపడిపోయినా వదలకుండా కర్రలతో దాడులు చేస్తూ, బండరాళ్లతో బలంగా గుండెలపై కొట్టారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నిస్సహాయంగా పడి ఉండిపోవటంతో... నినాదాలు చేస్తూ, ఈలలు వేసుకుంటూ పోలీసులు నచ్చజెప్పినా వినకుండా ప్రదర్శనగా రైలు గేటు వరకూ వెళ్లారు. ఒకదశలో పోలీసులపై కూడా దౌర్జన్యానికి దిగారు. కొందరు వ్యక్తులు రైల్వే గేటు వద్ద ఓ వాహనాన్ని పూర్తి స్థాయిలో దహనం చేశారు. రింగ్‌రోడ్డులోని మరో వాహనంపై రాళ్లతో దాడిచేశారు. మరో నాలుగు ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. చివరకు పోలీసులు బ్రహ్మారెడ్డిని బలవంతంగా అక్కడి నుంచి గుంటూరు పంపించారు.

కారు, కార్యాలయం దగ్ధం...

వైఎస్సార్ సీపీ కార్యకర్తలు దారుణంగా దెబ్బలు తిని, నిస్సహాయంగా రోడ్డుపై పడిపోయిన విషయం వారి బంధువులు, స్నేహితులకు తెలియటంతో వారు అక్కడికి చేరుకున్నారు. గాయపడ్డ ముగ్గురినీ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు వారికి చికిత్స చేస్తున్నారు. తమ వారిని దారుణంగా కొట్టడం, దాదాపుగా హతమార్చే ప్రయత్నం చేయటంతో... వారి బంధుమిత్రులు టీడీపీ కార్యకర్తల జులుంను నిరసించారు. ఇదే సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఓ





గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఉప్పుతోళ్ల శ్రీనివాసరావు, ఓర్సు కిషోర్



చల్లా మోహన్

కారుకు నిప్పు పెట్టారు. జూలకంటి బ్రహ్మారెడ్డి అద్దెకు ఉంటున్న ఇంటిపై కూడా దాడి చేశారు. అప్రమత్తమైన పోలీసులు ఆగంతకులను చెదరగొట్టి... పట్టణంలో 144వ సెక్షన్ అమలులోకి తెచ్చారు. ప్రత్యేక దళాలను రంగంలోకి దింపి, శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చారు. ఎక్కడికక్కడ పికెటింగ్‌లు ఏర్పాటుచేశారు.

అది ఉద్దేశ పూర్వక దాడే: పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్ రెడ్డి

నరసరావుపేట: వెల్దుర్తి ఘటన ఉద్దేశ పూర్వక దాడే అని పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన నరసరావుపేటలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'శుక్రవారం ఉదయం మాచర్లలో కార్డన్ సర్చ్ నిర్వహించగా ఎటువంటి మారణాయుధాలు దొరకలేదు. కొందరు నాయకులను గుర్తించి, హెచ్చరించాం. టీడీపీ 'ఇదేం ఖర్మ' కార్యక్రమంలో కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా సమీప ప్రత్యర్థులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడ్డారు. రెండో వర్గం వారు సైతం తిరగబడి ప్రతి దాడి చేశారు. ఇరు వర్గాలను కట్టడి చేశాం. మాచర్ల ప్రాంతంలో 144 సెక్షన్ అమలులోకి తీసుకువచ్చాం. అవసరమైన బలగాలను రంగంలోకి దింపాం. అక్కడికి నేను కూడా వెళుతున్నా. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేస్తున్నాం. దాడులకు పాల్పడిన వాళ్లందర్నీ అదుపులోకి తీసుకుంటున్నాం' అని వివరించారు.

పథకం ప్రకారమే... కావాలనే అలజడులు

మేం మొదటి నుంచీ చెబుతూనే ఉన్నాం. ప్రశాంతంగా ఉన్న పల్నాడులో అలజడులు సృష్టించేందుకు నారా చంద్రబాబునాయుడు, లోకేశ్‌లు పథకం ప్రకారం బ్రహ్మారెడ్డిని మాచర్లకు తీసుకువచ్చారు. నెలవారీ డబ్బులు ఖర్చులకిస్తూ ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తున్నారు. బ్రహ్మారెడ్డి ఈ నియోజకవర్గానికి వచ్చిన నాటి నుంచీ కావాలనే లేనిపోని గొడవలు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గడప గడపకు సంక్షేమ పథకాలు చేరుతుంటే టీడీపీ అధిష్టానం, స్థానిక నాయకులు ఓర్వలేక కావాలనే రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారు. పార్టీ కార్యక్రమం నిర్వహించడానికి వచ్చేటపుడు కర్రలు, రాడ్లను తేవాల్సిన అవసరం ఏమొచ్చింది? ఇది పక్కా ప్లాన్ కాదా? బ్రహ్మారెడ్డి, ఆయన అనుచరులు ముందుగా పథకం వేసుకుని రోడ్లపై మారణాయుధాలతో స్వైరవిహారం చేసి ప్రజలను భయాందోళనకు గురిచేశారు.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాచర్ల ఎమ్మెల్యే.

మాచర్లలో మంట పెట్టింది చంద్రబాబే

సాక్షి, అమరావతి: ప్రశాంతంగా ఉన్న మాచర్లలో మంట పెట్టింది చంద్రబాబేనని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. రాళ్లు, బరిసెలతో పక్కా పథకం ప్రకారం టీడీపీ అనుచరులు దాడి చేశారని తెలిపారు. శుక్రవారం గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలిసి ఓ ప్రకటన విడుదల చేశారు.

యుద్ధంలో గెలుపునకు చిహ్నంగా విజయ్ దివస్: గవర్నర్

రసూల్‌పురా: పదమూడు రోజుల పాటు జరిగిన యుద్ధంలో భారత సాయుధ బలగాల పోరాట పటిమకు పాకిస్తాన్ సైన్యం లొంగి పోయిందని, ఈ విజయానికి చిహ్నంగా భారత్ విజయ్ దివస్ జరుపుకుంటుందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తెలిపారు. విజయ్ దివస్‌ను పురస్కరించుకుని శుక్రవారం పరేడ్ మైదానంలోని అమర యుద్ధ వీరుల స్తూపం వద్ద అమర సైనికులకు గవర్నర్, బ్రిగేడియర్ సోమశంకర్, ఆర్మీ అధికారులు నివాళులర్పించారు. అనంతరం తమిళిసై మాట్లాడుతూ యుద్ధంలో ఎంతో మంది సైనికులు తమ ప్రాణాలు కోల్పోయి అమరులయ్యారని స్మరించుకున్నారు. ఈ విజయ్ దివస్‌ను ప్రతి పాఠశాలలో, ప్రతి కార్యాలయంలో, సంస్థల్లో అధికారికంగా జరుపుకునేలా రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని సూచించారు. అమరుల త్యాగాలను ప్రతి విద్యార్థి, యువత స్మరించుకునేలా కార్యక్రమాలు చేపట్టాలని గవర్నర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ దళాల అధికారులు పాల్గొన్నారు.

నేడు గాంధీభవన్‌లో క్రిస్మస్ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: గాంధీభవన్‌లో శనివారం సాయంత్రం క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నారు. వేడుకలకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తదితరులు హాజరవుతారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, దళిత కాంగ్రెస్ చైర్మన్ నాగరిగారి ప్రీతంలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెట్రో వర్సిటీ పనులకు లైన్ క్లియర్

• రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవతో పనులు పునఃప్రారంభం

సబ్బవరం(పెందుర్తి): రాష్ట్ర ప్రభుత్వం చూపిన ప్రత్యేక చొరవ కారణంగా అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం వంగలిలో పెట్రో యూనివర్సిటీ పనులకు ఎట్టకేలకు లైన్ క్లియర్ అయింది. ఇక్కడ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) ఏర్పాటు చేయాలని 2016లో పనులు ప్రారంభించారు. అయితే భూముల పరిహారం విషయంలో కోర్టు కేసులు ఉండడంతో సుదీర్ఘకాలంగా పనులు నిలిచిపోయాయి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవడంతో రైతులు సానుకూలంగా స్పందించారు. దీంతో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం పనులు చేపట్టడానికి వీలుగా తీర్పు ఇవ్వడంతో శుక్రవారం నిర్మాణ పనులు పునఃప్రారంభమయ్యాయి. ఈ పనులను



వర్సిటీ వద్ద పనులు ప్రారంభిస్తున్న అధికారులు

వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ బి.మురళీకృష్ణ ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎస్.త్రినాథరావుతో కలిసి ప్రారంభించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ 2016లో రూ.655 కోట్ల నిధులతో పనులు ప్రారంభించామన్నారు. వర్సిటీ నిర్మాణానికి 201.8 ఎకరాల భూమి కేటాయించారని, అయితే పరిహారం విషయంలో కొంతమంది రైతులు హైకోర్టును ఆశ్రయించడంతో నిర్మాణం పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుతం హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో పనులు తిరిగి ప్రారంభించామన్నారు. మూడేళ్ల కాలవ్యవధిలో భవన నిర్మాణాలు పూర్తవుతాయని చెప్పారు.

పనులు ప్రారంభమవడం శుభ పరిణామం: ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెట్రో యూనివర్సిటీ పనులు తిరిగి ప్రారంభం కావడం శుభ పరిణామమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. పెట్రో వర్సిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతమంతా అభివృద్ధి చెందుతుందన్నారు.

'గ్యారెంటీ' ఉండాల్సిందే..

- మూడు డిస్కంల పరిధిలో స్టార్ రేటెడ్ ఫ్యాన్లు, ఏసీలు, ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ల పంపిణీ
- వడ్డీలేని నెలవారీ వాయిదా పద్ధతిలో తీసుకునేవారికి 12 నెలలు అవకాశం
- మూడు డిస్కంల పరిధిలో మూడు ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్ట్
- తొలుత 1,500 బల్బులు, 1,500 ఫ్యాన్లు, 100 ఏసీల సరఫరా
- గ్యారెంటీగల నాణ్యమైన, బ్రాండెడ్ పరికరాలనే అందించాలని ఏపీఈఆర్‌సీ ఆదేశం

సాక్షి, అమరావతి: విద్యుత్ వృథా వినియోగాన్ని అరికట్టి భావితరాలను చీకట్ల నుంచి కాపాడేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా ఇంధనం ఆదాచేసి కరెంటు బిల్లులను తగ్గించే విద్యుత్ గృహోపకరణాలను అందించే ప్రాజెక్టు రాష్ట్రంలో త్వరలోనే మొదలుకానుంది. ఇటీవలే ప్రాజెక్టు అమలుకు అనుమతిచ్చిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ).. నిర్వాహకులైన ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఈఈడీసీవో), డిస్కంలకు తాజాగా మరికొన్ని సూచనలు చేసింది.

ఏపీఈఆర్‌సీ సూచనలు

- ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కంల) పరిధిలో విద్యుత్‌ను ఆదా చేయగల గృహోపకరణాలను వాటి కార్పొరేట్ కార్యాలయాలున్న విశాఖ, విజయవాడ, తిరుపతి నగరాల్లోగానీ లేదా డిస్కంలు సూచించే ప్రాంతంలోగానీ తొలిదశలో (పైలట్ ప్రాజెక్టుగా) సరఫరా చేయాలి.
- 1,500 ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్లు, 1,500 ఫ్యాన్లు సమకూర్చాలి. వీటిలో 300 స్మార్ట్ ఫ్యాన్లు కూడా ఉండాలి. 1.5 టన్నుల సూపర్ ఎఫిషియెంట్ స్ప్లిట్ ఎయిర్ కండిషనర్లు 100 ఇవ్వాలి. ఉపకరణం పూర్తి ధరను ముందుగా చెల్లించడానికి, లేదా ఆన్-బిల్ ఫైనాన్సింగ్ విధానంలో కట్టడానికి వినియోగదారులకు అవకాశం కల్పించాలి.
- వినియోగదారుడు ఆన్-బిల్ ఫైనాన్సింగ్ మోడల్‌ను ఎంచుకుంటే నెలవారీ వాయిదా (ఈఎంఐ)ల ద్వారా వసూలు చేయాలి. ప్రతినెల కరెంట్ వినియోగ చార్జీల్లో కలిపి చెల్లించేందుకు 12 నెలల సమయం ఇవ్వాలి. దీనికి అదనపు చార్జీలు, వడ్డీ వసూలు చేయడానికి వీల్లేదు. అయితే ఫ్యాన్లు, ఏసీలు మాత్రమే వాయిదా పద్ధతిలో ఇవ్వాలి. ఎల్‌ఈడీ బల్బులను ముందస్తు నగదు చెల్లింపులతోనే సరఫరా చేయాలి.
- ఉపకరణాలన్నీ పరికరాల తయారీదారు (మాన్యుఫాక్చరర్)ల నుంచి కొనుగోలు చేయాలి. లేదా పోటీ బిడ్డింగ్ (కాంపిటీటివ్ టెండర్) ద్వారా పంపిణీదారులను ఎంపిక చేయాలి.
- ప్రముఖ బ్రాండ్ల ఎల్‌ఈడీ లైట్లు మాత్రమే ఉండాలి. అన్ని ఉపకరణాల సరఫరాదారుల నుంచి వారంటీ, సర్వీస్ గ్యారెంటీ (సేవ హామీ) ఇవ్వాలి.
- ఈ ప్రాజెక్టుపై కరపత్రాలు (పాంప్లెట్స్), గోడ పత్రికలు (పోస్టర్స్), దృశ్యమాలిక (వీడియో చిత్రం)లతో ప్రచారం చేసి వినియోగదారులకు అవగాహన కల్పించాలి.
- పైలట్ ప్రాజెక్ట్ కోసం న్యూఢిల్లీకి చెందిన కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ విద్యుత్, పర్యావరణం, నీరు (సీఈఈడబ్ల్యూ) నాలెడ్జ్ పార్టనర్ (జ్ఞానభాగస్వామి)గా వ్యవహరిస్తుంది.
- పైలట్ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.1.405 కోట్లు. దాన్లో ప్రాజెక్టు అమలు కార్యాచరణ, ప్రచారం, జ్ఞానభాగస్వామికి ఇవ్వాల్సిన ఫీజు, ఇతర ఖర్చుల కింద రికవరీ చేయలేని మొత్తం దాదాపు రూ.25 లక్షలు.
- పైలట్ ప్రాజెక్టును 2023 మార్చి 31 నాటికి పూర్తిచేయాలి. తర్వాత 45 రోజుల్లోగా సమగ్ర నివేదికను ఏపీఈఆర్‌సీకి సమర్పించాలి.

తెలంగాణ

ప్రముఖ విద్యాసంస్థలతో ట్రిపుల్ ఐటీ ఎంవోయూ

బాసర (ముథోల్): రాష్ట్రంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థలైన ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, ఐఐటీ గచ్చిబౌలి, ఫారెస్ట్ కాలేజ్ ఆఫ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్‌తో బాసర ట్రిపుల్ ఐటీ ఎంవోయూ చేసుకున్నట్లు ఇన్‌చార్జి వీసీ వెంకటరమణ తెలిపారు. హైదరాబాద్‌లోని జేఎన్టీయూలో జరుగుతున్న ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో ఈమేరకు ఒప్పంద పత్రాలపై శుక్రవారం సంతకాలు చేసినట్లు వెల్లడించారు. పరస్పర సహకారంతో విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని, ఇంజినీరింగ్ మూడో సంవత్సరం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఒప్పందం కుదుర్చుకున్న కళాశాలల వీసీలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, బాసర ట్రిపుల్ ఐటీతో చేసుకున్న ఎంవోయూ మేరకు ఫారెస్ట్ కాలేజ్ ఆఫ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్ఆధ్వర్యంలో గ్రీన్‌హట్ ఏర్పాటు చేస్తామని డీన్ ప్రియాంక వర్గీస్ తెలిపారు. దీనిద్వారా అటవీ ఉత్పత్తులు, అటవీ సంపద పెంపు, మొక్కల పెంపకం తదితర అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఆమె వెల్లడించారు.

కొత్తగా నాలుగు కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శుక్రవారం నిర్వహించిన 4,648 కరోనా నిర్ధారణ పరీక్షల్లో నలుగురికి పాజిటివ్‌గా తేలింది. దీంతో రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన మొత్తం కరోనా కేసుల సంఖ్య 8.41 లక్షలకు చేరుకుంది. ఒక్కరోజులో కరోనా నుంచి 16 మంది కోలుకోగా, ఇప్పటి వరకు కరోనా నుంచి కోలుకున్నవారి సంఖ్య 8.37 లక్షలకు చేరింది. ప్రస్తుతం రాష్ట్రంలో 45 యాక్టివ్ కేసులున్నాయి.

ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు పెద్దపీట వేయాలి

• లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ రెడ్డెప్ప ప్రైవేటు మెంబరు బిల్లు

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతిపెద్ద నెట్‌వర్క్‌గా పేరొందిన భారతీయ రైల్వే ఆదర్శ స్టేషన్లలో భాగంగా రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, సుందరీకరణకు పెద్దపీట వేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం లోక్‌సభలో ప్రైవేటు మెంబరు బిల్లు ప్రవేశపెట్టారు. దేశం నలుమూలలా పలురంగాల ఉత్పత్తులను రాష్ట్రాలకు రవాణా చేయడంలో రైల్వే కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రమాదాలతోపాటు ఉగ్రముప్పు, స్మగ్లింగ్ ఆందోళనల నేపథ్యంలో రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ అత్యవసరమని చెప్పారు. ప్రయాణికుల భద్రతపై దృష్టి పెట్టాలని కోరారు. ఏపీలో రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

ఫిషింగ్ జెట్టీలను నిర్మించాలి

అనకాపల్లి నియోజకవర్గంలోని కొత్తపట్నం, వదనసర్పాపురం, కేజీపాలేలకు ఒకటి, బంగారమ్మపాలేనికి ఒకటి ఫిషింగ్ జెట్టీలను నిర్మించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి కేంద్ర మత్స్యశాఖ మంత్రిని కోరారు. ఆమె శుక్రవారం లోక్‌సభలో మాట్లాడుతూ భద్రత కారణాల రీత్యా నేవీ అధికారుల ఆంక్షలతో గేట్లను మూసేస్తున్నారని, దీనివల్ల పలుచోట్ల మత్స్యకారుల జీవనోపాధి నిలిచిపోతోందని ఆవేదన వ్యక్తంచేశారు.

వాల్తేరు డివిజన్ కొనసాగించాలి

ఆంధ్రప్రదేశ్‌లోని సౌత్‌కోస్ట్ రైల్వేజోన్‌లో వాల్తేరు డివిజన్‌ను కొనసాగించాలని ఎంపీ బీవీ సత్యవతి డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వాల్తేరు డివిజన్‌ను కొనసాగించాలని రైల్వే మంత్రిని కోరారు.

152 పోస్టులను భర్తీచేయాలి

వాణిజ్యశాఖలో కాఫీ విభాగంలో ఖాళీగా ఉన్న 152 పోస్టులను వెంటనే భర్తీచేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ గొడ్డేటి మాధవి కోరారు. ఆమె లోక్‌సభలో మాట్లాడుతూ కాఫీ బోర్డులో 547 పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉండగా.. ఈ సంఖ్యను సవరించి 152 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చారని, అయినా భర్తీకి చర్యలు చేపట్టలేదని చెప్పారు. తమ అనుమతి లేకుండా కొత్త పోస్టుల మంజూరు, పదోన్నతులు ఇవ్వరాదని 2017లో వాణిజ్య పన్నులశాఖ జారీచేసిన సర్క్యులర్ కారణంగా పోస్టుల భర్తీలో జాప్యం జరుగుతున్నందున ఆ సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు.

రాజ్యసభ

ఏపీలో రైతుభరోసా కేంద్రాలతో సేవలన్నీ ఒకేచోట

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ మంత్రి జవాబు

సాక్షి, న్యూఢిల్లీ: రైతులకు వన్-స్టాప్ పరిష్కారంలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుభరోసా కేంద్రాల గురించి కేంద్రానికి తెలుసని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ చెప్పారు. పరీక్షించిన వ్యవసాయ ఉత్పాదనల సరఫరా నుంచి వివిధ సేవలు, సామర్థ్యం పెంపు చర్యలు, సాగుకు సంబంధించిన పరిజ్ఞానం ప్రచారం వంటి రైతుల అవసరాలన్నింటికీ ఒకేచోట పరిష్కారం అందించేలా ఈ కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. అగ్రి-క్లినిక్స్, అగ్రి-బిజినెస్ సెంటర్స్, సాయిల్ హెల్త్‌కార్డ్ ఇలా పలు పథకాలను కేంద్రం తీసుకొచ్చిందన్నారు.

ఖరీఫ్‌లో 5.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ సీజన్‌లో ఈ నెల 11వ తేదీ వరకు 5.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు కేంద్ర వినియోగదారులు, ఆహారశాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి.. వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

జాతీయ సగటు కంటే ఏపీలోనే రైతు ఆదాయం ఎక్కువ

జాతీయ సగటు కంటే నెలసరి రైతు ఆదాయం ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ ఉందని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ తెలిపారు. జాతీయ సగటు రూ.10,218 ఉండగా ఏపీలో రైతు నెలసరి ఆదాయం రూ.10,480 అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ కూలీల రోజువారీ వేతనం 2017-18లో రూ.271.77 ఉండగా 2021-22లో రూ.249.32గా ఉందని తెలిపారు.

పేదల పక్షాన నిలబడటం తప్పా?

- చంద్రబాబు, ఎల్లో మీడియాపై మంత్రి చెల్లుబోయిన ధ్వజం
- బాబు హయాంలో 3.15 లక్షల మంది బీసీలకు రూ.1,626 కోట్ల రుణం
- ఈ మూడున్నరేళ్లలో ఏకంగా రూ.1.64 లక్షల కోట్ల ప్రయోజనం
- నాడు బీసీలను రుణగ్రస్తులను చేయాలనే పెత్తందారి పోకడ
- నేడు ఈ ప్రభుత్వంలో వారిలో పేదరికాన్ని నిర్మూలించాలనే ఆరాటం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేదలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల తరఫున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబడుతుండటం చంద్రబాబుతో కూడిన దుష్టచతుష్టయానికి, అందులోని పెత్తందారీ 'ఈనాడు' రామోజీరావుకు కంటగింపుగా మారిందని బీసీ సంక్షేమం, సమాచార, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడున్నరేళ్లలో సంక్షేమ పథకాల కింద ప్రత్యక్ష నగదు బదిలీ(డీబీటీ), నాన్ డీబీటీ పథకాల ద్వారా పేదలకు రూ.3.21 లక్షల కోట్ల ప్రయోజనాన్ని సీఎం వైఎస్ జగన్ చేకూర్చితే అందులో బీసీలకు రూ.1.64 లక్షల కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. 2014 ఎన్నికల్లో బీసీ సబ్ ప్లాన్ కింద ఏటా రూ.పది వేల చొప్పున రూ.50 వేలు ఖర్చు చేస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక రూ.20 వేల కోట్లు కూడా ఖర్చు చేయకుండా మోసం చేస్తే కమ్మగా కన్పించిందా? అని రామోజీరావును నిలదీశారు. మంత్రి ఇంకా ఏమన్నారంటే..

ఇద్దరి మధ్య ఎంత వ్యత్యాసం?

■ టీడీపీ సర్కార్ హయాంలో కార్పొరేషన్ల ద్వారా 3.15 లక్షల మంది బీసీలకు రూ.1,626 కోట్ల రుణం ఇచ్చారని 'ఈనాడు'లోనే ప్రచురించారు. ఈ మూడున్నరేళ్లలోనే సీఎం వైఎస్ జగన్ బీసీలకు 5.05 కోట్ల ప్రయోజనాలు చేకూరుస్తూ రూ.1.64 లక్షల కోట్లు ఖర్చు చేశారు. ఇద్దరి మధ్య ఎంత వ్యత్యాసం?

■ పెత్తందారి చంద్రబాబు బీసీలను రుణగ్రస్తులుగా మార్చితే.. సీఎం వైఎస్ జగన్ బీసీలలో పేదరికాన్ని నిర్మూలించి, అభివృద్ధి చేస్తున్నారు. అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ద్వారా ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామ, వార్డు సభ్యుడి నుంచి కేబినెట్ వరకు పరిపాలనలో సింహభాగం భాగస్వామ్యం కల్పించారు. ఇదంతా రామోజీరావుకు కనిపించదా?

■ బీసీ వర్గాలకు చెందిన 139 కులాలను ఒకే గొడుగు కిందకు తెచ్చి.. 56 కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసి.. వాటికి చైర్మన్‌లు, డైరెక్టర్లను నియమించి, సంక్షేమ పథకాల ఫలాలు ఆ వర్గాలకు దక్కేలా చేస్తుంటే ఎల్లో మీడియా వంకర రాతలు రాస్తోంది. వాటిని బీసీలు విశ్వసించరు.

■ 2014–19 మధ్య ఐదేళ్లలో చంద్రబాబు ఒక్క బీసీని రాజ్యసభకు పంపకుండా అన్యాయం చేసినప్పుడు మీ పాత్రికేయ విలువలు ఏమయ్యాయి? ఈ రోజు సీఎం జగన్.. నలుగురు బీసీలను రాజ్యసభకు పంపడం కన్పించలేదా? బీసీలను 11 తరాలు వెనక్కి నెట్టి, రాజకీయంగా దివాళా తీసిన చంద్రబాబును పైకి ఎత్తేందుకు ఎన్ని తప్పుడు రాతలు రాసినా ప్రయోజనం ఉండదు.

ఇక మరింత వేగంగా ప్రకృతి సాగు

- రాష్ట్రానికి రూ.120 కోట్ల ఆర్థిక సాయం చేసిన కో–ఇంపాక్ట్ సంస్థ
- ప్రపంచవ్యాప్తంగా 10 సంస్థలకు ఆర్థిక చేయూత
- ఇందులో రాష్ట్రానికి చెందిన రైతు సాధికార సంస్థ ఎంపిక
- రానున్న ఐదేళ్లలో 15 లక్షల మంది రైతులను ప్రకృతి సాగు వైపు మళ్లించడమే లక్ష్యం
- ప్రస్తుతం 3,730 గ్రామాల్లో ప్రకృతి సాగు చేస్తున్న 6.30 లక్షల మంది రైతులు



చిన్న, సన్నకారు రైతులకు ప్రయోజనం..

కో–ఇంపాక్ట్ సంస్థ ఇస్తున్న ఆర్థిక చేయూత రాష్ట్రంలో ప్రకృతి సాగును మరింత వేగంగా విస్తరించేందుకు ఉపయోగపడుతుంది. తద్వారా లక్షలాది మంది సన్న, చిన్నకారు, మహిళా రైతుల జీవనోపాధి మెరుగవుతుంది. ప్రతి రైతు ప్రకృతి సాగుకు చేరువయ్యే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ సాయం తోడ్పాటును అందిస్తోంది.

–టి.విజయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్, రైతు సాధికార సంస్థ

సాక్షి, అమరావతి: ప్రకృతి సాగులో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన రాష్ట్రానికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు ప్రపంచ స్థాయి సంస్థలు ముందుకొస్తున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో ప్రకృతి సాగు విస్తరణకు కో–ఇంపాక్ట్ అనే సంస్థ శుక్రవారం రూ.120 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. 2017లో ఏర్పాటైన కో–ఇంపాక్ట్ సంస్థ నాలుగు ఖండాల్లోని 8 దేశాల్లో విస్తరించి ఉంది. ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా దాతలు, దాతృత్వ సంస్థలు, ఇతర ప్రైవేట్‌రంగ భాగస్వాములను ఒకే వేదికపైకి చేరుస్తోంది. ఆరోగ్యం, విద్య, ఆర్థిక రంగాల్లో కృషి చేస్తున్న సంస్థలకు ఆర్థిక సాయం అందిస్తోంది. ఈ నేపథ్యంలో 'జెండర్ ఫండ్' కాంపొనెంట్ కింద రాబోయే దశాబ్దంలో ఒక బిలియన్ అమెరికన్ డాలర్లను సేకరించి వివిధ కార్యక్రమాలకు వెచ్చించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సాయం కోసం 2022–27కి అంతర్జాతీయంగా 601 సంస్థల నుంచి ప్రతిపాదనలు రాగా 10 సంస్థలను మాత్రమే కో–ఇంపాక్ట్ ఎంపిక చేసింది. ఇందులో రాష్ట్రానికి చెందిన రైతు సాధికార సంస్థ ఒకటి కావడం విశేషం. మహిళా సంఘాల భాగస్వామ్యంతో రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్తున్న రైతు సాధికార సంస్థకు ఈ ఏడాది ఆర్థిక చేయూతనివ్వాలని కో–ఇంపాక్ట్ సంకల్పించింది. ప్రస్తుతం ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో 3,730 గ్రామాల్లో 6.30 లక్షల మందిని ప్రకృతి సాగు వైపు మళ్లించడంలో రైతు సాధికార సంస్థ విజయవంతమైంది. ప్రకృతి వ్యవసాయంపై లోతైన పరిశోధనలు చేసేందుకు వైఎస్సార్ జిల్లా పులివెందులలో పరిశోధన కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. మన రాష్ట్రాన్ని స్ఫూర్తిగా తీసుకొని మేఘాలయ, సిక్కిం, అసోం వంటి రాష్ట్రాలు సైతం తమ ప్రాంతాల్లో ప్రకృతి సాగు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతున్నాయి. వచ్చే పదేళ్లలో రాష్ట్రంలో 28 లక్షల మందిని, పొరుగు రాష్ట్రాల్లో మరో 4 లక్షల మందిని ప్రకృతి సాగు వైపు మళ్లించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తాజాగా కో–ఇంపాక్ట్ సంస్థ మంజూరు చేసిన రూ.120 కోట్ల నిధులతో రానున్న ఐదేళ్లలో ఏపీలో కనీసం 15 లక్షల మంది రైతులను కొత్తగా ప్రకృతి సాగువైపు మళ్లించనున్నారు.

రామోజీ.. 'మార్గదర్శి'పై సీబీఐ విచారణకు రెడీనా!

- సిద్ధమైతే నీ పత్రికలో సిద్ధమని రాయి
- రామోజీ దోపిడీకి సీఎం జగన్ అడ్డుగా ఉన్నారనే ప్రభుత్వంపై దుష్ప్రచారం
- వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి ఫైర్
- పంటల పేర్లు తెలియని పవన్ మాటలు పట్టించుకోం



సాక్షి, అమరావతి: మార్గదర్శిలో జరుగుతున్న అక్రమాలు, తప్పులు, అవకతవకలపై సీబీఐ విచారణకు ఈనాడు రామోజీరావు సిద్ధమా? అని మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి సవాలు చేశారు. దమ్ముంటే మార్గదర్శిలో అవకతవకలు జరగలేదని నిరూపించుకోవాలన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. చిట్‌ఫండ్ పేరుతో చీట్‌చేస్తూ, నైతికత గురించి రామోజీ మాట్లాడతారా? అడిగేవారు లేరని, పేపరు ఉంది కదా అని, ఏది రాసినా చెల్లుబాటు అవుతుందనుకోవడం భ్రమ. మార్గదర్శికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో రామోజీరావు ఒక రిట్ ఫైల్ చేశారు. అదెంత హాస్యాస్పదంగా ఉందంటే.. ఏపీకి సంబంధించిన స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులకు తెలంగాణలో ఉన్న మార్గదర్శి సంస్థల్లో సోదాలు, తనిఖీలు చేసే అధికారంలేదని, నిషిద్ధమని వేశారు. మరి రామోజీరావు ఎక్కడ కూర్చుని అడ్డగోలు రాతలు రాస్తున్నారు? మార్గదర్శిని అడ్డు పెట్టుకుని ఎక్కడ చిట్స్ వసూలుచేస్తున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానం రామోజీ వద్ద ఉందా? మార్గదర్శి ఫిక్స్‌డ్ డిపాజిట్ల వసూలు సంగతేమిటి? చిట్‌ఫండ్స్ డబ్బులను సొంత వ్యాపారాలకు మళ్లించడం నిజంకాదా? ఇవాళ ఆయన దోపిడీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడ్డుగా ఉన్నారు కాబట్టే ఈ ప్రభుత్వం మీద విషం చిమ్ముతున్నారు. చంద్రబాబును సీఎంని చేయాలని ఆరాటపడుతున్నారు.

పచ్చ సిరాతో పిచ్చి రాతలు

అసలు నా మీద చేసిన ఆరోపణలకు సంబంధించి ఎక్కడైనా, ఎవరైనా ఆధారాలు చూపించారా? నెల్లూరులో జరిగిన ఒక చోరీ కేసు మీద విచారణ జరిగేటప్పుడు, నైతిక విలువలు అంటూ తనపై అడ్డగోలు రాతలు రాయడం దురదృష్టకరం. పచ్చ సిరాతో రామోజీ పిచ్చి రాతలు రాస్తున్నారు కాబట్టే, ఈనాడు పత్రిక సర్క్యులేషన్ పడిపోయింది. ఇక పంటల పేర్లు కూడా చెప్పలేని పవన్ పంటలు, ధాన్యం గురించి మాట్లాడే మాటలు అసలు పట్టించుకోవాల్సిన అవసరంలేదు.

మాతృదేశానికి తోడునివ్వడంలో

మనవాళ్లే టాప్

విదేశాల నుంచి మాతృదేశానికి భారీగా సొమ్ము పంపుతున్న భారతీయులు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 100 బిలియన్ డాలర్లు వస్తాయని ప్రపంచబ్యాంకు అంచనా	12 శాతం పెరుగుదల.. ప్రపంచంలోనే అత్యధికం..	దేశ వాణిజ్య లోటు తగ్గేందుకూ తోడ్పాటు

(శ్రీకాంత్‌రావు.కె, సాక్షి, ప్రత్యేక ప్రతినిధి)



ఉద్యోగం, ఉపాధి, వ్యాపారాల కోసం విదేశాలకు వెళ్తున్న భారతీయులు తాము సంపాదించిన సొమ్మును స్వదేశానికి పంపడంలో ప్రపంచ రికార్డు సృష్టిస్తున్నారు. స్వదేశంలోని తమ కుటుంబ అవసరాలు, పెట్టుబడుల కోసం గత ఏడాది ఏకంగా 88 బిలియన్ డాలర్లను స్వదేశానికి తరలించగా.. ఈ ఏడాది ఇది ఏకంగా 100 బిలియన్ డాలర్లకు చేరనున్నట్టు ప్రపంచ బ్యాంకు అంచనా వేయడం గమనార్హం. మన కరెన్సీలో చెప్పుకోవాలంటే.. 8,24,205 కోట్లు (ఎనిమిది లక్షల 24 వేల 205 కోట్ల రూపాయలు) అన్న మాట. ఇలా విదేశాల్లో సంపాదించిన సొమ్మును స్వదేశానికి తరలించడాన్ని రెమిటెన్స్‌గా పిలుస్తారు. ప్రపంచంలో భారత్‌కు వచ్చే రెమిటెన్సులే ఎక్కువ. ఈ రెమిటెన్సులు మన దేశ వాణిజ్య లోటును తగ్గించేందుకు, విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరిగేందుకు తోడ్పడుతున్నాయని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, మాంద్యం భయం ఉన్నప్పటికీ భారతదేశానికి భారీగా రెమిటెన్సులు రావడం ఆశావాహ పరిణామమని చెప్తున్నారు.

ఈ ఆర్థిక సంవత్సరం ప్రత్యేకం

ఎన్నో ఏళ్లుగా మన దేశానికి గణనీయంగా రెమిటెన్సులు వస్తున్నా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మరీ ప్రత్యేకమైనది. విదేశాలకు వెళ్లిన భారతీయులు అక్కడ సంపాదించి మాతృదేశానికి ఏటా పంపిస్తున్న సంపద మొదటిసారిగా వంద బిలియన్ డాలర్లకు చేరుకోనుంది. మరే దేశం కూడా భారత్ దరిదాపుల్లో లేకపోవడం గమనార్హం. ఇక్కడ కుటుంబాన్ని వదిలివెళ్లిన వారు తమ కుటుంబ అవసరాల కోసం, ఆస్తులు సమకూర్చుకోవడానికి పంపిస్తున్న సంపద.. ఇదే సమయంలో దేశాభివృద్ధిలో భాగస్వామ్యం అవుతోంది. భారత్‌కు వస్తున్న రెమిటెన్సులు ప్రధానంగా గల్ఫ్ దేశాలతోపాటు అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్, సింగపూర్, న్యూజిలాండ్ దేశాల నుంచి అందుతున్నాయి. కరోనా సమయంలో రెమిటెన్సులు కాస్త తగ్గినట్టు కనిపించినా.. అన్ని దేశాల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో తిరిగి పుంజుకున్నాయి.

దక్షిణాసియాలో పెరుగుదల 3.5 శాతం

దక్షిణాసియా దేశాలకు రెమిటెన్సులు గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి 3.5 శాతం అదనంగా ఉంటాయని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. దక్షిణాసియా దేశాలకు మొత్తంగా 163 బిలియన్ డాలర్లు వస్తాయని పేర్కొంది. ఇందులో ఒక్క భారత వాటానే 100 బిలియన్ డాలర్లుగా ఉండబోతున్నట్టు తెలిపింది. విదేశాల నుంచి మాతృదేశాలకు పంపే సొమ్ముపై చార్జీలు కూడా దక్షిణాసియాలో తక్కువని వెల్లడించింది.

వచ్చే ఏడాది తగ్గే అవకాశం!

అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రగతి తగ్గుదల, ఆర్థిక మాంద్యం ప్రభావం వల్ల దక్షిణాసియా దేశాలకు నిధులు రాక 2023 ఆర్థిక సంవత్సరంలో తగ్గే అవకాశం ఉందని ప్రపంచబ్యాంకు అంచనా వేసింది. దక్షిణాసియా దేశాలకు రెమిటెన్సులు ఈ ఏడాది 3.5 శాతం పెరిగితే.. 2023లో పెరుగుదల 0.7 శాతానికే పరిమితం కావొచ్చని పేర్కొంది. భారత్‌కు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న గల్ఫ్ కౌన్సిల్ ఆఫ్ కంట్రీస్ (జీసీసీ)లోని సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్ తదితర దేశాల నుంచి రెమిటెన్సులు తగ్గవచ్చని అంచనా వేసింది. అయితే అమెరికా, యూకే, సింగపూర్ తదితర దేశాల్లో ఎక్కువ వేతనాలు అందుకునే భారతీయులు స్వదేశానికి ఎక్కువ నిధులు పంపే అవకాశం ఉందని తెలిపింది. మొత్తంగా చాలా దేశాలకు రెమిటెన్సులు తగ్గిపోయినా.. భారతదేశానికి మాత్రం కనీసం నాలుగుశాతం మేర పెరగవచ్చని పేర్కొంది.

విదేశీ పెట్టుబడుల కంటే ఇవే అధికం

మన దేశంలోకి వచ్చే విదేశీ పెట్టుబడుల కంటే మనవాళ్లు పంపిస్తున్న నిధులే నాలుగైదు రెట్లు ఎక్కువగా ఉంటున్నాయి. భారతీయులు దేశాభివృద్ధి కోసం పడుతున్న తపన దీని ద్వారా అవగతం అవుతోందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. మనదేశ జనాభాలో కేవలం 1.3 శాతం మాత్రమే ఇతర దేశాలకు వలస వెళ్లారని.. కానీ అత్యధికంగా రెమిటెన్సులు పంపుతున్నారని ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడిస్తోంది.

భయాలు తొలగి.. ఆదాయం పెరిగి..

కరోనా మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసిన సంగతి తెలిసిందే. లాక్‌డౌన్లు, ఆంక్షలు, ఉద్యోగాల కోత, ఉపాధికి దెబ్బతో రెండేళ్లపాటు దీని ప్రభావం కనిపించింది. కొన్ని నెలలుగా ఆర్థిక కార్యకలాపాలు వేగం పుంజుకున్నాయి. విదేశాలకు వలసలు, స్వదేశానికి వచ్చే రెమిటెన్సులు పెరుగుతున్నాయి. భారతీయులు 2021లో 7.5 శాతం పెరుగుదలతో 89.4 బిలియన్ డాలర్లను మాతృదేశానికి పంపగా.. ఇది 2022లో 12 శాతం పెరుగుదలతో 100 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. ఇందుకు ప్రధానంగా ఆరు కారణాలను విశ్లేషించింది.

■ 1. మాతృదేశం నుంచి వలసలు వెళ్లినవారు తమ దేశానికి నిధులు పంపించాలన్న సంకల్పం.

■ 2. కరోనా మహమ్మారి తర్వాత క్రమంగా పరిశ్రమలు, సేవలు, పర్యాటక, విమానయానం తదితర రంగాలు మామూలు స్థితికి చేరుకోవడం, తమ దేశాలకు వెళ్లిన వారు తిరిగి విదేశాల్లో పనులకు వెళ్లడం.

■ 3. ఆయా దేశాల ఆర్థిక పరిస్థితులు మెరుగవడంతో విదేశాల్లోని భారతీయుల సంపాదన పెరిగి స్వదేశానికి ఎక్కువ నిధులు పంపించడం.

■ 4. విదేశీ మారకద్రవ్యంలో మార్పులు, డాలర్‌తో రూపాయి విలువ తగ్గడం కూడా ఎక్కువ నిధుల ప్రవాహానికి కారణం.

■ 5. కరోనా సమయంలో అభివృద్ధి చెందిన దేశాలు ఆర్థిక ఉద్దీపనలు ప్రకటించడంతో.. సంస్థలు ఉద్యోగులను కాపాడుకోవడం, వేతనాలు పెరగడం వంటివి జరగడం.

■ 6. పలు అభివృద్ధి చెందిన దేశాల్లో ద్రవ్యోల్బణం (ధరల) పెరుగుదల వలసదారుల నిజ ఆదాయాన్ని కాస్త తగ్గించాయి. అయినా మాతృదేశానికి పంపించే నిధులు పెరిగాయి.

అమెరికా, యూరోప్ నుంచి పెరుగుతున్నాయి

కొన్నేళ్లుగా అత్యధిక రెమిటెన్స్ పొందుతున్న దేశం మనదే. చైనాను కూడా ఎప్పుడో దాటేశాం. విదేశాల్లో భారతీయులు కష్టపడి సంపాదించి ఆదా చేసిన సొమ్మును ఇక్కడి తమ కుటుంబాల అవసరాలు, ఇతర కమిట్‌మెంట్లు, పెట్టుబడుల కోసం పంపిస్తున్నారు. గతంలో గల్ఫ్‌దేశాల్లో కార్మికులు సంపాదించిన చిన్నచిన్న మొత్తాలే దేశంలోని తమ కుటుంబాలకు ఎక్కువగా అందేవి. ఇప్పుడు ఇతర దేశాల్లో పెద్ద మొత్తాల్లో సంపాదిస్తున్నవారు కూడా తమ వ్యక్తిగత రెమిటెన్స్‌లు పంపించడం పెరిగింది. దాదాపు రెండున్నరేళ్ల కరోనా పరిణామాల్లో కూడా ఇతర దేశాల నుంచి వచ్చే డబ్బుపై ప్రభావం పడలేదు. గతంలో గల్ఫ్‌దేశాల నుంచి ఎక్కువగా రెమిటెన్సులు వచ్చేవి. ఇప్పుడు అమెరికా, యూరప్‌ల నుంచి వస్తున్నాయి. భారత్ చేసే ఎగుమతుల కంటే దిగుమతులే ఎక్కువ. వాటికోసం భారీగా విదేశీ మారక ద్రవ్యం చెల్లించాల్సిన పరిస్థితిలో లోటు తలెత్తుతోంది. అయితే విదేశాల నుంచి అందుతున్న రెమిటెన్స్‌లు కొంతవరకు ఈ లోటును పూడ్చుతున్నాయి.

– డి.నర్సింహారెడ్డి, ప్రముఖ ఆర్థికవేత్త, హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ విశ్రాంత డీన్


మార్గదర్శి సహాయ నిరాకరణ

- అడిగిన సమాచారం, పత్రాలు ఇవ్వడానికి నిరాకరణ.. చట్ట ప్రకారం ఇవ్వాల్సిన సమాచారమూ ఇవ్వలేదు
- అందుబాటులో లేని ఫైనాన్స్ డైరెక్టర్
- తనకేమీ తెలియదన్న వైస్ ప్రెసిడెంట్
- ఎండీ తమ ముందు హాజరవ్వాలన్న అధికారుల సూచనకూ స్పందన శూన్యం.. బ్యాంకు లావాదేవీల సమాచారం ఇచ్చేందుకూ నిరాకరణ
- పంచనామా నివేదికకు రశీదు ఇవ్వడానికీ తిరస్కరణ

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అవకతవకలపై సోదాలు నిర్వహించేందుకు వెళ్లిన ఏపీ అధికారుల బృందానికి ఆ సంస్థ యాజమాన్యం పూర్తిగా సహాయ నిరాకరణ చేసింది. చట్ట ప్రకారం సమర్పించాల్సిన పత్రాలు, సమాచారాన్ని ఇవ్వడానికి నిరాకరించింది. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిధుల మళ్లింపు, ఇతర అక్రమాలపై రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో సోదాలు జరిపిన అనంతరం నిధుల దారి మళ్లింపుపై ప్రాథమిక ఆధారాలు సేకరించారు. మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు హైదరాబాద్‌లో ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రధాన కార్యాలయంలో మూడు రోజులపాటు సోదాలు చేశారు. సోదాలు శుక్రవారం ముగిశాయి. చిట్‌ఫండ్స్ వ్యవహారాలు, బ్యాంకు లావాదేవీలు, రశీదులు, ష్యూరిటీలు తదితర వివరాలను సమర్పించాలని అధికారుల బృందం ముందుగానే నోటీసు జారీ చేసింది. అయినప్పటికీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది తమ యాజమాన్య సూచనలు, ఆదేశాలను పాటిస్తూ అధికారుల దర్యాప్తునకు ఏమాత్రం సహకరించలేదు. సంస్థ సమాచారాన్ని అధికారులకు తెలపాల్సిన మార్గదర్శి డైరెక్టర్ (ఫైనాన్స్) ఎస్. వెంకటస్వామి కార్యాలయంలో అందుబాటులో లేకుండా పోయారు. కార్యాలయంలో ఉన్న వైస్ ప్రెసిడెంట్ (అడ్మిన్) రారాజీ తనకు ఏ సమాచారం తెలీదని చెప్పడం విడ్డూరం. తాము కోరిన సమాచారాన్ని తెలిపేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీ తమ ముందు హాజరవ్వాలని లేదా తగిన అధికారిని నియోగించాలని దర్యాప్తు బృందం ఆయనకు సూచించింది. మేనేజింగ్ డైరెక్టర్‌ను సంప్రదించి చెబుతామన్న ఆయన ఆ తర్వాత ఏమాత్రం స్పందించకపోవడం గమనార్హం. మార్గదర్శి చిట్‌ఫండ్స్ బ్యాంకు లావాదేవీల సమాచారాన్ని కూడా ఇచ్చేందుకు నిరాకరించారు. సోదాల్లో తాము గుర్తించిన సమాచారం వివరాలను వెల్లడిస్తూ నమోదు చేసిన పంచనామా నివేదిక కాపీని తీసుకుని రశీదు ఇవ్వాలని దర్యాప్తు అధికారులు వైస్ ప్రెసిడెంట్ రారాజీని అడిగారు. తమ లీగల్ అడ్వైజర్‌ను సంప్రదించి అక్నాలడ్జ్‌మెంట్ ఇస్తామని తొలుత చెప్పిన ఆయన, కాసేపటికే అందుకు కూడా నిరాకరించారు. దీంతో పంచనామా నివేదిక ప్రతిని మార్గదర్శి కార్యాలయంలో గోడకు అతికించి దర్యాప్తు బృందం వెనుదిరిగింది.

వేగం పెంచండి..

- నెలాఖరుకు పెండింగ్ ఉచిత వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వాలి
- సబ్‌స్టేషన్లను మూడు నెలల్లో నిర్మించాలి
- బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలి
- విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉచిత వ్యవసాయ విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు కనెక్షన్లనివ్వడంలో వేగం మరింత పెంచాలని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రాతిపదికగా రైతులకు ఉచిత వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వాలన్న సీఎం వైఎస్ జగన్ నిర్ణయానికి అనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను ఈ నెలాఖరు నాటికి పరిష్కరించాలని ఆదేశించారు. సబ్‌స్టేషన్ల నిర్మాణం మూడునెలల్లో పూర్తికావాలన్నారు. ఇకపై వ్యక్తులకు, సంస్థలకు సబ్‌స్టేషన్ల సంఖ్యను కూడా పరిమితం చేస్తూ టెండర్లను పిలవాలని, దీనివల్ల ఎక్కువమంది కాంట్రాక్టులు పొందుతారని, పనులు వేగంగా జరుగుతాయని చెప్పారు. విద్యుత్ తీగలు, కరెంటు స్తంభాలు, కండక్టర్లు వంటి పరికరాల భద్రతా ప్రమాణాలను పరిశీలించేందుకు నిర్వహించమన్న పోల్ టు పోల్ సర్వేపై నివేదిక ఇవ్వాలని కోరారు. ప్రజలకు హాని జరిగే పరిస్థితులు పునరావృతం కాకుండా డిస్కంల సీఎండీలు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. ప్రతి కొనుగోలుకు ఇకపై ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కమర్షియల్, ఇండస్ట్రియల్ కనెక్షన్లకు సంబంధించి బకాయిల వసూలుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్నిచోట్ల కోర్టు వ్యాజ్యాల వల్ల కరెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై న్యాయపోరాటం చేసి బకాయిలను వసూలు చేయాలని చెప్పారు. హైవాల్యూ కేసుల్లో అవసరమైతే సీనియర్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డిప్యూటీ సెక్రటరీ కుమార్‌రెడ్డి, డిస్కంల సీఎండీలు కె.సంతోషరావు, జె.పద్మాజనార్దనరెడ్డి పాల్గొన్నారు.

మలి సంధ్యలో కష్టాలకు చెల్లుచీటి!

వయో వృద్ధుల సేవలో 'ఎల్డర్ లైన్–14567'

- 60 ఏళ్లు దాటిన వారి కోసం టోల్‌ఫ్రీ సేవలు
- 11 నెలల్లో వినియోగించుకున్న 23వేల మంది వృద్ధులు

నంద్యాలకు చెందిన ఓ వృద్ధురాలు రైల్వే రిటైర్డ్ ఉద్యోగి అయిన భర్త మరణించడంతో అతడి పెన్షన్‌ను రైల్వే శాఖ ఆమెకు చెల్లిస్తోంది. పెన్షన్‌కు సంబంధించిన బ్యాంక్ పాస్‌బుక్, ఏటీఎం కార్డును ఆమె కుమారుడు తన వద్దే ఉంచుకుని డబ్బులు డ్రా చేస్తూ.. ఆమెకు నెలనెలా రూ.500 మాత్రమే ఇస్తున్నాడు. ఏకైక ఆధారమైన పెన్షన్ డబ్బులు ఆమెకు అందకుండా చేస్తూ.. కనీస సౌకర్యాలు కూడా తీర్చకుండా ఇబ్బంది పెడుతున్న తన కుమారుడిపై రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేసింది. అతనికి వారు కౌన్సెలింగ్ ఇచ్చినా ఫలితం లేదు. ఎవరో చెబితే తెలుసుకుని 'ఎల్డర్ లైన్–14567' టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసింది. రంగంలోకి దిగిన ఫీల్డ్ రెస్పాన్స్ టీమ్ పోలీసుల సాయంతో కుమారుడి వద్ద ఉన్న పాస్‌బుక్, ఏటీఎం కార్డు ఆమెకు ఇప్పించడంతోపాటు ఆ వృద్ధురాలికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని కుమారుడిని హెచ్చరించింది. ఇప్పుడామె ప్రతినెలా పింఛను డబ్బులు తీసుకుని ఆనందంగా జీవిస్తోంది. మలిసంధ్యలో ఎదుర్కొంటున్న అవ్వాతాతల అవస్థలు, కష్టాలకు 'ఎల్డర్ లైన్' చెల్లు చీటి రాస్తోంది.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విశాఖ కేంద్రంగా గత ఏడాది డిసెంబర్‌లో ప్రారంభించిన 'ఎల్డర్ లైన్–14567' అవ్వాతాతల సమస్యలు తీర్చే పెద్ద దిక్కుగా మారింది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 60 ఏళ్లు దాటిన వారికి హెల్ప్ లైన్ ద్వారా టోల్‌ఫ్రీ సేవలందిస్తోంది. ప్రోగ్రామ్ మేనేజర్ పర్యవేక్షణలో 10 మంది కాల్ ఆఫీసర్లు, ఏడుగురు ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్స్, నలుగురు టీమ్ లీడర్లతో ఈ ప్రత్యేక వ్యవస్థ పనిచేస్తోంది. 14567 టోల్‌ఫ్రీ నంబర్‌కు వృద్ధులు ఫోన్‌చేసి సమస్య చెప్పిన వెంటనే.. వారి వివరాలు తీసుకుని స్థానికంగా ఉండే వయో వృద్ధుల సంక్షేమ శాఖ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో తక్షణ సేవలు అందిస్తోంది.

11 నెలల్లో 23,069 మందికి సేవలు

నవంబర్ నెలాఖరు వరకు గడచిన 11 నెలల్లో 23,069 మంది వయో వృద్ధులకు 'ఎల్డర్ లైన్' సేవలందించింది. వీరిలో 45.05 శాతం మంది వృద్ధాశ్రమాలు, ఆరోగ్య సంబంధిత సహకారం, వృద్ధులకు అనుకూలమైన ఉత్పత్తుల సమాచారం వంటి వివరాలు కోరారు. మరో 27.09 శాతం మంది కోవిడ్, ఇతర సమస్యలకు సహకారం కోరారు. 20.36 శాతం మంది చట్టపరమైన మార్గదర్శకం, పెన్షన్, బతుకుదెరువు కోసం సహకారాన్ని తీసుకున్నారు. 6.29 శాతం మంది వేధింపుల గురించి ఫిర్యాదు, తమను ఇబ్బందుల నుంచి రక్షించాలని కోరారు. 1.21 శాతం మంది భావోద్వేగంతో బాధపడుతున్న వారు (ఎమోషనల్ సపోర్ట్) ఉన్నారు.


ఏడు రకాల ప్రధాన సేవలు

- ■ ఎల్డర్ లైన్–14567 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వృద్ధాశ్రమాలు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, సంరక్షణ కేంద్రాలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర సమాచారం పొందవచ్చు.



- ■ వృద్ధులను హింసించడం, ఇంటినుంచి గెంటివేయడం వంటి వాటిపై చర్యలు తీసుకుని వృద్ధులకు రక్షణ కల్పిస్తారు.
- ■ తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ–సంరక్షణ చట్టం 2007 గురించి అవగాహన కల్పిస్తారు.
- ■ నిర్లక్ష్యానికి గురైన తల్లిదండ్రులకు వారి పిల్లల నుంచి పోషణ భృతి వచ్చేలా ట్రిబ్యునల్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తారు.
- ■ పెన్షన్ తదితర చట్టపరమైన సమస్యలపై సూచనలు, సలహాలు ఇస్తారు.
- ■ నిరాదరణకు గురైన, ఎవరూ లేని అభాగ్యులైన వృద్ధులను వారి సమ్మతితో వృద్ధాశ్రమాల్లో చేర్పిస్తారు.
- ■ విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వారికి చేతి కర్రలు, చెవిటి మెషీన్, ఇతర పరికరాలు అందిస్తారు.


వృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వృద్ధులకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వారికి అవసరమైన సేవలు అందించేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో వృద్ధాప్య పెన్షన్‌కు 65 ఏళ్లు నిండాలనే నిబంధన ఉండేది. దాన్ని 2019 జూన్‌లో సీఎం వైఎస్ జగన్ 60 ఏళ్లకే కుదించి ఎక్కువ మందికి పెన్షన్ అందేలా చర్యలు తీసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో 23.43లక్షల మందికి వృద్ధాప్య పెన్షన్‌లు ఇచ్చేవారు. ప్రస్తుతం 34.50లక్షల మందికి ఇస్తున్నారు. వృద్ధుల కోసం ప్రత్యేకంగా వృద్ధాశ్రమాలు, ఆసుపత్రులను నిర్వహిస్తున్నారు. సహకారం, చేయూతను అందించడంతోపాటు ఎప్పటికప్పుడు వారి సమస్యలు పరిష్కరించేలా హెల్ప్‌లైన్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.

– బి.రవిప్రకాశ్‌రెడ్డి, డైరెక్టర్, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ

విస్తృత అవగాహన కార్యక్రమాలు



వృద్ధులకు అవసరమైన సేవలందించే ఎల్డర్‌లైన్–14567 టోల్ ఫ్రీ నంబర్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో ఏపీలో గతేడాది డిసెంబర్ 16న దీనిని ప్రారంభించారు. వృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి జరుగుతోంది. తల్లిదండ్రులు, వృద్ధుల పోషణ–సంరక్షణ చట్టం 2007పై ప్రతి జిల్లాలో అవగాహన కల్పిస్తున్నారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, రిటైర్డ్ పెన్షనర్ల అసోసియేషన్, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్, వార్డు, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, పాఠశాలలు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తప్పిపోయిన, ఇంటినుంచి వెళ్లిపోయిన వృద్ధులను సైతం ప్రభుత్వ యంత్రాంగం రక్షించి తమ వాళ్ల దగ్గరకు చేర్చింది.

– లంకపల్లి మ్రినాల్, మేనేజర్, ఏపీ ఎల్డర్ లైన్

సాక్షి విజయనగరం

శనివారం । 17 । డిసెంబర్ । 2022



చర్యలు తీసుకోవాలి

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రభుత్వ నిబంధనలు పాటించని కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు కోరారు. డీఈఓ లింగేశ్వరరెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు.



నెలగంటు ప్రకటించిన జంగమ దేవరలు

తెర్లాం: మండలంలోని 33 పంచాయతీల్లో శుక్రవారం నెలగంటు చాటింపువేశారు. ఉద్దవోలు గ్రామంలో జంగమ దేవరలు అన్ని వీధుల్లో తిరుగుతూ నెలగంటును ప్రకటించారు.



హైవే పనుల్లో వేగం పెంచాలి

జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారుల పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు.

- 10లో

న్యూస్‌రీల్

రామతీర్థంలో సహస్ర దీపాలంకరణ



దీపాల వెలుగులో స్వామివారికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవను శుక్రవారం వైభవంగా జరిపారు. సీతారామస్వామివారి ఉత్సవ విగ్రహాలను అర్చకులు పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి మంగళవాయిద్యాలతో తూర్పు రాజగోపురం వద్దనున్న ప్రాంగణ వేదిక వద్దకు తీసుకెళ్లారు. ప్రత్యేక ఊయల్లో ఉంచి దీపాల కాంతిలో ఊంజల్ సేవ నిర్వహించారు.

కామన్వెల్త్ విజేతకు సత్కారం



అనిల్‌కుమార్‌ను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: న్యూజిలాండ్‌లో ఇటీవల జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన బి.అనిల్‌కుమార్‌ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తన నివాసంలో శుక్రవారం దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ బొండపల్లి మండలం సామవలస గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని 83 కేజీల కేటగిరీలో బంగారు పతకం సాధించి దేశానికి, జిల్లాకు పేరుతెచ్చారన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విషయాలు సాధించాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నడిపేన శ్రీనివాసరావు ఉన్నారు.

సేంద్రియ ఉత్పత్తులకు గిరాకీ



సేంద్రియ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

- కలెక్టర్ సూర్యకుమారి
- వ్యవసాయ పరిశోధన స్థానంలో కిసాన్ మేళాను ప్రారంభించిన కలెక్టర్

విజయనగరం ఫోర్ట్: సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేసిన పంట ఉత్పత్తులకు రోజురోజుకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోందని కలెక్టర్ సూర్యకుమారి తెలిపారు. విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానంలో కిసాన్ మేళాను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాగులో ఆధునిక పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ విధానంలో తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకర పంటలు చేతికందుతాయని తెలిపారు. మార్కెట్‌లో గిరాకీ ఉన్న పంటలు సాగుచేయాలని రైతులకు పిలుపునిచ్చారు. భూసార పరీక్షలను అనుసరించాలన్నారు. నవధాన్యాలతో కూడిన పచ్చిరొట్ట ఎరువుతో సారవంతం చేసిన పొలంలో ఎకరాకు 33 బస్తాల ధాన్యం దిగుబడి వచ్చినట్టు వెల్లడించారు. జిల్లాలో అధిక సంఖ్యలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. మేళాలో రైతులకు ఉపయోగపడే వ్యవసాయ పరికరాలు, ఎరువులు, వంగడాలను ప్రదర్శించడం హర్షణీయమన్నారు. రైతులు రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించడంతో వివిధ కంపెనీలు సేంద్రియ ఎరువుల తయారీకి ప్రాధాన్యమిస్తున్నాయని, ఇది శుభపరిణామంగా పేర్కొన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విస్తరణ సంచాలకులు పి.రాంబాబు మాట్లాడుతూ పరిశోధన ఫలాలు అందరికీ అందజేసేందుకు కిసాన్ మేళాలు దోహదపడతాయన్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమృద్ధిగా వినియోగించి సత్ఫలితాలు సాధించాలన్నారు. అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకుడు జగన్నాథరావు మాట్లాడుతూ పరిశోధకుల కృషి ఫలితంగా ఎన్నో విజయాలు సాధించామని, రైతులకు ఎన్నో విధాలుగా మేలు జరిగిందన్నారు. అందరికృషి ఫలితంగా 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ఎఫ్ఏఓ గుర్తించిందని వివరించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఫలితాలు మరిన్ని సాధించాలంటే పరిశోధనలు మరింత విస్తృతం కావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు, వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి నర్సుపల్లి అనూరాధ, ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ కెల్ల లక్ష్మణ్, సీనియర్ శాస్త్రవేత్తలు వై.సంధ్యారాణి, ఎం.వి.శ్రీనివాస్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.



సాగు యంత్రాలను పరిశీలిస్తున్న విద్యార్థులు



కిసాన్ మేళాలో పాల్గొన్న రైతులు

ప్రగతి బాటలో జేఎన్‌టీయూ జీవీ

- ఆడిటోరియం, పరీక్షల నిర్వహణ విభాగాలకు కొత్త భవనాలు మంజూరు
- రూ.19 కోట్ల కేటాయింపు
- భవన నిర్మాణాలకు నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి బొత్స
- ఇప్పటికే రూ.24.94 కోట్ల వ్యయంతో సాగుతున్న అభివృద్ధి పనులు



జేఎన్‌టీయూ జీవీ ముఖద్వారం

విజయనగరం అర్బన్: విజయనగరం జిల్లా కేంద్రంలోని జేఎన్‌టీయూ జీవీలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. వర్సిటీగా స్థాయి పెరగడంతో ఆ మేరకు వసతులు కల్పిస్తోంది. అకడమిక్ బ్లాక్-3 (అడ్మినిస్ట్రేషన్ బ్లాక్), బాలికల వసతిగృహం, మెటలర్జికల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాలకు ప్రత్యేక భవనాలు, తాగునీటి ట్యాంకు, పైపుల విస్తరణ వంటి పనులు రూ.24.94 కోట్ల వ్యయంతో చురుగ్గా సాగుతున్నాయి. కొత్తగా రూ.19 కోట్ల వ్యయంతో మరో రెండు భవనాల నిర్మాణానికి మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం శంకుస్థాపన చేయనున్నారు. రూ.11 కోట్ల వ్యయంతో వర్సిటీ ఆడిటోరియం, రూ.8 కోట్లతో చేపట్టే పరీక్షల నిర్వహణ విభాగ భవనాల నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేస్తారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు తెలిపారు.

బాలికలకు మూడో వసతి గృహం

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి జిల్లాకు జేఎన్‌టీయూ కళాశాల మంజూరు చేశారు. సుమారు 12 ఏళ్లు కావస్తున్నా అప్పట్లో నిర్మించిన వసతి గృహాలే ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం కళాశాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. విద్యార్థుల సంఖ్య పెరిగినా ఆ మేరకు వసతులు కల్పించలేదు. బాలికలకు కేవలం రెండు వసతి గృహాలే ఉన్నాయి. ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ చొరవతో రూ.3.35కోట్లతో మరో వసతి గృహం నిర్మాణానికి ఏఐసీటీ అనుమతి ఇచ్చింది. దాదాపు వంద మంది విద్యార్థినులకు సరిపడేలా మూడంతస్తుల భవనం పనులు జరుగుతున్నాయి.

ల్యాబ్‌ల విస్తరణ

విద్యార్థుల పరిశోధనలకు అనుగుణంగా వర్సిటీలోని ల్యాబ్‌లను విస్తరిస్తున్నారు. మెటలర్జికల్ ఇంజినీరింగ్ భవనానికి రూ.1.25 కోట్లు, సివిల్ ఇంజినీరింగ్ భవనానికి రూ.1.25కోట్లను జేఎన్‌టీయూ కాకినాడ యాజమాన్యం నిధులు మంజూరు చేసింది. ఒక్కో భవనంలో కనీసం నాలుగు పరిశోధన, బోధనాతరగతుల నిర్మాణం జరుగుతోంది.

క్రమశిక్షణతో కూడిన సాధనతో విజయం

- ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ రాణిసుష్మ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాణిసుష్మ

డెంకాడ: చిత్తశుద్ధి, క్రమ శిక్షణతో కూడిన సాధనతో పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, గ్రూప్-1 టాపర్ డాక్టర్ రాణిసుష్మ అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో 'పబ్లిక్ సెక్టార్‌లో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చాలామంది పోటీ పరీక్షలకు సిద్ధమవుతారని, వారు తమ ప్రయత్నాల్లో లోపాలను గుర్తించలేక వెనుకబడిపోతారని తెలిపారు. మరికొందరు ఎక్కువ సమయం కేటాయించినా విజయం సాధించలేకపోవడానికి విషయ పరిజ్ఞానం, సామాజిక సమస్యలపై పట్టులేకపోవడమే కారణమన్నారు. విశ్లేషనాత్మక పరిజ్ఞానంపై దృష్టి సారిస్తే విజయం తథ్యమన్నారు. విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్టూడెంట్ డీన్ ఎస్.మోహన్‌కుమార్, ఉమెన్ ఎంపవర్మెంట్ కన్వీనర్ ఎం.సారా కమల కుమారి, స్టూడెంట్ కో ఆర్డినేటర్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పులి బాధితులకు రూ.7.42 లక్షల పరిహారం

- డీఎఫ్ఓ వెంకటేష్



విలేకరులతో మాట్లాడుతున్న డీఎఫ్ఓ వెంకటేష్

విజయనగరం ఫూల్‌బాగ్: పులిదాడిలో గాయపడిన, చనిపోయిన జంతువులకు సంబంధించిన 42 మంది యజమానులకు పరిహారంగా రూ.7లక్షల42 వేలు అందజేసినట్టు జిల్లా అటవీ అధికారి ఎస్.వెంకటేష్ తెలిపారు. స్థానిక ఫూల్‌బాగ్‌లోని అటవీశాఖ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. ఈ నెల 21న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా మొక్కలు పంపిణీ చేస్తామని, ఏవైనా సంస్థలు వచ్చి సంప్రదిస్తే మొక్కలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.అప్పలరాజు, డీఆర్వో ప్రహ్లాదరావు, ఎఫ్ఎస్ఓలు కేశవ, కేవీఎస్ రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఖాతాదారుల అకౌంట్‌కు తిరిగి వచ్చిన డబ్బులు



సెప్టెంబర్ 10న సాక్షిలో వచ్చిన కథనం

సాక్షి ఎఫెక్ట్

వీరఘట్టం: స్థానిక యూనియన్ బ్యాంకు ఖాతాదారులైన బి.శ్రీధర్ ఖాతానుంచి రూ.7,500, బి.ప్రదీప్ ఖాతా నుంచి రూ.6,400, కె.ఉమాశంకర్ ఖాతా నుంచి రూ.9,999లు ఆగస్టు 13న ఒకే సమయంలో వారికి తెలియకుండానే డబ్బులు విత్‌డ్రా అవడంతో బాధితులు లబోదిబోమంటున్నారని సెప్టెంబర్ 10న సాక్షిలో ప్రచురితమైన 'బ్యాంకు ఖాతాదారులకు షాక్' అనే కథనంపై బ్యాంకు అధికారులు స్పందించారు. ఈ మేరకు స్థానిక బ్రాంచ్ మేనేజర్ జయరామ్ ముంబైలో ఉన్న హెడ్‌ఆఫీసుకు కంప్లెయింట్ చేశారు. దీంతో మూడునెలలుగా ముంబై హెడ్ ఆఫీసులో ఎంక్వైరీ చేయగా ఎట్టకేలకు తమ ఖాతాల్లో గతంలో విత్‌డ్రా అయిన సొమ్ము జమ అయినట్లు బాధితులు తెలిపారు. సాక్షి కథనంతో బ్యాంక్ మేనేజర్ చొరవతో తమ డబ్బులు వెనక్కి రావడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు.

దాడి ఘటనపై దర్యాప్తు



దర్యాప్తు నిర్వహిస్తున్న ఎస్సై

రాజాం: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు కారుపై దాడి జరిగిన ఘటనపై రాజాం ఎస్సై వీబీ రామకృష్ణారావు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం ఆయన దాడి జరిగిన ప్రదేశానికి చేరుకుని చుట్టుపక్కల వ్యక్తుల వద్ద వివరాలు సేకరించారు. పాలవలస శ్రీనివాసరావు దగ్గరకు చేరుకుని దాడి జరిగిన తీరుపై ఆరాతీశారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసునమోదుచేశామని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఈ సందర్భంగా వెల్లడించారు.

ఏపీవీపీ నియామకాలపై విచారణ

విజయనగరం ఫోర్ట్: వైద్యవిధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో కొద్ది నెలల క్రితం జరిగిన పోస్టుల నియామకాలపై శుక్రవారం విచారణ జరిగింది. ప్లంబర్, ఎలక్ట్రీషియన్, రేడియోగ్రాఫర్, బయోమెడికల్ ఇంజినీర్ తదితర పోస్టుల భర్తీ విషయంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు రావడంతో అప్పటి డీసీహెచ్‌ఎస్ లక్ష్మణరావు ప్రభుత్వానికి సరెండర్ చేశారు. దీనిపై విచారణ చేపట్టాలని వైద్య విధాన్ పరిషత్ కమిషనర్‌కు లెటర్ కూడా రాశారు. ఈ నేపథ్యంలో అప్పట్లో ఎంపికైన అభ్యర్థులందరినీ ప్రస్తుత డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జి.నాగభూషణరావు పిలిపించి విచారణ చేపట్టారు. నియామకాలకు సంబంధించి డబ్బులు ఎవరికైనా ఇచ్చారా? అని ఎంపికైన అభ్యర్థులందరినీ అడిగి తెలుసుకున్నారు. వారితో లిఖిత పూర్వకంగా వివరాలు తీసుకున్నారు. ఈ పూర్తి వివరాలను వైద్య విధాన్ పరిషత్ కమిషనర్‌కు పంపిస్తామని డీసీహెచ్‌ఎస్ నాగభూషణరావు తెలిపారు.

కారు అద్దం ధ్వంసం చేసిన నిందితుడి అరెస్టు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి వంజరాంపేట గ్రామానికి చెందిన మజ్జి కృష్ణను అరెస్టు చేశామని సీఐ కె.రవికుమార్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 15న వైఎస్సార్‌సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు కారుపై దాడిచేసి అద్దం ధ్వంసం చేసిన కేసులో ఆయనను అరెస్టు చేసి విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హైవే పనుల్లో వేగం పెంచాలి

- హైవే ప్రతినిధులు, అధికారులతో కలెక్టర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లా మీదుగా వివిధ ప్రాంతాలకు అనుసంధానమైన జాతీయ రహదారుల పనుల్లో మరింత వేగం పెంచి, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి సూచించారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. జాతీయ, ఆర్అండ్‌బీ రహదారుల పనుల పురోగతి, భూసేకరణ, చెల్లింపులు తదితర అంశాలపై ఎన్‌హెచ్ ప్రతినిధులు, జిల్లా అధికారులతో కలెక్టర్ శుక్రవారం తన చాంబర్లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. చాలా చోట్ల రహదారుల పనులు మందకొడిగా సాగుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, త్వరితగతిన చర్యలు చేపట్టి పరిస్థితిని చక్కదిద్దాలని హైవే ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. భూసేకరణ, చెల్లింపులకు సంబంధించిన ప్రక్రియను వీలైనంత వేగంగా పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. భూసేకరణ విషయంలో సమస్యలుంటే సంబంధిత రైతులను ఒప్పించి ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు.

భూ సేకరణలో ఇబ్బందులు

విశాఖ-రాయపూర్ 130 సీడీ రహదారి పనులకు సంబంధించి అక్కడక్కడ భూసేకరణ ప్రక్రియలో ఇబ్బందులు ఉన్నాయని హైవే ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. క్షేత్రస్థాయి పర్యటన చేసే సంబంధిత చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూర్యకుమారి విజయనగరం ఆర్‌డీఓను ఆదేశించారు. 518-ఈ పేరుతో బొడ్డవర నుంచి రాజమహేంద్రవరం వరకు నిర్మిస్తున్న విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఎన్‌హెచ్-26 రహదారిలో అప్రోచ్ రోడ్లకు సంబంధించిన సమస్యలున్నాయని అటు అధికారులు, హైవే ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఉమ్మడి పర్యటనచేసే తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో విజయనగరం ఆర్డీవో సూర్యకళ, ఆర్అండ్‌బీ ఎస్ఈ విజయశ్రీ, ఈఈ ఎన్‌హెచ్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో మానవాళికి ముప్పు



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం: ప్రపంచ మానవాళికి ముప్పుగా పరిణమించే ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించే ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పిలుపునిచ్చారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై చేపట్టిన బైక్ ర్యాలీని ఆమె కలెక్టరేట్ ఎదుట ప్రారంభించగా..కంటోన్మెంట్, కన్యకాపరమేశ్వరి ఆలయం, మూడులాంతర్లు మీదుగా కోట వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను వినియోగించవద్దని కోరారు. ప్లాస్టిక్ వాడకం వల్ల భవిష్యత్తులో ఎన్నో సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. దీన్ని దృష్ట్యా ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలను పూర్తిగా తగ్గించుకోవాలని హితవు పలికారు. ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించి సంపూర్ణ ప్లాస్టిక్ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ ఆర్ శ్రీ రాములునాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, ఏసీపీ అమ్మాజీరావు, ఈఈ కె శ్రీనివాసరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శ్లాబ్‌కూలి కూలీ మృతి



అప్పలనాయుడు మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రింగురోడ్డు ఎస్‌వీఎన్ నగర్‌లో భవన నిర్మాణ పనుల్లో భాగంగా ఇంటి ఎలివేషన్ సెంట్రింగ్ తీస్తుండగా శ్లాబ్ కూలడంతో ఓ కూలీ దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఎస్‌వీఎన్ నగర్ ప్రాంతంలో ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఇంటి ఎలివేషన్ శ్లాబ్‌కు సంబంధించిన కర్రలను నెల్లిమర్ల మండలం ఏటీ అగ్రహారానికి చెందిన జమ్ము అప్పలనాయుడు (45)ఒక్కొక్కటిగా తీస్తుండగా శ్లాబ్ కూలి అతనిపై పడిపోయింది. దీంతో ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతిచెందాడు. పక్కనే మరో కార్మికుడు వేరే సిమెంట్ పనిలో ఉండగా చిన్నపాటి గాయాలయ్యాయి. శ్లాబ్ కూలిన శబ్దం వినగానే పైకి వచ్చిన తోటి కూలీలు విరిగిన శ్లాబ్‌ను పక్కకు తప్పించి కూలీని బయటకు తీసినప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. టూటౌన్ ఎస్సై ప్రసన్నకుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌షాక్‌కు గురై యువకుడు..

మక్కువ: మండలంలోని తూరుమామిడి గ్రామానికి చెందిన సిరికి గోపాలరావు(25) విద్యుత్‌షాక్‌కు గురై, గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుని అన్న జగదీశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గోపాలరావు గత కొంతకాలం నుంచి, భద్రాదికొత్తగూడెం జిల్లా మణుగూరులో నివశిస్తూ ఉపాధి పొందుతున్నాడు. గురువారం రాత్రి వాషింగ్ మెషీన్ లో బట్టలు వేసి, స్విచ్ ఆన్‌చేస్తుండగా ఒక్కసారిగా షాక్‌కు గురై మృతిచెందాడు. అక్కడి స్థానికులు సమాచారం అందించడంతో గోపాలరావు కుటుంబసభ్యులు మణుగూరు వెళ్లారు.



గోపాలరావు (ఫైల్)

రైలునుంచి జారిపడి యువకుడు..

విజయనగరం క్రైమ్: స్థానిక కోరుకొండ రైల్వేస్టేషన్ బ్రిడ్జి సమీపంలో రైలు నుంచి జారిపడి ఒడిశా నుంచి విశాఖ వైపు వెళ్తున్న గుర్తు తెలియని యువకుడు మృతిచెందాడు. రైలులో ఫుట్‌బోర్డుపై కూర్చున్న సుమారు 20 ఏళ్ల యువకుడు నిద్రమత్తులో కిందకు తూలిపోవడంతో ముఖం పూర్తిగా ఛిద్రమైంది. ఈ మేరకు జీఆర్‌పీ ఎస్సై రవివర్మ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న జీఆర్‌పీ ఎస్సై రవివర్మ

డంగభద్రలో గజరాజులు



డంగభద్ర గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న గజరాజుల గుంపు

కొమరాడ: మండలంలోని ప్రజలను గజరాజుల బాధలు వీడడం లేదు. ఆర్తాం అటవీ ప్రాంతంలో ఉన్న గజరాజుల గుంపు అంతర్రాష్ట్ర రహదారి, రైల్వే లైన్‌ను దాటుకుని జంఝావతి డ్యామ్ సమీపం గ్రామమైన డంగభద్రకు శుక్రవారం చేరుకున్నాయి. దీంతో కోనవలస, కురుంపేట, బొడ్డవలస తదితర గిరిజన గ్రామల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని కోరుతున్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది రాత్రిపూట అందుబాటులో ఉండడం లేదని చెబుతున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించి గజరాజులు సంచరిస్తున్న సమీపంలో క్షేత్రస్థాయి సిబ్బంది ఉండేలా చూడాలని వేడుకుంటున్నారు.

ఉచిత శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్ వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందేందుకు ఆసక్తిగల అభ్యర్థులకు ఈ నెల 28న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని ఆ సంస్థ డైరెక్టర్ తిరుమలకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ యవకులు అర్హులని తెలిపారు. స్త్రీలకు హోమ్ నర్సింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, లేడీస్ టైలరింగ్, పురుషులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, ఫ్యాన్ రివైండింగ్, ఫొటో, వీడియోగ్రఫీ, వీడియో మిక్సింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్‌లలో 30 రోజులపాటు శిక్షణ ఇస్తామన్నారు. సీసీ టీవీ కెమెరా రిపేర్, ఇనిస్టాలేషన్‌లలో 13 రోజులపాటు పురుషులకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసున్న యువతీయువకులు పదో తరగతి ఒరిజినల్ మార్కుల జాబితాతో పాటు ఆధార్, రైస్ కార్డు జిరాక్స్‌లతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 99899 53145, 90147 16255, 94917 41129, 99890 57451 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న అప్పలస్వామి

పార్వతీపురం: పార్వతీపురం మున్సిపల్ గిజబ కాలనీకి చెందిన రిటైర్డ్ ఎలక్ట్రికల్ లైన్‌మెన్ గేదెల అప్పలస్వామి శుక్రవారం ఉదయం కాలనీనుంచి అడ్డాపుశీల గ్రామంవైపు మార్నింగ్ వాక్ కోసం వెళ్తుండగా ఆంజనేయ ఆలయం సమీపంలో వెనుకనుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో అప్పలస్వామి తల, పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు బంధువులు 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి ఔట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి..

వంగర: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయం ఆవరణం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగాం గ్రామానికి చెందిన యడ్ల మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం మండలకేంద్రానికి పనుల నిమిత్తం వచ్చిన మహేష్ తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో ముఖానికి, చేతికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి రాజాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

స్కూల్ బస్సు ఢీకొని మరో ఇద్దరికి..



చికిత్స పొందుతున్న నారాయణరావు

మక్కువ మండలం, కొయ్యానపేట గ్రామానికి చెందిన మురపాక నారాయణరావు, ఆయన మేనమామ నిడగంటి సింహాచలం స్కూటీపై బొబ్బిలి వెళ్తుండగా, కోటసీతారాంపురం గ్రామ సమీపంలోని చెరువుగట్టు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న నారాయణ స్కూల్/కాలేజీ బస్సు బలంగా ఢీకొంది. ఈ ఘటనలో స్కూటీపై వెళ్తున్న వారిద్దరూ రోడ్డుపై పడిపోవడంతో బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి 108 వాహనంద్వారా తరలించగా వైద్యులు చికిత్స అందించారు. ఈ మేరకు ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. నారాయణరావు బొబ్బిలిలోని గాయత్రి కాలేజీలో పనిచేస్తున్నాడు.

దొరికిన దొంగలు

- రూ.6 లక్షల విలువైన మొక్కజొన్న లారీ లోడు అపహరణ
- డూప్లికేట్ లారీ నంబర్, కాగితాలు, సెల్‌ఫోన్‌తో మోసం
- 24 టన్నుల మొక్కజొన్న పంట మాయం
- సూత్రధారితో బాటు మరో ఇద్దరి అరెస్ట్
- పది రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు



చోరీ వివరాలు వెల్లడిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు, ఎస్సై సన్యాసినాయుడు, వెనుక పట్టుబడిన దొంగలు

చీపురుపల్లి: డూప్లికేట్ కాగితాలు, డూప్లికేట్ నంబర్‌తో లారీని తీసుకొచ్చి దాదాపు రూ.6 లక్షలు విలువ చేసే 24 టన్నుల మొక్కజొన్న పంటను లారీ ట్రాన్స్‌పోర్ట్ పేరుతో లోడ్ చేసుకుని మొక్కజొన్న లోడ్‌ను గుంటూరులో అమ్మేసిన దొంగలు దొరికారు. మొక్కజొన్న వ్యాపారి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఎస్సై ఎ.సన్యాసినాయుడు నేతృత్వంలో బృందం కేవలం పదిరోజుల్లోనే ఈ కేసును ఛేదించింది. ఈ ఘటనలో ప్రధాన సూత్రధారి దంతులూరి మణికంఠవర్మతో పాటు మరో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి కోర్టు ముందు హాజరుపరిచారు. ఈ చోరీకి సంబంధించి స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవరావు, ఎస్సై ఎ.సన్యాశినాయుడు వివరాలు వెల్లడించారు.

అసలేం జరిగిందంటే..

మండలంలోని కరకాం గ్రామానికి చెందిన మొక్కజొన్న వ్యాపారి అచ్యుతరామరాజు మెట్టపల్లి గ్రామంలో రైతుల నుంచి 24 టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేశాడు. ఆ మొక్కజొన్నను అనపర్తిలో గల పరిశ్రమకు పంపించేందుకు లారీ కోసం శ్రీకాకుళంలో గల లారీ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం నుంచి లారీ రప్పించాడు. 2022 నవంబర్ 22న మెట్టపల్లి పరిసరాల్లో ఉన్న మొక్కజొన్న పంటను ఆ లారీలో లోడ్ చేసి అనపర్తి పంపించారు. అయితే నక్కపల్లి వరకు వ్యాపారితో టచ్‌లో ఉన్న లారీ డ్రైవర్ సెల్ నంబర్ తరువాత నుంచి పని చేయడం లేదు. లారీ అనపర్తి పరిశ్రమకు చేరలేదు. దీంతో కొద్ది రోజుల వరకు లారీ కోసం వెతికిన వ్యాపారి డిసెంబర్ 5న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పథకం ప్రకారమే..

కోనసీమ జిల్లాలోని రాజోలు మండలం పోతుమట్ల గ్రామానికి చెందిన దంతులూరి మణికంఠవర్మ ఈ చోరీకి ప్రధాన సూత్రధారిగా తేలింది. పథకం ప్రకారం లారీ డ్రైవర్, క్లీనర్ వ్యవహరించి లారీ లోడ్‌ను పక్కదోవ పట్టించారు. అప్పటికే చేబ్రోలులో హత్య, ఇల్లెందులో మొక్కజొన్న దొంగతనం కేసుల్లో నిందితుడిగా నేరచరిత్ర కలిగిన దంతులూరి మణికంఠవర్మ ముందుగానే పక్కా ప్రణాళికతో లారీని పంపించాడు. గుంటూరు జిల్లాలోని దిడుగు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రుద్రమళ్ల లక్ష్మీనారాయణ, తాడేపల్లి గూడెం గ్రామానికి చెందిన క్లీనర్ రమేష్‌బాబులతో కలిసి చోరీకి ప్రణాళిక రచించారు. ఈ క్రమంలో లారీకి నంబర్ ప్లేట్ మార్చి, డూప్లికేట్ నంబర్ ప్లేటు తగిలించి డూప్లికేట్ కాగితాలు సృష్టించి, సెల్‌ఫోన్ నంబర్లు మార్చి చోరీకి పాల్పడ్డారు. దుండగులు నిర్దేశించుకున్న ప్రకారం గుంటూరులో ఓ నకిలీ రైతును సృష్టించి ఆయన పేరుతో గుంటూరు సమీపంలోని ఓ పౌల్ట్రీ పరిశ్రమకు 24 టన్నుల మొక్కజొన్న పంటను విక్రయించారు. మొక్కజొన్న కొనుగోలు చేసిన ఆ పరిశ్రమ డబ్బులు చెల్లించేందుకు 21 రోజులు గడువు విధించింది. అయితే ఇంతలోనే నిందితులు పోలీసులకు చిక్కారు. అతి తక్కువ కాలంలో కేసును ఛేదించినందుకు స్టేషన్‌సిబ్బందిని ఎస్పీ దీపిక ఎం. అభినందించారు.

జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఊరట

- ప్రైవేట్ కేసును కొట్టేసిన హైకోర్టు

సంతకవిటి: మండలంలోని జావాం గ్రామంలో వైఎస్ఆర్ జగనన్న కాలనీ నిమిత్తం కేటాయించిన స్థలంలో లబ్ధిదారులకు ఇంటి పట్టాలు వెంటనే ఇవ్వాలని హైకోర్టు స్పష్టంచేసినట్లు పంచాయతీ సర్పంచ్ బోనెల ప్రసాద్ శుక్రవారం మీడియాకు తెలిపారు. ఇక్కడ ఇంటిపట్టాల నిమిత్తం గతంలో రెవెన్యూ అధికారులు స్థల నిర్ధారణ చేయగా, కొంతమంది టీడీపీ సానుభూతిపరులు ఈ స్థలాలు ఇవ్వకుండా హైకోర్టులో కేసువేసి అడ్డుకున్నారని ఆయన చెప్పారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్మోహన్‌రావు, రెవెన్యూ అధికారులు కష్టపడి హైకోర్టుకు పూర్తి స్థాయిలో ఆధారాలు అందజేయడంతో ప్రైవేట్ వ్యక్తుల కేసును హైకోర్టు డిస్మిస్ చేసిందని వెల్లడించారు. దీంతో గ్రామంలో పూర్తిస్థాయిలో నిరుపేదలకు ఇంటిపట్టాలు ఇచ్చి, ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం లభించిందన్నారు. హైకోర్టు ప్రైవేట్ వ్యక్తుల కేసును కొట్టేసి, తమకు అనుకూలంగా తీర్పును ఇవ్వడంపై సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు జెడ్పీ వైస్‌చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ క్రీడా పోటీలకు టెక్నికల్ అఫీషియల్స్‌గా జిల్లా పీడీలు



టెక్నికల్ అఫీషియల్స్‌గా నియామకమైన జిల్లా పీడీలు

విజయనగరం: ఈనెల 17 నుంచి 22వ తేదీ వరకు గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనవర్సిటీలో జరగనున్న 3వ జాతీయ స్థాయి ఏకలవ్య స్కూల్స్ క్రీడా పోటీలకు టెక్నికల్ అఫీషియల్స్‌గా జిల్లాకు చెందిన పలువురు పీడీలు నియమితులయ్యారు. ఈ మేరకు కమిషనర్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ పోటీల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఏకలవ్య స్కూల్స్ క్రీడాకారులు పాల్గొననుండగా..జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు వి.ఆనంద్‌కిషోర్ (వెంపడాం హైస్కూల్), పి.లీలాకృష్ణ (పసుపాం హైస్కూల్), కె.తవిటినాయుడు (ఆర్‌బీపురం హైస్కూల్) జి.గురునాయుడు (గడసాం హైస్కూల్), ఎ.గణేష్‌కుమార్ (చిలకలపల్లి హైస్కూల్), పి.చంద్రమోహన్ (నీలకంఠాపురం హైస్కూల్), ఎం.రామకృష్ణ (పాలవలస హైస్కూల్)లు టెక్నికల్ అఫీషియల్స్‌గా వ్యవహరించనున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,220-00
బంగారం(22సి. 10గ్రా.)	49,700-00
వెండి (కిలో)	72,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹ 230

క్లుప్తంగా

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు వరుపుల రమ్య

భోగాపురం: వైఎస్సార్‌సీపీ నాయకుడు వరుపుల శ్రీనివాసరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన సోదరుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు వరుపుల గిరి, రమ్య దంపతులు వంద మంది పేదలకు శుక్రవారం చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇమ్మిడిశెట్టి ప్రసాద్, వరుపుల మహేష్, అడ్డగర్ల కోటి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ప్రార్థనలు నిర్వహిస్తున్న రవికుమార్

విజయనగరం టౌన్: సర్వోన్నతుడైన ఏసుక్రీస్తు చెప్పిన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఏసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవికుమార్ సూచించారు. స్థానిక అంబటి సత్రం వద్దనున్న చర్చి ఆవరణలో క్రిస్మస్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి టూటౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్‌చేశారు. అనంతరం క్యాండిల్స్‌తో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పాస్టర్ ఎస్. జయరత్న కుమార్, కార్పొరేటర్ అల్లు చాణక్య, క్రీస్తు ఆరాధకులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు ఏసు

విజయనగరం టౌన్: ప్రజలను పాపాల నుంచి కాపాడే లోక రక్షకుడు ఏసు అని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తెలిపారు. శుక్రవారం రాత్రి స్థానిక కంటోన్మెంట్ సీఎస్ఐ చర్చి ఆవరణలో విజయనగరం జిల్లా ఐక్య క్రిస్మస్ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోకానికి వెలుగులు చూపిన రారాజు జీసెస్ అని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు అవనాపు విక్రమ్, కార్పొరేటర్లు ధనలక్ష్మి, పట్నాన పైడిరాజు, పార్టీ నాయకులు నాజర్, పాస్టర్ సత్యరాజ్, పాస్టర్ పి. ప్రేమానందం ప్రసంగించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు భువన్..



భువన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు అండర్ -19 విభాగంలో స్థానిక రవీంద్రభారతి విద్యార్థి ఆర్. భువన్ ఎంపికయ్యాడు. ఇటీవల ఎస్.కోటలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో భువన్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం టి. శైలజ తెలిపారు. ఈ మేరకు విద్యార్థి భువన్‌ను ఏజీఎం శ్రీహరి, డీన్ సంతోష్‌కుమార్, పీఈటీ మురళి, తదితరులు శుక్రవారం అభినందించారు.

'చెత్త నుంచి సంపద'తో పర్యావరణ పరిరక్షణ



బొమ్మలను తిలకిస్తున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్, తదితరులు

నెల్లిమర్ల: చెత్త నుంచి సంపదను సృష్టించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ అన్నారు. క్లాప్ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆదిత్య పాఠశాల విద్యార్థులు ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలతో అందమైన బొమ్మలు తయారు చేసే ప్రదర్శనను శుక్రవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి. శ్రీనివాసరావు, హెచ్‌ఎం అమృత, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జైలులోనే అదాలత్



మాట్లాడుతున్న న్యాయసేవా సంస్థ కార్యదర్శి లక్ష్మీకుమారి

విజయనగరం లీగల్: ఖైదీల కేసుల పరిష్కారం కోసం జైలులోనే అదాలత్‌లు నిర్వహిస్తామని విజయనగరం జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి అన్నారు. విజయనగరం సబ్‌జైల్‌లో జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె శనివారం మాట్లాడారు. నేరాన్ని అలవాటుగా మార్చుకోరాదని హితోపదేశం చేశారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ టి.దుర్గారావు, జైలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పుట్టినరోజున సేవా కార్యక్రమాలు

- రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి..
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



హాజరైన యువజన, విద్యార్థి విభాగాల ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 50వ జన్మదినోత్సవానికి పక్కా ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందులో భాగంగా ఈ నెల 21న నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం తన నివాసంలో వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా యువజన, విద్యార్థి విభాగాలు కృషి చేయాలన్నారు. తాను నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారికి కావాల్సిన మౌలిక వసతుల కల్పనలో ముందంజలో ఉంటున్నట్లు తెలిపారు. గత పాలకులు సగంలో ఆపేసిన బాలాజీ జంక్షన్ నుంచి మయూరి జంక్షన్ వరకు, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ దగ్గర నుంచి కలెక్టరేట్ వరకు రహదారులు పూర్తి చేస్తున్నామని చెప్పారు. అలాగే రైల్వేస్టేషన్ రోడ్డును కూడా ఆధునీకరించామని తెలిపారు. యువజన, విద్యార్థి విభాగాలు పార్టీ కోసం కొంత సమయం కేటాయించాలని.. దానివల్ల సమాజంలో గుర్తింపు, గౌరవం పెరిగే అవకాశం ఉందన్నారు. నీతిగా, నిజాయితీగా పరిపాలన చేస్తూ కార్యకర్తలు గర్వంగా తలెత్తుకునే విధంగా తన ప్రవర్తన ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేరుస్తుండడం వల్ల గడప గడపకు.. కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోందని చెప్పారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు అల్లు చాణక్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సంఘంరెడ్డి బంగారు నాయుడు, యువజన, విద్యార్థి విభాగాల నాయకులు బోడసింగి ఈశ్వరరావు, జీవీ రంగారావు, జై శంకర్ మాట్లాడుతూ, ఈనెల 21న ముఖ్యమంత్రి జన్మదిన పురస్కరించుకొని యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. యువతకు, విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టడంతో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో విజయనగరం పట్టణంలోని ఆయా డివిజన్‌ల నుంచి యువత, విద్యార్థి విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ వస్తువులపై దృష్టి సారించండి

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీరాములనాయుడు

విజయనగరం: నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్న పరిస్థితులలో ప్రత్యామ్నాయ వస్తువులపై దృష్టి సారించాలని కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు అన్నారు. ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పించేందుకు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా శుక్రవారం ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రజారోగ్య అధికారి సత్యనారాయణతో కలసి కమిషనర్ శ్రీరాములనాయుడు ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పాలిథిన్ కవర్లకు బదులు గుడ్డ సంచులను వినియోగించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు కొంతమేర ప్లాస్టిక్ ఉత్పత్తులను నిరోధించామని, ప్రత్యామ్నాయ వస్తువుల వాడకం ద్వారా సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలవుతుందనే ఉద్దేశంతో ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలి



క్రీడాకారులకు నగదు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రావణి

- డిప్యూటీ మేయర్ శ్రావణి

విజయనగరం: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు విజేతలుగా తిరిగి రావాలని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు డిప్యూటీ మేయర్ శ్రావణిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె రవాణా ఖర్చులకు రూ. 15 వేలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ, ఈ నెల 6,7 తేదీల్లో విజయనగరం విజ్జి స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. మంగళగిరిలో ఈ నెల 20,21 తేదీలలో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు. క్రీడాకారులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్ అభినందనలు తెలిపారు.

నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి కల్యాణచక్రవర్తి, ఎంపీపీ కల్యాణి, తదితరులు

పూసపాటిరేగ: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి కల్యాణ చక్రవర్తి అన్నారు. వెల్దూరు గ్రామంలోని జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. పునాదులు వేయని లబ్ధిదారులు ఈనెల 30లోగా పనులు ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మహంతి కల్యాణి, ఎంపీడీఓ రామరావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, దారపు అప్పలసూరి, దారపు లక్ష్మణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పింఛన్‌దారులకు సత్కారం

నెల్లిమర్ల: నెల్లిమర్ల తాలూకా యూనిట్‌కు చెందిన సీనియర్ పింఛనుదారులను శనివారం సత్కరించనున్నట్లు పెన్షనర్ల సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లూరి విశ్వనాథరాజు, ఎం. కమలాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల భారత పింఛనుదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభలో పింఛనుదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. అనంతరం సీనియర్ పెన్షన్‌దారులైన డి. లలితకుమారి, జీఎం ఇందిరాదేవి, జి. వెంకునాయుడు, కె. అప్పలనాయుడు, ఎన్. రామునాయుడు, పి. ధర్మారావు, వీఎస్ సత్యారావులను సత్కరించనున్నట్లు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలోని ఓ బెల్ట్ షాపులో ఏడు మద్యం బాటిళ్లను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పి. నారాయణరావు తెలిపారు. షాపు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

- మండల ప్రత్యేకాధికారి పద్మావతి



పోలిపల్లి అంగన్‌వాడీ సెంటర్-1ను తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి పద్మావతి

భోగాపురం: విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవంటూ మండల ప్రత్యేకాధికారి బి.పద్మావతి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోగాపురం ఐసీడీఎస్ పరిధిలో ఉన్న పోలిపల్లి అంగన్‌వాడీ సెంటర్-1ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఆ సమయంలో కార్యకర్త నూర్ బీబీ లేకపోవడంతో ఆరా తీశారు. డ్యూటీలో ఉన్న నూర్ బీబీని వేరే పనుల నిమిత్తం సూపర్‌వైజర్ నాగమణి బయటకు తీసుకువెళ్లారని సిబ్బంది బదులివ్వడంతో ఆమె ఆసహనం వ్యక్తం చేశారు. ఇంతలో విషయం తెలుసుకున్న సూపర్‌వైజర్ నాగమణి కార్యకర్తతో కలిసి సెంటర్ చేరుకున్నారు. వేరే సెంటర్ పర్యవేక్షణ నిమ్మితం కార్యకర్తను వెంట తీసువెళ్లానని నాగమణి చెప్పడంతో, డ్యూటీలో ఉన్న టీచర్‌ను ఎలా తీసుకుని వెళ్తావంటూ సూపర్‌వైజర్‌ను ప్రశ్నించారు. గతంలో కూడా చాలాసార్లు హెచ్చరించడం జరిగిందని, ఇక మీదట ఇలాంటివి పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాసరి బంగారయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం మిల్లును పరిశీలించిన ఎమ్మెల్సీ



మిల్లులో ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలోని విజయలక్ష్మి మోడరన్ ధాన్యం మిల్లును ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు శుక్రవారం పరిశీలించారు. మిల్లు పరిధిలోని రైతు భరోసా కేంద్రాల నుంచి ఏ మేరకు ధాన్యం సరఫరా అయినదీ ఆరా తీశారు. భద్రత విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతుల నుంచి గాని, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది నుంచి గాని ఫిర్యాదులు వస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



మృతుడి భార్య ఊర్మిలకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సన్యాసినాయుడు


నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రెడ్డి లక్ష్మణరావు కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సహాయాన్ని శుక్రవారం అందజేశారు. మృతుడి భార్య ఊర్మిలకు జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు రూ.10 వేలు అందించారు. మిగిలిన బీమా సొమ్ము బ్యాంక్ ఖాతాకు జమవుతుందని చెప్పారు. అనంతరం గ్రామంలోని స్థానిక ధోబిఖానా వద్ద రజకుల కోసం రూ.80 వేలతో బోరు ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు అక్కోజీ, వల్లూరి రాము, అప్పారావు, బాలి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హమాలీల నిరసన

నెల్లిమర్ల: విజయనగరం జిల్లా ఏపీ బేవరేజస్ గోదాంలో పనిచేస్తున్న హమాలీలు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. గోదాంకు విచ్చేసే వాహనాలకు లోడింగ్, అన్‌లోడింగ్‌ను నిలిపివేశారు. గోదాం వద్ద నిరసన చేపట్టి, సమస్యలు పరిష్కరించాలంటూ నినదించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బి.రమణ మాట్లాడుతూ సిగ్మా కంపెనీతో కలాసీలు కుదుర్చుకున్న ఒప్పందం గతేడాది అక్టోబర్‌తో ముగిసిందన్నారు. తర్వాత కొత్త ఒప్పందం చేయలేదని చెప్పారు. కూలిరేట్లు కేసుకు రూ.7 నుంచి రూ.10కి పెంచాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులతో జరిపిన చర్చలు విఫలమైనందున వర్క్ బంద్ చేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హమాలీల సమస్యలు పరిష్కరించాలని రమణ సూచించారు. సంఘ నాయకులు శ్రీను, రామకృష్ణ పాల్గొన్నారు.

వినియోగదారుల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యం

- ఈ నెల 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం
- జేసీ మయూర్ అశోక్ వెల్లడి



జాతీయ వినియోగదారుల దినోత్సవ ప్రచారపత్రాన్ని విడుదల చేస్తున్న జేసీ మయూర్‌అశోక్, అధికారులు

విజయనగరం అర్బన్: వినియోగదారుల్లో చైతన్యం కల్పించడమే లక్ష్యంగా విజయనగరం రెవెన్యూ భవనంలో ఈ నెల 24న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని జేసీ మయూర్ అశోక్ తెలిపారు. సైబర్ నేరాలు, జెనరిక్ ఔషధాలపై అవగాహన కల్పిస్తామన్నారు. 'వినియోగదారుల కమిషన్‌లలో సమర్థంగా కేసుల పరిష్కారం' అనే నినాదంతో ఈ ఏడాది ఉత్సవాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. వినియోగదారుల దినోత్సవ నిర్వహణపై కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో జేసీ చర్చించారు. ఆహార కల్తీ, తూకాల్లో హెచ్చుతగ్గులను గుర్తించడం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వినియోగదారుల హక్కులపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందజేస్తామని చెప్పారు. మహిళాశిశు సంక్షేమం, జీఎస్‌టీ, ఆహార భద్రత, తూనికలు కొలతలు, జీఎస్‌టీ, సైబర్ భద్రత తదితర అంశాలపై ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. తూర్పుత ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో 23న ఇంధన పొదుపు చేసే విద్యుత్ ఉపకరణాల ప్రదర్శనలు, గ్రీన్‌ఎనర్జీపై ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ప్రచార పత్రాన్ని జేసీ విడుదల చేశారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మధుసూదనరావు, పౌరసరఫరాల సంస్థ జిల్లామేనేజర్ మీనాకుమారి, ఈపీడీసీఎల్ డీఈ ధర్మరాజు, ప్రాంతీయ ఇంటర్ బోర్డు అధికారి సురేష్‌కుమార్, వినియోగదారుల కమిషన్ ప్రతినిధి చదలవాడ ప్రసాద్, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీలు



బాలికల విభాగంలో ఎంపికైన కబడ్డీ జట్టు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపిక పోటీలు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ పోటీలకు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల నుంచి 600 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో ఎంపికలు నిర్వహించగా బాలికల టీమ్‌కు 24 మంది, బాలుర టీమ్‌కు 24 మందిని ఎంపిక చేశారు. జిల్లా స్థాయిలో జరిగిన ఎంపిక పోటీలను సర్పంచ్ బంగారమ్మ, గ్రామపెద్దలు ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్‌వీ రమణ, వెంకటనాయుడు, బాలకృష్ణ, సూర్యారావు, హెచ్‌ఎం జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

నెల్లిమర్ల:

నగర పంచాయతీకి చెందిన ప్రజలు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, చైర్‌పర్సన్ బంగారు సరోజిని సూచించారు. స్థానిక మున్సిపల్ కల్యాణ మంటపంలో వాష్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, మహిళా సంఘాల ప్రతినిధులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాగునీటి ప్రాముఖ్యత, నీరు కలుషితం అవ్వకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్‌చైర్మన్ ఎస్. రామారావు, మెప్మా సీఎంఎం గోవిందరావు, కోఆప్షన్ సభ్యుడు సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష లేని సమాజానికి పాటుపడాలి

డెంకాడ: లింగ వివక్ష లేని సమాజానికి అందరూ పాటుపడాలని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు పిలుపునిచ్చారు. లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా వైఎస్సార్ క్రాంతిపథం ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో శుక్రవారం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వాసుదేవరావు మాట్లాడుతూ, మహిళలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని చెఅప్పరు. సమాజంలో సగభాగం మహిళలు ఉన్నారన్న విషయం మరువరాదన్నారు. గృహహింసకు ఎవరైనా పాల్పడితే వారిని శిక్షించేందుకు చట్టాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎంలు గీత, విజయలక్ష్మి, పలు గ్రామ, మండల సమాఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వీఐపీ సెక్యూరిటీ కోర్సు శిక్షణ

విజయనగరం క్రైమ్: పోలీస్ శిక్షణ కళాశాలలో రెండో బ్యాచ్‌కు నిర్వహించిన వీఐపీ సెక్యూరిటీ కోర్సు శిక్షణ శుక్రవారంతో ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు మాట్లాడుతూ 79 మంది కోస్తా జిల్లాల పీఎస్‌ఓలకు శిక్షణ ఇచ్చామన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తతమై దిశానిర్దేశం చేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆశీర్వాదం పాల్గొన్నారు.

త్వరగా ఇళ్ల నిర్మాణాలు

భోగాపురం: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి బి.పద్మావతి లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ దాసరి బంగారయ్యతో కలిసి మండలంలోని పోలిపల్లి పంచాయతీ జగనన్న కాలనీని సందర్శించారు. త్వరగా నిర్మాణాలు పూర్తి చేసి ఈ నెల 21న జరగనున్న సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, పడాల భానుప్రకాష్, కిలారి వెంకటరమణ, పతివాడ రామకృష్ణ, హౌసింగ్ ఏఈ ఆర్.రాము, ఏపీఎం రమణ, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

నెల్లిమర్ల: సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పి. నారాయణరావు సూచించారు. పట్టణంలోని చక్ర కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ గంజాయి, బ్రౌన్ సుగర్, తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా విక్రయించినా, వినియోగించినా తనకు సమాచారం అందించాలని సూచించారు.

టీటీడీ ఈఓకు ఊరట

- జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమలు నిలుపుదల
- జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి : కోర్టు ధిక్కార వ్యవహారంలో టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డికి హైకోర్టు ధర్మాసనం ఊరటనిచ్చింది. కోర్టు ధిక్కారం కింద ఆయనకు నెలరోజుల జైలుశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ సింగిల్‌జడ్జి జస్టిస్ మన్మథరావు ఇచ్చిన తీర్పు అమలును ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం నిలుపుదల చేసింది. ఈ వ్యవహారంపై లోతైన విచారణ జరపాల్సిన అవసరముందని ధర్మాసనం తేల్చింది. విచారణను 2023 ఫిబ్రవరి 13కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ధర్మాసనం శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్‌లో ప్రోగ్రాం అసిస్టెంట్ల పోస్టుల భర్తీకి సంబంధించిన వ్యవహారంలో సింగిల్‌జడ్జి జస్టిస్ మన్మథరావు తీర్పును సవాలు చేస్తూ ధర్మాసనం ముందు ధర్మారెడ్డి అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ధర్మారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.సత్యనారాయణ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ, సర్వీసు క్రమబద్ధీకరణ కోసం పిటిషనర్లు దాఖలుచేసిన వ్యాజ్యంలో ప్రభుత్వం ప్రతివాదికాదని, ప్రభుత్వ అనుమతి లేకుండా పిటిషనర్ల సర్వీసును క్రమబద్ధీకరించడం సాధ్యంకాదన్నారు. ధర్మ ప్రచార పరిషత్‌లోని ముగ్గురు ఉద్యోగుల తరఫు న్యాయవాది దుర్గాప్రసాద్ వాదనలు వినిపిస్తూ, సింగిల్ జడ్జి తీర్పుపై మరో ధర్మాసనం స్టే విధించిందే తప్ప, వాటిని రద్దుచేయలేదన్నారు. .


పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో వృద్ధురాలికి అందిన సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు


బాపట్ల జిల్లా నల్లూరు నార్త్ గ్రామంలో పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

మన ప్రభుత్వం


ప్రకాశం జిల్లా చినవరిమడుగులో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్ యాదవ్


విశాఖపట్నం జిల్లా మధురవాడలో మహిళకు పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

గిరి బాలల ఆటల సంబరం



నేటి నుంచి రాష్ట్రంలో ప్రారంభం

- తొలిసారి జాతీయ గిరిజన విద్యార్థుల క్రీడలకు ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం
- విజయవాడ మున్సిపల్ స్టేడియంలో ప్రారంభోత్సవ సభ
- లయోలా కాలేజీ, నాగార్జున యూనివర్సిటీ క్యాంపస్‌లలో పోటీలు
- హాజరుకానున్న కేంద్ర గిరిజన వ్యవహారాల సహాయ మంత్రి
- 22 రాష్ట్రాల నుంచి 4,328 మందికిపైగా విద్యార్థుల రాక

సాక్షి, అమరావతి: గిరి బాలల ఆటల పోటీలకు రాష్ట్రం సిద్ధమైంది. శనివారం గిరిజన విద్యార్థుల క్రీడా సంబరం ప్రారంభమవుతోంది. ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల మూడో జాతీయ క్రీడలు–2022కు తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇస్తోంది. ఈ నెల 22 వరకు నిర్వహిస్తున్న ఈ క్రీడల ఏర్పాట్లను ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర శుక్రవారం సమీక్షించారు. జాతీయ నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (ఎన్‌ఈఎస్‌టీఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల జాతీయ క్రీడలకు 22 రాష్ట్రాల నుంచి దాదాపు 4,328 మంది విద్యార్థులు విజయవాడకు తరలివచ్చారు. ఈ



పోటీలు విజయవాడ, గుంటూరు నగరాల్లో జరుగుతాయి. ప్రారంభ వేడుకలు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శనివారం జరుగుతాయి. ఈ వేడుకలకు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి రేణుక సింగ్ సరుట హాజరై సాయంత్రం 5 గంటలకు స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థులు మార్చ్ ఫాస్ట్, సంప్రదాయ నృత్యాలు ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉపముఖ్యమంత్రి రాజన్నదొరతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పలు శాఖల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.

పోటీలు ఇలా..

ఈనెల 18 నుంచి 21 వరకు గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, విజయవాడలోని ఆంధ్రా లయోలా కళాశాల, ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం, సీహెచ్‌కేఆర్ ఇండోర్ స్టేడియం, వీఎంసీ జింఖానా స్విమ్మింగ్ పూల్‌లో క్రీడా పోటీలు జరుగుతాయి. 15 వ్యక్తిగత, 7 టీమ్ ఈవెంట్స్ ఉంటాయి. అండర్–14, అండర్–19 విభాగాల్లో బాలురు, బాలికలకు విడివిడిగా ఈవెంట్లు ఉంటాయి.

మస్కట్‌గా కృష్ణ జింక.. 'ఏక్తా'గా నామకరణం

ఈ జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జంతువు కృష్ణ జింకను మస్కట్‌గా ఎంపిక చేశారు. భిన్నత్వంలో ఏకత్వం అనే నినాదాన్ని ప్రతిబింబించేలా మస్కట్‌కు ''ఏక్తా''గా నామకరణం చేశారు. ప్రతి రోజూ 7 వేల మందికి భోజనాలు అందించేలా ప్రత్యేక బృందాన్ని నియమించారు. క్రీడాకారులను వేదికలకు తరలించేందుకు దాదాపు 50 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు.

తెలంగాణ

ఇక నూకలకు చెల్లు!

నూకల శాతం తక్కువ ఉండే వరి వంగడం ఆర్‌ఎన్‌ఆర్ 29235 విడుదల చేసిన జయశంకర్ వ్యవసాయ వర్సిటీ

సాక్షి, హైదరాబాద్ : తక్కువ సమయంలో దిగుబడి రావడంతోపాటు మిల్లింగ్ చేసినప్పుడు నూకలు తక్కువగా వచ్చే సరికొత్త వరి రకాన్ని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసింది. 'ఆర్‌ఎన్‌ఆర్ 29235' పేరిట ఈ సరికొత్త వరి వంగడాన్ని తాజాగా విడుదల చేసింది. ఇతర రకాల వరితో పోలిస్తే దీనిద్వారా దిగుబడి కూడా పది శాతం ఎక్కువగా ఉంటుందని ప్రకటించింది. దీనితోపాటు మరో తొమ్మిది రకాల వరి వంగడాలు, ఇంకో ఐదు ఇతర పంటల రకాలను వ్యవసాయ వర్సిటీ విడుదల చేసింది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, అధిక వర్షాలను తట్టుకునేలా, తక్కువ కాలంలోనే దిగుబడి వచ్చేలా ఈ వంగడాలను అభివృద్ధి చేసినట్లు తెలిపింది. వీటన్నింటికీ కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని.. వచ్చే ఏడాది వానాకాలం సీజన్ నాటికి కొత్త రకాలు రైతులకు అందుబాటులోకి వస్తాయని వెల్లడించింది. వీటితో రైతులకు లాభసాటిగా ఉండటంతోపాటు వినియోగదారులకూ ప్రయోజనం కలుగుతుందని పేర్కొంది.

జాతీయ స్థాయిలో విడుదలైన కొత్త రకాలు..

1) వరి–1 (ఆర్‌ఎన్‌ఆర్ 11718), 2) తెలంగాణ రైస్ 5 (ఆర్‌ఎన్‌ఆర్ 28362), 3) తెలంగాణ రైస్ 6 (కేపీఎం 7048), 4) తెలంగాణ రైస్ 7 (కేఎన్ఎం 6965), 5) తెలంగాణ రైస్ 8,.. 6) నువ్వులు... రకం పేరు తెలంగాణ తిల్–1 (జేసీఎస్ 3202), 7) తెలంగాణ పశుగ్రాసపు సజ్జ–1 (టీఎస్ఎఫ్‌బీ 17–7), 8) తెలంగాణ పలుకోతల సజ్జ–1 (టీఎస్ఎఫ్‌బీ 18–1).

రాష్ట్రస్థాయిలో విడుదలైన రకాలు..

1) రాజేంద్రనగర్ వరి 3 (ఆర్‌ఎన్‌ఆర్ 15459), 2) రాజేంద్రనగర్ వరి–4 (ఆర్‌ఎన్‌ఆర్ 21278), 3) రాజేంద్రనగర్ వరి–5 (ఆర్‌ఎన్‌ఆర్ 29235), 4) తక్కువ నూక శాతం ఉండే జగిత్యాల వరి 2 (జేజీఎల్ 28545), 5) జగిత్యాల వరి 3 (జేజీఎల్ 27356), 6) మధిర మినుము–1 (ఎంబీజీ 1070), 7) నువ్వులు. రకంపేరు జగిత్యాల తిల్ –1 (జేసీఎస్ 1020).

'ఐ యాం ఫ్రీ బర్డ్ నౌ'

ప్రధానితో భేటీ తర్వాత కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: 'నేను ఏ కమిటీలో లేను... ఓన్లీ మెంబర్ ఆఫ్ పార్లమెంట్‌గా ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్నా. ఏ కమిటీలో లేను కాబట్టి ఐ యాం ఫ్రీ బర్డ్ నౌ' అని కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాజకీయాల గురించి ఇప్పుడేమీ మాట్లాడనని, ఎన్నికలకు సరిగ్గా నెలముందు మాట్లాడతానని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్‌లో గతంలోని కమిటీలన్నీ రద్దయ్యాయని, ఇప్పుడిక తాను స్టార్ క్యాంపెయినర్‌గా లేనని, వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి కేవలం లోక్‌సభ సభ్యుడిగా ఉన్నాడని స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ కోసం మంత్రి పదవినే చెప్పుతో సమానంగా వదిలేసిన తాను కమిటీలను పట్టించుకుంటానా అని ప్రశ్నించారు. కాగా, ఎమ్మెల్యేగా పోటీ చేస్తే నల్లగొండ నుంచే పోటీ చేస్తానని గతంలోనే చెప్పానని, ఎంపీగా ఏ పార్టీ నుంచి పోటీ చేయాలన్నది ఎన్నికలకు నెలరోజుల ముందు మాత్రమే చెప్తానన్నారు. శుక్రవారం మధ్యాహ్నం పార్లమెంటులో ప్రధాని నరేంద్ర మోదీతో ఎంపీ వెంకట్‌రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు.

బురదచల్లడం మానుకోండి

- శంఖవరం, గుర్రంకొండలో వలంటీర్ల నిరసన
- ఈనాడు ప్రతులు, రామోజీరావు దిష్టిబొమ్మలు దహనం

శంఖవరం/గుర్రంకొండ: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా వ్యవహరిస్తూ నిస్వార్థంగా సేవలందిస్తున్న తమపై బురదచల్లడం మానుకోవాలని ఈనాడు పత్రిక, రామోజీరావుపై పలువురు వలంటీర్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. వలంటీర్‌లపై 'ఈనాడు'లో వచ్చిన అసత్య కథనాన్ని ఖండిస్తూ శుక్రవారం కాకినాడ జిల్లా శంఖవరం, అన్నమయ్య జిల్లా గుర్రంకొండలో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ఈనాడు దినపత్రిక ప్రతులు, రామోజీరావు దిష్టిబొమ్మలను వలంటీర్లు దహనం


గుర్రంకొండలో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

చేశారు. వలంటీర్లు మాట్లాడుతూ 'ఈనాడులో ప్రచురించినట్లుగా మేం వేగులం కాదు... ప్రజాసేవకులం. అవినీతికి తావులేకుండా అద్భుతంగా పనిచేస్తున్న వలంటీర్ వ్యవస్థపై ప్రజల్లో అపోహలు సృష్టించడానికి రాజకీయ కోణంలో దుష్ప్రచారం చేయడం దారుణం. ఇప్పటికైనా వాస్తవాలను ప్రచురించాలి' అని అన్నారు.

న్యాయం చేసిన వారినే ప్రశ్నిస్తారా?

- చంద్రబాబును గద్దెనెక్కించాలని పచ్చ పత్రికల ఆరాటం
- మంత్రి విడదల రజిని మండిపాటు

యడ్లపాడు: రాష్ట్రంలో బీసీలను మోసం చేసిన వారిని వదిలేసి, సమున్నత స్థానం కల్పిస్తూ.. అన్ని విధాల న్యాయం చేసిన ప్రభుత్వాన్నే ప్రశ్నించడం, విమర్శించడం చంద్రబాబుకు, పచ్చపత్రికలకు అలవాటైందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని విమర్శించారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తిమ్మాపురంలో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబును ఉన్న పళంగా అందలం ఎక్కించాలనే ఆరాటం పచ్చ మీడియాలో రోజూ కనిపిస్తోందని విమర్శించారు. బీసీలకు ఏదో అన్యాయం జరిగిపోతోందంటూ ఈనాడులో ప్రచురిస్తున్న తప్పుడు కథనాలు



జర్నలిజం విలువల్ని దిగజారుస్తున్నాయని చెప్పారు. బీసీలకు అండగా నిలిచిన ప్రభుత్వానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతుండటం చూసి ఓర్వలేకే పచ్చపత్రికలు తప్పుడు రాతలు రాస్తున్నాయని ఆమె మండిపడ్డారు. జగనన్న ప్రభుత్వంలో శాసనసభ స్పీకర్‌తో పాటు 11 మంది బీసీ మంత్రులు, 10 మంది ఎంపీలు, 31 మంది ఎమ్మెల్యేలు, 12 మంది ఎమ్మెల్సీలు, 56 మంది బీసీ కార్పొరేషన్ చైర్మన్లు, మెంబర్లు, 44 మంది మున్సిపల్ చైర్మన్లు, ఆరుగురు జడ్పీ చైర్మన్లు, 9 మంది మేయర్లు, 53 మంది ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్ల పదవుల్లో ఉండటం చంద్రబాబుకు, పచ్చ మీడియాకు కనిపించదా? అని ప్రశ్నించారు.

'ప్రత్యేక హోదా మరుగునపడిన అంశం'

ఏలూరు (టూటౌన్): ప్రత్యేక హోదా మరుగునపడిపోయిన అంశమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ అలసత్వమే దీనికి కారణమని ఆమె చెప్పారు. ఏలూరులో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ప్రత్యేక హోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీని స్వాగతించారన్నారు. విభజన చట్టంలో పొందుపర్చిన మెజారిటీ అంశాల్లో కేంద్రం రాష్ట్రానికి పూర్తి సహకారం అందజేస్తుందని తెలిపారు. ఎన్నికలకు ముందు రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని వైఎస్ జగన్ ఇచ్చిన హామీని విస్మరించారని చెప్పారు. చంద్రబాబు దిగిపోతూ రాష్ట్ర ప్రజలపై రూ.2.50 లక్షల కోట్ల అప్పుల భారం మోపారని చెప్పారు.

సాక్షి స్పోర్ట్స్

రిటైర్మెంట్ ప్రకటించిన అజహర్ అలీ

పాకిస్తాన్ సీనియర్ ఆటగాడు, టెస్టు స్పెషలిస్ట్ అజహర్ అలీ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. నేటినుంచి ఇంగ్లండ్‌తో జరిగే మూడో టెస్టు అజహర్ కెరీర్‌లో చివరిది కానుంది. గత కొంత కాలంగా ఫామ్ కోల్పోయి అజహర్ ఇబ్బంది పడుతున్నాడు. దాంతో వంద టెస్టుల మైలురాయికి మూడు మ్యాచ్‌ల ముందే అతను తప్పుకుంటున్నాడు. కెరీర్‌లో 96 టెస్టులు ఆడిన అతను 42.49 సగటుతో 7097 పరుగులు సాధించాడు. ఇందులో 19 సెంచరీలు, 35 అర్ధసెంచరీలు ఉన్నాయి. 302 నాటౌట్ అజహర్ అత్యధిక స్కోరు. పాక్ తరఫున టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో ఐదో స్థానంతో అజహర్ కెరీర్ ముగిస్తున్నాడు. 53 వన్డేల్లో పాక్‌కు ప్రాతినిధ్యం వహించినా అతనికి పెద్దగా గుర్తింపు రాలేదు. ఈ ఫార్మాట్‌లో 36.90 సగటుతో 1845 పరుగులు సాధించిన అలీ 3 సెంచరీలు, 12 హాఫ్ సెంచరీలు నమోదు చేశాడు.



పుజారా, గిల్ సెంచరీలు

తొలి టెస్టులో మూడో రోజూ భారత్‌దే! 17 పరుగులకే ప్రత్యర్థి చివరి రెండు వికెట్లు పడగొట్టిన టీమిండియా ఆపై బ్యాటింగ్‌లో చెలరేగింది...దాదాపు నాలుగేళ్ల తర్వాత పుజారా సెంచరీ సాధిస్తే యువ బ్యాటర్ శుబ్‌మన్ గిల్ తొలి శతకంతో మెరిశాడు...ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసి బంగ్లాదేశ్ ముందు ఏకంగా 513 పరుగుల లక్ష్యం ఉంచిన భారత్ చేతుల్లోకి మ్యాచ్ వచ్చేసినట్లే...ఇప్పుడున్న పరిస్థితుల్లో మిగిలిన రెండు రోజులు భారత బౌలర్లను ఎదుర్కొని నిలబడే సత్తా ఆతిథ్య జట్టుకు లేకపోవడంతో మ్యాచ్‌లో నేడే ఫలితం రావొచ్చు.


- భారత్ రెండో ఇన్నింగ్స్ 258/2 డిక్లేర్డ్
- బంగ్లాదేశ్ విజయలక్ష్యం 513
- ప్రస్తుతం 42/0

చట్టోగ్రామ్: బంగ్లాదేశ్‌లో వన్డే సిరీస్ కోల్పోయిన టీమిండియా టెస్టు సిరీస్‌లో బెబ్బులిలా గర్జించింది. భారత్ ధాటికి తొలి టెస్టులో ఆతిథ్య బౌలింగ్, బ్యాటింగ్ చెల్లాచెదురైంది. ఈ మూడు రోజులు తొమ్మిది సెషన్లపాటు భారత్‌దే పైచేయి అయ్యింది. టీమిండియా టాపార్డర్ బ్యాట్స్‌మెన్ రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీలతో కదం తొక్కారు. ఓపెనర్ శుబ్‌మన్ గిల్ (152 బంతుల్లో 110; 10 ఫోర్లు, 3 సిక్సర్లు), చతేశ్వర్ పుజారా (130 బంతుల్లో 102 నాటౌట్; 13 ఫోర్లు) చెలరేగారు. పుజారా కెరీర్‌లో ఇది అత్యంత వేగవంతమైన సెంచరీ (130 బంతుల్లో) కావడం విశేషం. దీంతో 61.4 ఓవర్లలోనే 2 వికెట్లకు 258 పరుగులు సాధించిన భారత్ రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం 513 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన బంగ్లాదేశ్ వికెట్ నష్టపోకుండా 42 పరుగులు చేసింది. నజ్ముల్ (25 బ్యాటింగ్), జాకీర్ (17 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. గెలుపు కోసం బంగ్లా మరో 471 పరుగులు చేయాల్సి ఉంది.

భారీ ఆధిక్యం

మూడో రోజు ఆట మొదలైన కాసేపటికే బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ లాంఛనం ముగిసింది. 133/8 ఓవర్‌నైట్ స్కోరుతో శుక్రవారం ఆట కొనసాగించిన ఆతిథ్య జట్టు 11.5 ఓవర్లలో మిగిలిన రెండు వికెట్లను కోల్పోయింది. 55.5 ఓవర్లలో 150 పరుగుల వద్ద ఆలౌటైంది. కెరీర్‌లో ఎనిమిదో టెస్టు ఆడుతున్న కుల్దీప్ మూడో సారి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన (5/40) నమోదు చేశాడు. భారత్‌కు 254 పరుగుల భారీ ఆధిక్యం లభించడంతో ఆతిథ్య జట్టు ఫాలోఆన్‌లో పడింది. కానీ టీమిండియా మాత్రం వారిని ఆడించకుండా రెండో ఇన్నింగ్స్‌కు శ్రీకారం చుట్టింది.


పుజారా



గిల్

పుజారా వేగంగా...

కెప్టెన్ రాహుల్ (23; 3 ఫోర్లు) రెండో ఇన్నింగ్స్‌లోనూ విఫలం కాగా, మరో ఎండ్‌లో గిల్ తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. సీనియర్ బ్యాటర్ పుజారా తొలి ఇన్నింగ్స్‌లో చేజారిన శతకాన్ని ఈ సారి అందుకున్నాడు. అందులోనూ తన నెమ్మదిగా ఉండే తన సహజశైలికి భిన్నంగా దూకుడైన ఆటతో అతను వేగంగా పరుగులు రాబట్టడం విశేషం. అటు గిల్, ఇటు పుజారా బంగ్లా బౌలర్లపై చెలరేగడంతో స్కోరులో వేగం అమాంతం పెరిగింది. ఈ క్రమంలో గిల్ 147 బంతుల్లో (10 ఫోర్లు, 2 సిక్సర్లు) ముందుగా సెంచరీని పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 113 పరుగులు జోడించిన అనంతరం గిల్ వెనుదిరిగాడు. అనంతరం కోహ్లి అండతో పుజారా (130 బంతుల్లో; 13 ఫోర్లు) కెరీర్‌లోనే 19వ సెంచరీని అందుకున్నాడు. అతని శతకం పూర్తి కాగానే భారత్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 404 **బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్:** 150 **భారత్ రెండో ఇన్నింగ్స్:** రాహుల్ (సి) తైజుల్ (బి) ఖాలిద్ అహ్మద్ 23; గిల్ (సి) సబ్–మహ్మదుల్ హసన్ (బి) మెహిదీహసన్ మిరాజ్ 110; పుజారా నాటౌట్ 102; కోహ్లి నాటౌట్ 19; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (61.4 ఓవర్లలో 2 వికెట్లకు) 258 డిక్లేర్డ్. వికెట్ల పతనం:** 1–70, 2–183.
బౌలింగ్: ఖాలెద్ అహ్మద్ 13–0–51–1, తైజుల్ 23.4–3–71–0, మెహదీ హసన్ 14–1–82–1, యాసిర్ 6–0–28–0, దాస్ 2–0–13–0, నజ్ముల్ 3–0–12–0.
బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్: నజ్ముల్ (బ్యాటింగ్) 25; జాకీర్ హసన్ (బ్యాటింగ్) 17; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 42.**
బౌలింగ్: సిరాజ్ 3–0–11–0, ఉమేశ్ 1–1–0–0, అశ్విన్ 5–1–23–0, అక్షర్ 2–0–4–0, కుల్దీప్ 1–0–4–0.

'ఫిఫా' వరల్డ్ కప్‌లో నేడు



మూడో స్థానం కోసం పోరు
క్రొయేషియా x మొరాకో
రాత్రి గం. 8:30 నుంచి
స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ఫైనల్లో భారత మహిళల హాకీ జట్టు

షూటౌట్‌లో ఐర్లాండ్‌పై గెలుపు



వాలెన్సియా: ఎఫ్ఐహెచ్ హాకీ మహిళల 'నేషన్స్ కప్' టోర్నమెంట్‌లో భారత జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. కెప్టెన్ సవిత పూనియా గోల్‌పోస్ట్ ముందు అడ్డుగోడలా నిలువడంతో భారత్ షూటౌట్‌లో 2–1తో ఐర్లాండ్‌పై గెలుపొందింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ముందుగా నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరు జట్లు 1–1తో సమంగా నిలిచాయి. తొలి క్వార్టర్‌లో ఐర్లాండ్ స్ట్రయికర్ నవొమి క్యారొల్ (13వ ని.) గోల్ చేయడంతో ఐర్లాండ్ 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో క్వార్టర్‌లోనూ ఈ ఆధిక్యాన్ని కొనసాగించింది. అయితే మూడో క్వార్టర్ ముగిసే దశలో భారత్‌కు లభించిన పెనాల్టీ కార్నర్‌ను ఉదిత (45వ ని.) గోల్‌గా మలచి స్కోరును సమం చేసింది. షూటౌట్‌లో భారత బృందంలో లాల్‌రేమ్సియామి, సోనిక గోల్స్ సాధించగా, ఐర్లాండ్ జట్టులో హన్నా మెక్‌లాలిన్ గోల్ చేసింది. ఎలెన్ కరన్ షాట్‌ను సవిత సమర్థంగా అడ్డుకుంది. అప్పటికి భారత్ 5 ప్రయత్నాలు ముగియగా... ఐర్లాండ్‌కు ఆఖరి షాట్ మిగిలుంది. క్రతిన్ ములన్ షాట్‌ను వైడ్‌గా కొట్టడంతో భారత్ 2–1తో విజయం సాధించింది. ఫైనల్ చేరిన భారత్... స్పెయిన్‌తో అమీతుమీ తేల్చుకుంటుంది.

సిడ్నీ థండర్ 15 ఆలౌట్!

టి20ల్లో అత్యల్ప స్కోరు నమోదు

సిడ్నీ: 0 0 3 0 2 1 1 0 0 4 1... ఇవీ ఒక టి20 మ్యాచ్‌లో వరుసగా 11 మంది ఆటగాళ్ల స్కోర్లు! ప్రతిష్టాత్మక బిగ్‌బాష్ లీగ్...ఐపీఎల్ తర్వాత అత్యంత ప్రజాదరణ ఉన్న టి20 టోర్నీ...ఇప్పటికే ఒకసారి చాంపియన్‌గా నిలిచిన సిడ్నీ థండర్ జట్టు... కానీ అత్యంత చెత్త ప్రదర్శనతో ఆ జట్టు టి20 చరిత్రలో తలదించుకునే రికార్డు నమోదు చేసింది. శుక్రవారం అడిలైడ్ స్ట్రైకర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సిడ్నీ థండర్ 5.5 ఓవర్లలో 15 పరుగులకే కుప్పకూలింది. ఒక్కరు కూడా రెండంకెల స్కోరు చేయలేక పోగా, ఎక్స్‌ట్రాల రూపంలో 3 పరుగులు వచ్చాయి. టి20 ఫార్మాట్‌లో విధ్వంసక ఆటగాళ్ల జాబితాలో నిలిచే అలెక్స్ హేల్స్, రిలీ రోసో సిడ్నీ జట్టులో ఉన్నారు. కనీసం ఒక్క ఆటగాడు కూడా పరిస్థితిని బట్టి నిలబడేందుకు గానీ, కౌంటర్ అటాక్‌తో పరుగులు రాబట్టేందుకు గానీ ప్రయత్నించలేదు. దాంతో 35 బంతుల్లోనే జట్టు ఇన్నింగ్స్ ముగిసింది. పదో నంబర్ బ్యాటర్ డాగెట్ బ్యాట్‌కు ఎడ్జ్ తీసుకొని ఒకే ఒక ఫోర్ రాగా... స్టేడియంలో ప్రేక్షకులంతా నిలబడి వ్యంగ్యంగా 'స్టాండింగ్ ఒవేషన్' ఇవ్వడం పరిస్థితిని చూపిస్తోంది! 17 బంతుల్లో 3 పరుగులే ఇచ్చి 5 వికెట్లు పడగొట్టిన అడిలైడ్ పేసర్ హెన్రీ థార్టన్ సిడ్నీ పతనంలో కీలక పాత్ర పోషించాడు. వెస్ అగర్ 12 బంతుల్లో 6 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. అంతకు ముందు 139 పరుగులు చేసిన స్ట్రైకర్స్ 124 పరుగులతో మ్యాచ్ గెలుచుకుంది.



హెన్రీ థార్టన్

15 టి20 క్రికెట్‌లో ఇదే అత్యల్ప స్కోరు. 2019లో కాంటినెంటల్ కప్‌లో భాగంగా చెక్ రిపబ్లిక్‌తో జరిగిన మ్యాచ్‌లో టర్కీ 21 పరుగులకే ఆలౌటైన రికార్డు ఇప్పుడు కనుమరుగైంది. అతి తక్కువ బంతులు (35) సాగిన ఇన్నింగ్స్ కూడా ఇదే.

హైదరాబాద్ బతికిపోయింది!

త్రుటిలో తమిళనాడు చేజారిన విజయం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌తో మ్యాచ్‌లో తమిళనాడు విజయలక్ష్యం 144 పరుగులు... అదీ 11 ఓవర్లలో...అంటే ఓవర్‌కు 13కు పైగా పరుగులు....సాధారణంగానైతే రంజీ ట్రోఫీలో ఇలాంటి స్థితిలో కష్టసాధ్యమైన లక్ష్యం కాబట్టి ఇరు జట్ల కెప్టెన్లు 'షేక్‌హ్యాండ్'తో 'డ్రా'కు సిద్ధమవడం సహజం. కానీ తమిళనాడు భిన్నంగా ఆలోచించింది. టి20 తరహాలో ఛేదనకు సిద్ధమై అంతకంటే వేగంగా పరుగులు సాధించింది. 7 ఓవర్లలోనే వికెట్ నష్టానికి 108 పరుగులు (ఓవర్‌కు 15.42 పరుగుల చొప్పున) చేసింది. ఎన్.జగదీశన్ (22 బంతుల్లో 59 నాటౌట్; 8 సిక్సర్లు), సాయి సుదర్శన్ (20 బంతుల్లో 42; 5 సిక్సర్లు) మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగారు. ఉప్పల్ స్టేడియంలో సిక్సర్లతో పండగ చేసుకున్నారు. 24 బంతుల్లో 36 పరుగులు చేయాల్సిన ఈ దశలో ఖాయంగా తమిళనాడు గెలుస్తుందనిపించింది. అయితే హైదరాబాద్‌కు అదృష్టం కలిసొచ్చింది. వెలుతురు తగ్గిందంటూ 'రీడింగ్' చూసి అంపైర్లు మ్యాచ్‌ను నిలిపివేశారు. దాంతో మ్యాచ్ డ్రా కాగా, తమిళనాడు బ్యాటర్లు నిరాశగా వెనుదిరిగారు. వెలుతురులేని తమకు అనుకూలంగా మారుతుందని ఊహించిన హైదరాబాద్ 'వ్యూహాత్మకంగానే' చివర్లో సమయం వృథా చేసింది. ఫీల్డర్లందరూ బౌండరీ వద్ద చేరగా, లాంగాఫ్‌నుంచి కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ బంతి బంతికీ బౌలర్ వద్దకు వచ్చి సూచనలు ఇస్తూ పోయాడు. ఒక దశలో సిక్సర్‌గా మారిన బంతిని వెనక్కి ఇవ్వడంలో హైదరాబాద్ ఫీల్డర్లు బాగా ఆలస్యం చేస్తుండటంతో తమిళనాడు ఆటగాళ్లే స్టాండ్స్‌లోకి వెళ్లిపోయి బంతులు అందించారు. కానీ చివరకు ఫలితం మాత్రం రాలేదు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 28/0తో ఆట కొనసాగించిన హైదరాబాద్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 258 పరుగులకు ఆలౌటైంది.



సాక్షి
ఫ్యామిలీ
శ్రీకాకుళం
శనివారం ॥ 17-12-2022



స్వీట్ ఎక్స్‌పెరిమెంట్

ప్రతీకాత్మక చిత్రం

పరిశోధనత్రయం

ముగ్గురమ్మాయిలు... యువ శాస్త్రవేత్తలు.

ఔషధాల అనుపానులు ఔపోశన పడుతున్నారు.

పరిశోధనలతో సమాజాన్ని ఆరోగ్యవంతం చేస్తున్నారు.

3డీ బయో ప్రింటెడ్ హ్యూమన్ మోడల్స్ రూపకల్పనకు గాను ఈ ముగ్గురు యువ శాస్త్రవేత్తలకు 'బెస్ట్ రీసెర్చ్' అవార్డు వచ్చింది. సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఉదయ్ సక్సేనా, డాక్టర్ సుబ్రహ్మణ్యం వంగల పర్యవేక్షణలో యువ శాస్త్రవేత్తలు శరణ్య, అర్పిత రెడ్డి, ఆర్. ఎస్. సంజన బత్తుల సంయుక్తంగా నిర్వహించిన పరిశోధన ఇది. వీళ్లు టైప్ 2 డయాబెటిస్ డ్రగ్‌ను టెస్ట్ చేసే త్రీడీ బయో ప్రింటెడ్ హ్యూమన్ లైక్ టైప్ 2 డయాబెటిస్ మోడల్‌ని డెవలప్ చేశారు. అలానే టైప్ 2 డయాబెటిస్ నివారణకు అవసరమైన సప్లిమెంట్‌ను కూడా రూపొందించారు. ఈ సందర్భంగా ఈ ముగ్గురు యువ శాస్త్రవేత్తలు సాక్షితో పంచుకున్న వివరాలివి.

దాదాపుగా ప్రతి సృష్టి

మానవ దేహభాగాలను పోలిన మోడల్స్‌ను సృష్టించి వాటి మీద ఔషధాల పని తీరును పరిశీలించడం ద్వారా సత్వర ఫలితాలను సాధించవచ్చని నిరూపించారు ఈ యంగ్ సైంటిస్ట్‌లు. కోవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో ఈ టెక్నాలజీ బాగా ఉపయోగపడింది. కోవిడ్‌ను నియంత్రించడానికి తయారు చేసిన మందులు ఎలా పని చేస్తున్నాయోనని నిర్ధారణ చేసుకోవడానికి జంతువుల మీద ప్రయోగించి తెలుసుకునే సమయం లేకపోయింది. ఒక ఔషధం ప్రయోగ దశలన్నీ పూర్తి చేసుకుని మార్కెట్‌లోకి రావడానికి సంవత్సరాలు పడుతుంది. కోవిడ్ సమయంలో అంత సమయం లేదు. అప్పుడు ఈ త్రీడీ బయోప్రింటెడ్ హ్యూమన్ లైక్ మోడల్ బాగా ఉపయోగపడింది. అలాగే ఇదే టెక్నాలజీ ఆధారంగా టైప్ 2 డయాబెటిస్ డ్రగ్ చూపిస్తున్న ప్రభావాన్ని యాక్యురేట్‌గా తెలుసుకునే విధంగా హ్యూమన్‌లైక్ టైప్ 2 డయాబెటిస్ మోడల్‌ని డెవలప్ చేశారు. ప్రస్తుతం ఈ యంగ్ సైంటిస్ట్‌లు ముగ్గురూ రీసెర్చ్ అసోసియేట్‌లుగా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లో ఇన్‌క్యుబేషన్ సెంటర్‌లోని రీజెన్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పరిశోధనలు చేస్తున్నారు.

– వాకా మంజులారెడ్డి



● సంజన

"హెల్త్ సైన్సెస్‌లో పరిశోధనల అవసరం చాలా ఉంది. కోవిడ్ పాండమిక్ సమయంలో హ్యూమన్ లైక్ మోడల్ ఆవశ్యకత తెలిసింది. మా పరిశోధనలో త్రీడీ బయో ప్రింటెడ్ హ్యూమన్ వాస్క్యులార్ లంగ్ మోడల్ తర్వాత టైప్ టూ డయాబెటిస్ మోడల్ మీద దృష్టి పెట్టాం. దాదాపుగా ఏడాది పాటు జరిగిన ప్రయోగం ఇది. ఒక వ్యక్తి డయాబెటిక్ దశకు చేరకుండా నార్మల్ లైఫ్ లీడ్ చేయగలిగిన విధంగా ఈ న్యూట్రాస్యూటికల్ సప్లిమెంట్‌ని రూపకల్పన చేయడంలో సక్సెస్ అయ్యాం. సమాజానికి అవసరమైన పని చేశామనే సంతృప్తి కలుగుతోంది'' అన్నారు సంజన. అమెరికాలో పుట్టిన తెలుగమ్మాయి సంజన. గ్రాడ్యుయేషన్ యూఎస్‌లోని యూసీ డేవిస్‌లో పూర్తి చేసి హైదరాబాద్‌లో పరిశోధనల్లో నిమగ్నమయ్యారు.



● అర్పిత

"సాధారణంగా జంతువుల మీద ప్రయోగం చేసి ఆ తర్వాత మనుషుల మీద క్లినికల్ ట్రయల్స్ చేస్తారు. ఒక ఔషధం ఇలా అన్ని దశలూ పూర్తి చేసుకోవడానికి దాదాపుగా పద్నాలుగు సంవత్సరాల సమయం పడుతుంది. అంతే కాదు, కొన్ని సందర్భాల్లో జంతువుల్లో మంచి ఫలితాలనిచ్చిన డ్రగ్ మనుషులలో అంత కచ్చితంగా పని చేయకపోవచ్చు కూడా. మేము రూపొందించిన ప్రయోగంలో హ్యూమన్ లైక్ డిసీజ్ మోడల్స్‌ని డెవలప్ చేసి వాటి మీద ఔషధాన్ని ప్రయోగించాం. దాంతో రిజల్ట్ త్వరగా తెలుసుకోగలిగాం. అలాగే టైప్ టూ డయాబెటిస్ మోడల్‌లో వివిధ రకాల యాంటీ డయాబెటిక్ డ్రగ్స్‌తోపాటు డివిటిజ్ అనే న్యూట్రాస్యూటికల్ సప్లిమెంట్‌ని కూడా ప్రయోగించి చూశాం. ఈ న్యూట్రాస్యూటికల్ సప్లిమెంట్ కండరాల్లో గ్లూకోజ్ స్వీకరణకు పనిచేస్తుంది. క్లినికల్ ట్రయల్స్ కూడా మంచి ఫలితాలనిచ్చాయి. ఈ సప్లిమెంట్ మార్కెట్‌లోకి వచ్చి ఐదు నెలలైంది'' అని చెప్పారు అర్పిత రెడ్డి. ఆమెది వ్యవసాయ కుటుంబం. కర్నాటకలోని కోలార్ జిల్లా, శ్రీనివాసపుర తాలూక, రాయల్పాడు గ్రామం. మైసూర్ యూనివర్సిటీ నుంచి ఎమ్మెస్సీ బయో కెమిస్ట్రీ, బెంగళూరులోని మౌంట్ కార్మెల్ కాలేజ్‌లో సెల్యులార్ అండ్ మాలిక్యులార్ డయాగ్నస్టిక్స్‌లో పీజీ డిప్లమో చేశారు.



● శరణ్య

టైప్ వన్ జన్యుకారణాలతో వస్తుంది. టైప్ టూ డయాబెటిస్ మన దగ్గర లైఫ్ స్టయిల్ డిసీజ్‌గా మారిపోయింది. డయాబెటిక్ కండిషన్‌లో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరుగుతాయి. ఒక వ్యక్తి డయాబెటిస్ కండిషన్‌కి రావడానికి ముందు కొంతకాలం ప్రీ డయాబెటిక్ కండిషన్‌లో ఉంటారు. ఆ దశలో తెలుసుకోగలిగితే దేహానికి జరిగే నష్టాన్ని నివారించవచ్చు. అందుకే మేము కండరాల కణజాలం మీద పని చేసే సప్లిమెంట్ మీద దృష్టిపెట్టాం'' అని చెప్పారు శరణ్య. ఆమెది కేరళ రాష్ట్రంలోని కన్నూరు. మంగుళూరు యూనివర్సిటీ నుంచి బయో కెమిస్ట్రీలో పీజీ, ప్రోటియోమిక్స్‌లో పీజీ డిప్లమో చేశారు.



పదేళ్ల నిర్భయ

● శిల్పి మర్వాహ

దేశం కదిలిపోయింది. దేశం కన్నీరయ్యింది.
దేశం ఆగ్రహంతో ఊగిపోయింది.
పదేళ్ల క్రితం డిసెంబర్ 16, 2012న
ఢిల్లీలో జరిగిన ఘటన లక్షలాది స్త్రీలను, యువతులను,
బాలికలను రోడ్డు మీదకు వచ్చి నిరసన చేసేలా చేసింది.
కొత్త చట్టం 'నిర్భయ' పేరున వచ్చింది. అయితే అది సరిపోదు.
ఆ హైన్యమైన ఘటన పునరావృత్తం కాకూడదని
ఆ మహా చైతన్యం సజీవంగా ఉండాలని
థియేటర్ నటి శిల్పి మర్వాహ
గత పదేళ్లుగా నిర్భయ నాటకాన్ని ప్రదర్శిస్తోంది.
ఆమె ఆ నాటకాన్ని కొనసాగిస్తున్న తీరు,
నిర్భయగా నటిస్తున్నప్పుడు ఆమె పడే వేదన
తెలుసుకోదగ్గది. ఆ నాటకం ప్రతి చోటా వేయదగ్గది.

దస్తక్

'దస్తక్' అంటే 'తలుపు తట్టడం' లేదా 'తట్టి లేపడం' లేదా 'పిలుపునివ్వడం'.

ఢిల్లీలో డిసెంబర్ 16, 2012 రాత్రి 9.30 నుంచి 11 గంటల మధ్య జరిగిన పాశవికమైన 'నిర్భయ ఘటన'– చుట్టూ ఏం జరిగితే మనకెందుకు అని తలుపు మూసుకుని ఉన్న ఈ సమాజాన్ని, నిద్ర నటిస్తున్న ఈ సంఘాన్ని, బధిరత్వం నటిస్తున్న బండబారిన ఈ సమూహాన్ని తట్టి లేపింది. జాగృతపరిచింది. ఇప్పుడైనా కదలండి అని పిలుపును ఇచ్చింది.

'నిర్భయ ఘటన ఈ దేశం నుంచి ఒక్కటే కోరింది–మారండి అని' అని అంటుంది శిల్పి మార్వాహ.

ఢిల్లీ నాటకరంగంలో చిరపరిచితమైన శిల్పి గత పదేళ్లుగా నిర్భయ ఘటన మీద ప్రదర్శిస్తున్న వీధి నాటకం పేరు– దస్తక్. ఢిల్లీ కమలా నెహ్రూ కాలేజ్‌లో చదువుకున్న శిల్పి 'క్యాంపస్ థియేటర్', 'స్ట్రీట్ థియేటర్'లో అనేక ప్రయోగాలు చేసింది. 2011 ఢిల్లీ 'యాంటి కరప్షన్ మూవ్‌మెంట్'లో చురుగ్గా పాల్గొని నాటకాలు వేసిన శిల్పి గుర్తింపు పొందింది. 2013 నుంచి 'దస్తక్' నాటకం ద్వారా తన సామాజిక బాధ్యతను గట్టిగా చాటుకుంటోంది.

ఘటనకు మూల కారణం... 'నిర్భయ ఘటనకు మూల కారణం పితృస్వామ్యం. ఇంటి వాతావరణంలో మగవాడికి పెత్తనం ఇవ్వడం నుంచి ఇది మొదలవుతుంది. తాను అణగదొక్కగలిగేవాడిగా స్త్రీ అణగదొక్కబడేదిగా మగవాడు ఎప్పుడైతే తర్ఫీదు ఇవ్వబడతాడో అప్పుడు స్త్రీ మీద హింస చేయడానికి వెనుకాడడు' అంటుంది శిల్పి. 'నిర్భయ ఘటన జరిగిన రోజు బస్సులో డ్రైవర్‌తో సహా 6 మంది ఉన్నారు. వారు మొదట నిర్భయతో గొడవ మొదలెట్టింది– ఇంత రాత్రి నువ్వు ఎందుకు రోడ్ల మీద తిరుగుతున్నావ్ అని. అప్పుడు టైమ్ తొమ్మిదిన్నరే. ఏ ఒంటిగంటో కాదు. అయినా సరే స్త్రీని కంట్రోల్ చేసే స్వభావంతో ఆ ప్రశ్న వేశారు. అలా కంట్రోల్‌లో లేని స్త్రీని ఏమైనా చేయవచ్చని బరితెగించారు' అంటుందామె.

ఇండియా గేట్‌లో మొదటి ప్రదర్శన... 'నిర్భయ ఘటన తర్వాత ఊరికే ఉండలేకపోయాను. ఆ ముందు సంవత్సరమే 'దస్తక్' అనే నాటకాన్ని స్త్రీపై సాగే హింసకు వ్యతిరేకంగా ప్రదర్శించేదాన్ని. అందులో రేప్ సన్నివేశం దుర్మార్గంగా చూపేదాన్ని. ఆడవాళ్లు నా దగ్గరకు వచ్చి 'మరీ అంత దుర్మార్గం ఉండదు. నువ్వు ఎక్కువ చేస్తున్నావ్' అని అనేవారు. నిర్భయ ఘటన తర్వాత నేను మొత్తం నాటకాన్ని తిరగరాసి నిర్భయ మీద జరిగిన పాశవిక దాడిని నాటకంలో యథాతథంగా పెట్టాను. నిర్భయగా నేనే నటించాను. ఇండియా గేట్‌లో మొదటిసారి ప్రదర్శిస్తున్నప్పుడు నా మెదడు మొద్దుబారింది. ఆ నాటకంలో నేను కోపంతో అరుస్తున్నప్పుడు అది నటనగా కాక జరిగిన దారుణానికి నిరసనగా సగటు మహిళలో పెల్లుబికే కోపంగా వ్యక్తమైంది. చుట్టూ ఉన్న జనం చాలా మౌనంగా నాటకం చూశారు. సాధారణంగా వీధి నాటకాలు గోలగా చూస్తారు ప్రేక్షకులు. ఈ నాటకం సమయంలో మాత్రం దారుణమైన నిశ్శబ్దం పాటించారు. వారిలో వచ్చిన గాంభీర్యానికి గుర్తు అది. ఆ ప్రదర్శన తర్వాత అత్యాచారాన్ని అంత పాశవికంగా చూపడం ఎందుకో స్త్రీలు అర్థం చేసుకున్నారు. ఆ తీవ్రతను చూపితే తప్ప మార్పు రాదని తెలుసుకున్నారు' అంటుంది శిల్పి.



● 'దస్తక్' నాటకాన్ని ప్రదర్శిస్తున్న శిల్పి మార్వాహ

కొద్దిగానే మార్పు... 'పదేళ్లుగా నిర్భయ నాటకాన్ని ప్రదర్శిస్తున్నాను. పదేళ్లుగా నిర్భయ వంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. నేటికీ పెద్ద మార్పు లేదు. నిర్భయ నిందితుల్లో నలుగురికి ఉరిశిక్ష పడింది (ఒకరు విచారణ సమయంలో మరణించారు). జువెనైల్ చట్టంలో మార్పు వచ్చింది (ఒక నిందితుడు జువెనైల్ చట్టం నిర్ధారించిన వయసు వల్ల విడుదల అయ్యాడు). కాని ఇంకా దారుణాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజా నాటకం నిర్భయ ఘటనను మాత్రం వదల్లేదు. అనేక గ్రూప్‌లు ఈ నాటకాన్ని ఆడుతూనే ఉన్నాయి. రంగస్థలం మీదకు నిర్భయ శవాన్ని తీసుకొచ్చినప్పుడల్లా జనం ఏడుస్తారు. కాని ఏడుపు మాత్రమే చాలదు. మార్పు రావాలి. ఇన్ని సంవత్సరాలుగా ఈ నాటకాన్ని వేయాలా అని అప్పుడప్పుడు అనిపిస్తుంది. కాని మనం చేయకపోతే ఇంకెవరు చేస్తారు అని కూడా అనిపిస్తుంది. అందుకే నాటకం కొనసాగిస్తున్నాను. నిర్భయను మరువనివ్వను. నిర్భయ వల్ల వచ్చిన చైతన్యం కొనసాగాలి' అంటుంది శిల్పి.

రంగస్థలం

నాటకం చప్పట్లు కోరుతుంది.
సామాజిక నాటకం చప్పట్లతో పాటు 'చేయూత'ను కోరుకుంటుంది.
'విత్ లవ్–ఆప్ కీ సైయారా' నాటకం అలాంటిదే. జూహీ బబ్బర్ సోనీ రాసి, డైరెక్ట్ చేసిన ఈ నాటకం దేశంలోని ప్రధాన నగరాల్లో ప్రదర్శించబడుతోంది. నిధుల సమీకరణలో స్వచ్ఛంద సంస్థలకు తన వంతు సహాయం అందిస్తోంది...



● 'విత్ లవ్' నాటకంలో జూహీ బబ్బర్

విత్ లవ్

సమాజానికి ప్రేమతో...

సైయారా గురించి రెండు ముక్కల్లో చెప్పుకోవాలంటే...భయమంటే తెలియని బలమైన వ్యక్తిత్వం ఉన్న మహిళ. మెట్రోపాలిటన్. ట్రెండీ ఇండియన్ లేడీ. ఆధునిక మహిళకు నిలువెత్తు దర్పణం. 'ఆడవాళ్లు ఇలా ఉండాలి. ఇలా మాత్రమే ఉండాలి' అనే చాదస్తాలను పక్కకు నెట్టి, పాతర పెట్టి తన కలలు నెరవేర్చుకోవడానికి ముందడుగు వేసే మహిళ. సైయారా ప్రధాన పాత్రగా సాగే 'విత్ లవ్–ఆప్ కీ సైయారా' నాటకాన్ని జూహీ బబ్బర్ సోనీ రాసి డైరెక్ట్ చేసింది.

గత, వర్తమాన మహిళలకు సంబంధించిన ఆలోచనలు, భావోద్వేగాలను, తమ లక్ష్యసాధనలో ఆధునిక మహిళ ప్రదర్శించే చొరవ, ధైర్యసాహసాలను పట్టించే ఈ నాటకాన్ని దేశ వ్యాప్తంగా ప్రధాన నగరాల్లో ప్రదర్శించారు.

'సమాజ సేవకు నేను సైతం' అంటున్న ఈ నాటకాన్ని ఎన్నో స్వచ్ఛందసంస్థల తరఫున ప్రదర్శించారు. తాజాగా 'రాణి బ్రెస్ట్ క్యాన్సర్ ట్రస్ట్' తరఫున పంజాబ్‌లోని వివిధ నగరాల్లో ప్రదర్శిస్తున్నారు. ఈ ట్రస్ట్‌ను బిట్టు సంధు 2007లో ప్రారంభించారు. తన సోదరి రాణి బ్రెస్ట్ క్యాన్సర్‌తో చనిపోయింది. ట్రస్ట్ తరఫున పట్టణ,గ్రామీణ ప్రాంత మహిళలకు క్యాన్సర్ గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేద రోగుల చికిత్సలో సహాయం అందిస్తున్నారు. ట్రస్ట్‌కు అవసరమైన నిధుల సమీకరణలో భాగంగా 'విత్ లవ్' నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు.

'జూహీలాంటి మనసున్న కళాకారులు అండగా ఉంటే పేదలకు ఉపయోగపడే ఎన్నో మంచి కార్యక్రమాలు చేయవచ్చు. కళను సమాజం కోసం ఉపయోగించే అరుదైన కళాకారులలో జూహీ ఒకరు' అంటున్నారు బిట్టు సంధు.

'ఒక మంచి కార్యక్రమానికి నా నాటకం ఉపయోగపడుతుంది అనే భావన ఎంతో శక్తిని ఇస్తుంది. అది నటన రూపంలో రంగస్థలంపై కనిపిస్తుంది' అంటోంది జూహీ బబ్బర్.

సామాజిక నాటకాల్లో నటించడం అంటే ఎంత ఇష్టమో సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొనడం అంటే కూడా జూహీకి అంతే ఇష్టం.

బాలీవుడ్ ప్రఖ్యాత నటుడు రాజ్‌బబ్బర్ కుమార్తె అయిన జూహీ సినిమాలు, టీవీలలో నటించినప్పటికీ ఆమెకు రంగస్థలం అంటే ప్రత్యేకమైన ప్రేమ. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) గ్రాడ్యుయెట్ అయిన జూహీ 'యహూదీ కీ లడ్కీ' నాటకంతో నాటకరంగంలో అరంగేట్రం చేసింది.

బేగం జాన్, జీ జైసీ ఆప్కీ మర్జీ...మొదలైన నాటకాలు జూహీకి మంచి పేరు తీసుకువచ్చాయి.

కళా ఘోడ ఆర్ట్ ఫెస్టివల్(కెజీఎఫ్) నిర్వాహకుల్లో జూహీ ఒకరు. ఈ ఫ్రీ థియేటర్ ఫెస్టివల్ ద్వారా మట్టిలో మాణిక్యాలలాంటి ఎంతో మంది నటులు, రచయితలను పరిచయం చేసుకునే భాగ్యం కలిగింది. ఎన్నో ప్రాంతీయ నాటకాలకు 'కెజీఎఫ్' వేదికగా నిలిచింది.

'మీకు రంగస్థలం అంటే ప్రత్యేకమైన ప్రేమ ఎందుకు?' అని అడిగితే–

'కాలేజీ విద్యార్థి, ఏమీ తెలియని వ్యక్తి, అన్నీ తెలిసిన వ్యక్తి, ప్రఖ్యాత దర్శకుడు, ఫ్లాప్ దర్శకుడు, పట్టణవాసీ, గ్రామీణుడు...ఇలా అన్ని వర్గాల వారిని ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చే శక్తి నాటకానికి ఉంది. ప్రేక్షకుల తక్షణస్పందన అప్పటికప్పుడు ఎన్నో విషయాలు నేర్చుకోవడానికి ఉపయోగపడుతుంది' అంటోంది జూహీ బబ్బర్ సోనీ.

బ్యూటిప్స్

మృదువైన మేనికి..



చలికాలం ప్రధానంగా ఎదుర్కొనే సమస్య చర్మం పొడిబారడం. మృత కణాలు పెరిగి చర్మం జీవకళ కోల్పోయినట్టు తయారవుతుంది. ఈ సమస్య దరిచేరకుండా, చర్మం మృదువుగా మారాలంటే..

- స్నానం చేయడానికి అరగంట ముందు కొబ్బరి నూనె లేదా నువ్వుల నూనె మేనికి రాసుకోవాలి. మృదువుగా మర్దనా చేసి, గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయాలి.
- టీ స్పూన్ బాదం నూనె, అర టీ స్పూన్ తేనె కలిపి ముఖానికి, చేతులకు రాసి, పాదాలకు మసాజ్ చేయాలి. స్నానం చేసేముందు నాలుగు చుక్కల బాదం నూనె బకెట్ నీటిలో కలిపాలి. రోజూ ఇలా చేస్తూ ఉంటే చర్మం మృదుత్వాన్ని కోల్పోదు.
- అరటిపండు గుజ్జు, కప్పు పెరుగు, టేబుల్ స్పూన్ తేనె, టేబుల్ స్పూన్ ఓట్స్ కలపాలి. ఈ మిశ్రమాన్ని పొడి చర్మానికి మంచి ప్యాక్ అవుతుంది. ముఖానికి, మేనికి పట్టించి పదిహేను నిమిషాల తర్వాత వెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. దీంతో చర్మానికి జీవకళ వస్తుంది.

అవును... మిద్దెలపై డబ్బులు కాస్తాయి!



గ్రీన్ లైఫ్

● రెమాదేవి


ఆరోజు మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొని ఇంటికి తీసుకువచ్చింది కేరళలోని కొట్టాయంకు చెందిన రెమాదేవి. కూరగాయలను కడుగుతున్నప్పుడు ఒకరకమైన రసాయనాల వాసన వచ్చింది. ఆ సమయంలో పిల్లలు, వారి భవిష్యత్ గుర్తుకు వచ్చింది. అదే సమయంలో తాను ఒక నిర్ణయం తీసుకుంది...

'ఇంటికి అవసరమైన కూరగాయలు ఇంటిదగ్గరే పండించుకుంటాను'

అలా మిద్దెతోటకు శ్రీకారం చుట్టింది రెమాదేవి. అమ్మమ్మ రంగంలోకి దిగింది. సేంద్రియ వ్యవసాయంలో అమ్మమ్మది అందెవేసిన చేయి. ఆమె సలహాలు, సూచనలతో మిద్దెతోట పచ్చగా ఊపిరిపోసుకుంది. కొంత కాలానికి...ఇంటి అవసరాలకు పోగా మిగిలిన కూరగాయలను అమ్మడం మొదలుపెట్టారు. తమకు ఉన్న మరో రెండు ఇండ్లలోనూ మిద్దెతోట మొదలుపెట్టింది రెమాదేవి. అలా ఆదాయం పెరుగుతూ పోయింది.

మిద్దెతోటపై ఆసక్తి ఉన్న వాళ్లు రెమాను రకరకాల సలహాలు అడిగేవారు. ఇలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని 'రెమాస్ టెర్రస్ గార్డెన్' పేరుతో యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది. 'మిద్దెతోటకు పెద్దగా ఖర్చు అక్కర్లేదు' అని చెబుతూ ఆ తోటపెంపకానికి సంబంధించిన ఎన్నో విషయాలను అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు చెబుతుంది. వంటగది వ్యర్థాలతో మనకు కావల్సిన ఎరువులు ఎలా తయారు చేసుకోవచ్చో వీడియోల ద్వారా చూపుతుంది. దీంతో పాటు సోషల్ మీడియా ఫార్మింగ్ గ్రూప్స్ ద్వారా విత్తనాలు అమ్ముతుంది రెమాదేవి. కేవలం విత్తనాల అమ్మకం ద్వారానే నెలకు 60,000 రూపాయల ఆదాయం ఆర్జిస్తుంది. రెమాదేవిని అనుసరించి ఎంతోమంది మిద్దెతోటలను మొదలుపెట్టి రసాయన–రహిత కూరగాయలను పండించడమే కాదు, తగిన ఆదాయాన్ని కూడా గడిస్తున్నారు. మంచి విషయమే కదా!

15 చుక్కలు, 8 వచ్చే వరకు మధ్య చుక్క





కాసర సింధు
జంగారెడ్డి గూడెం
ప.గో.జిల్లా

కె.ఆర్. సీత
హైదరాబాద్

21 చుక్కలు 1 వచ్చే వరకు



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

మధుమేహులు ఇవి తిన్నా ముప్పే!

రక్తంలో షుగర్ లెవెల్స్ పెరగడానికి దారితీసే ప్రధాన కారకాల్లో చక్కెర ఒకటి. అందుకే మధుమేహులు తాము తినే ఆహారాల్లో ఎంత చక్కెర ఉందని చెక్ చేస్తుంటారు. అయితే ఒక్క చక్కెర మాత్రమే కాదు.. శరీరంలో రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగేందుకు దారి తీసే పదార్థాలు చాలానే ఉన్నాయి. ఒకవేళ మీకు మధుమేహం ఉన్నట్లైతే ఈ ఆహారాలను తీసుకోకపోవడమే మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం...



ప్యాక్ చేసిన స్నాక్స్: ప్యాకేజ్డ్ స్నాక్స్ కూడా డయాబెటీస్‌కు దారితీస్తాయి. ఎందుకంటే వీటిని శుద్ధి చేసిన పిండితో తయారు చేయడం వల్ల ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతాయి. అందువల్ల వీటి జోలికి వెళ్లకుండా ఉండటం మేలు. అంతగా తినాలనిపిస్తే.. వీటికి బదులుగా గింజలు లేదా మొలకలు తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉంటాయి.

పుష్కలంగా ఉన్నప్పటికీ..వీటిని తగిన మోతాదులోనే తీసుకోవడం మంచిది.

వేపుళ్లు: వేయించిన ఆహారాల్లో కేలరీలు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. అందువల్ల ఈ ఆహారాలను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. అలాగే కొవ్వులు జీర్ణం అయ్యేందుకు ఎక్కువ టైంపడుతుంది. దీంతో బ్లడ్ షుగర్ లెవెల్స్ అమాంతం పెరిగిపోతాయి.



డ్రై ఫ్రూట్స్: పండ్లలో ఎక్కువ మొత్తంలో తీపి ఉంటుంది. ఎండిన పండ్లలో పిండిపదార్థాలు ఎక్కువగా ఉంటాయి. ఎండు ద్రాక్షల్లో 115 గ్రాముల పిండి పదార్థాలు ఉంటాయి. ఇది మామూలు ద్రాక్షలో కంటే చాలా ఎక్కువ. ఒకవేళ ఎండు పండ్లను తినాలనుకుంటే చక్కెర తక్కువగా ఉండే పండ్లను తినడం మంచిది.



ఆల్కహాల్ పానీయాలు: ఆల్కహాలిక్ పానీయాల్లో చక్కెరతో పాటు పిండిపదార్థాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. అందుకే డయాబెటీస్ ఉన్నవాళ్లు బీర్, వైన్ వినియోగాన్ని చాలా వరకు తగ్గించాలని నిపుణుల సలహా. మధుమేహులు ఆల్కహాలిక్ పానీయాలు తీసుకోవడం వల్ల చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి.

ప్రాసెస్ చేసిన పిండిపదార్థాలు: వైట్‌బ్రెడ్, పాస్తా, మైదాతో చేసిన ఆహారాలన్నీ శుద్ధి చేసిన పిండితో తయారు చేసినవే. కానీ ఇవి ఆరోగ్యానికి అంత మంచివి కావు. ఎందుకంటే వీటిలో పీచుపదార్థం తక్కువగా ఉంటుంది. పోషకాలు అసలే ఉండవు. మధుమేహులు వీటిని తింటే వారి రక్తంలో చక్కెర స్థాయిలు బాగా పెరుగుతాయి. అందుకే వీటికి బదులుగా ఆరోగ్యకరమైన పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలను తినడం చాలా మంచిది.



పండ్ల రసం: పండ్లు ఆరోగ్యానికి మంచివే అయినా. పండ్ల రసాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.పండ్ల రసాలలో బయటినుంచి కలిపే చక్కెర వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అమాంతం పెరుగుతాయి. అందువల్ల పండ్లరసాలలో విటమిన్లు, ఖనిజాలు

తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నప్పుడు ఆహ్లాదకరమైన సంగీతం విని, దాన్ని తగ్గించుకోవడం చాలామందికి అలవాటే. ఇందుకోసం కొందరు లలితమైన సంగీతం ఆలకిస్తుంటారు. మరికొందరు బీట్ బాగా ఉండే హుషారు, ఊపు పాటలను వింటారు. ఈ భిన్న ఆసక్తులు ఉన్నవారికి ఒకరి సంగీతం మరొకరికి అంత ఇంపుగా అనిపించదు. కేవలం ఇలా సంగీత మాధ్యమంలోనే కాకుండా... కొన్ని నిర్దిష్టమైన ఫ్రీక్వెన్సీలలో వెలువడే శబ్దాలతో ఒత్తిడి తగ్గించే ప్రక్రియే సౌండ్‌బాత్. ఇది కూడా ఒక ధ్యానం (మెడిటేషన్) లాంటి లేదా యోగాలాంటి ఫలితాలనిచ్చే ప్రక్రియ.



ఒత్తిడిని తొలగించే సౌండ్ బాత్

కొన్ని రకాల శబ్దాలు ఓ క్రమపద్ధతిలో ఒకేలాంటి ఫ్రీక్వెన్సీ స్థాయుల్లో మంద్రంగా వెలువడుతూ... మన దేహాన్ని కండరాల ఒత్తిడి ఉన్నప్పుడు వాటిని రిలాక్స్ చేసేలా, మానసిక ఒత్తిడి నుంచి విముక్తం చేసేందుకు ఉపకరించే ఈ ప్రక్రియ ఒక యోగాలాంటిదని క్లీవ్‌లాండ్ క్లినిక్‌లోని మేరిమైంట్ మెడికల్ సెంటర్, బ్రాడ్‌వ్యూ హైట్‌కు చెందిన ఇంటర్నల్ మెడిసిన్ వైద్య సహాయకురాలు కరేన్‌బాండ్ చెప్పారు. దీనికి ఆమె భారతీయ యోగా ప్రక్రియలో ఉచ్చరించే 'ఓమ్' శబ్దాలు, చైనా సంప్రదాయ వైద్యం (ట్రెడిషనల్ చైనీస్ మెడిసిన్–టీఎమ్‌సీ)లో ఉచ్చరించే 'చి' లాంటి శబ్దాలను (చైనీస్ అక్షరమైన దీని స్పెల్లింగ్ ఇంగ్లిష్‌లో 'క్యూఐ' కాగా దీన్ని (సీహెచ్‌ఐ గా ఉచ్చరిస్తారు) ఉదాహరణలుగా చూపుతున్నారు. అవి శరీరంలోని శక్తిప్రవాహాన్ని ఏర్పరచడం, క్రమబద్ధ పద్ధతిలో ప్రవహింపజేయడం ద్వారా ఒత్తిడిని తొలగించేందుకు సహాయపడతాయని పేర్కొంటున్నారు. ఇదెలా జరుగుతుందనేది చెబుతూ ''ఉదాహరణకు ఎవరైనా వ్యక్తి తన జీర్ణవ్యవస్థ క్రమబద్ధంగా లేకపోవడాన్ని కంప్లెయింట్‌గా చెబితే... వారిలో ఆ ప్రాంతాన్ని నయం చేసేలా ఒక నిర్దిష్టమైన ఫ్రీక్వెన్సీలో శబ్దాలు వినిపించడం జరుగుతుంది'' అని తెలిపారు. శబ్దాలతో కలిగే వైద్య ప్రయోజనాలపై 2014 నుంచి అనేక అధ్యయనాలు జరుగుతున్నాయనీ, ఈ తరహా శబ్దచికిత్సలు చవకైనవి మాత్రమే గాక... సురక్షితమైనవని ఆమె తెలిపారు. చిన్న చిన్న సమస్యల్లోనే కాకుండా దీర్ఘకాలిక వెన్నునొప్పులు, క్యాన్సర్‌తో బాధపడేవారిలో కలిగే నొప్పుల ఉపశమనానికి కూడా ఈ శబ్ద చికిత్సలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఇవే కాకుండా ఈ తరహా పరిశీలనలు జరుగుతున్నప్పుడు నిదర్శనాలు, ఫలితాల ఆధారంగా వాస్తవాలు తెలుసుకునే పరిశోధన జరుగుతోందని వెల్లడించారు. అనేక నిదర్శనాలు, ఫలితాలను పరిశీలించినప్పుడు సౌండ్ బాత్ తర్వాత తమ క్లయింట్లను ప్రశ్నించినప్పుడు... కొందరు ఒత్తిడి తగ్గిందనీ, మరికొందరు తమ కండరాలు వదులుగా, రిలాక్స్‌డ్‌గా మారాయనీ, నొప్పి తగ్గిందనీ, నిద్ర బాగా పట్టిందని, మూడ్స్ మెరుగుపడ్డాయని, తమ శరీరంలో చోటు చేసుకుంటున్న మార్పులు తమకు బాగా తెలిసినట్లుగా అనుభూతి కలిగిందనీ వివరించినట్లు కరేన్ బాండ్ తెలిపారు.

సౌండ్ బాత్ కోసం ఏయే పరికరాలు ఉపయోగిస్తారంటే...?

ఈ ప్రక్రియ కోసం ● జేగంటలు (గాంగ్) ● జలతరంగిణిలో ఉపయోగించేలాంటి గిన్నెలు ● టిబెటన్ పాటల్లో ఉపయోగించేలాంటి గిన్నెలు ● ట్యూనింగ్ ఫోర్క్‌లు ● ఫెంగ్ షుయీ పద్ధతుల్లో ఇంట్లో వేలాడదీసినప్పుడు ఆహ్లాదకరంగా మోగుతుండే స్తూపాకారపు అలంకరణ వస్తువులు (చిమ్స్) ● కొన్ని చిరుమువ్వలు ● ఆహ్లాదకరమైన శబ్దాలను వెలువరించే చిరు గంటలను సౌండ్ బాతింగ్ కోసం ఉపయోగిస్తారు.

సైడ్ ఎఫెక్ట్స్ కూడా..

దీని ఫలితాలు అందరిలోనూ ఒకేలా ఉండవు. చాలా తక్కువమందిలోనే అయినా కొందరిలో సౌండ్‌బాత్ తర్వాత కొందరు కాస్త అలసట ఫీలవుతారు. దీనికి భిన్నంగా మరికొందరు బాగా శక్తి పుంజుకున్నట్లు అనుభూతి చెందుతారు. అందుకే సౌండ్ బాతింగ్ ప్రక్రియకు ముందు మంచి ఆహారం, తగినన్ని నీళ్లతో పాటు కంటినిండా నిద్ర అవసరమని సూచించారు. మానసిక (సైకియాట్రిక్) సమస్యలతో బాధపడేవారు సౌండ్ బాత్‌కు ముందు తమ డాక్టర్‌ను సంప్రదించాలని చెబుతున్నారు.

● మీకు తెలుసా



ఉంగరాల జుట్టు ఉండటం అందానికి చిహ్నంగా చెప్తారు. కొంతమంది స్టైల్ కోసం కూడా జుట్టును ఉంగరాలుగా మలుచుకుంటారు. అయితే ఉంగరాల జుట్టు వారు ఎదుర్కొనే అతిపెద్ద సమస్య జుట్టు చిక్కులు పడటం. ఈ జుట్టు కుదుళ్ల దగ్గర జిడ్డుగా ఉండి చివర్లు పొడిబారినట్లుగా ఉంటాయి. ఉంగరాల జుట్టు కలవారు వారానికి మూడు సార్లు తలస్నానం చేస్తే సరిపోతుంది. అలాగే జుట్టుకి పోషణను అందించే షాంపూలు, బాదం, అవకాడో గుణాలు కలిగిన షాంపూలు, సల్ఫేట్ రహిత షాంపూలు వాడటం ఉత్తమం. కొంచెం రింగులు తక్కువ ఉండి, అలలలాగా జుట్టు ఉండేవారికి కూడా ఇదే వర్తిస్తుంది. అయితే వీరు సల్ఫేట్ రహిత షాంపూ లేదా నురగతో శుభ్రపరుచుకోవడం చేసుకుంటే ప్రయోజనాలుంటాయి.

● హెల్త్ టిప్స్

వైరస్, బాక్టీరియా, ఫంగస్ కారణంగా వచ్చే సైనస్ వ్యాధి వల్ల ముక్కుతోపాటు గొంతు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి కూడా వస్తుంది. కొన్ని రోజులపాటు పట్టి పీడించే ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి.

సైనస్ నివారణకు...

ఉల్లి, వెల్లుల్లి రేకులను తింటే సైనసైటిస్ బాధ తగ్గుతుంది. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి పాయలను విరివిగా వాడితే మంచిది. టీ స్పూన్ జీలకర్రను వేయించి పొడిచేసి, అందులో రెండు స్పూన్ల తేనె కలిపి రోజుకు రెండు సార్లు తీసుకుంటే సమస్య పరిష్కారమవుతుంది. జీలకర్రను పల్చని కాటన్ వస్త్రంలో కట్టి వాసన పీల్చాలి.



డస్ట్ అలర్జీ నివారణకు

కొంతమందికి ఉదయం నిద్రలేవడంతోనే తుమ్ములతోనే దినచర్య ప్రారంభం అవుతుంది. విపరీతంగా తుమ్ములు వస్తుంటాయి. అలాంటి వారు తులసి, పుదీనా, రెండు మిరియపు గింజలు, నిమ్మరసం కలిపి కషాయం లాగా చేసుకొని ఒక కప్పు కషాయం తీసుకోవాలి. ఇలా కనీసం ఒక వారం లేదా పదిరోజుల పాటు క్రమం తప్పకుండా చేస్తుంటే సమస్య తీరిపోతుంది. ఇవి అందుబాటులో లేనపుడు తుమ్ములు వస్తుంటే కొత్తిమీర వాసన చూసినా. తుమ్ములు ఆగుతాయి. ఇది తాత్కాలికంగా పనిచేస్తుంది. పైన చెప్పిన కషాయం పూర్తి ఉపశమనం ఇస్తుంది.

సినిమా

● ఇయర్ రౌండప్


హీరోయినే హీరో

సినిమాలో గ్లామర్ కావాలి.. అందుకేగా హీరోయిన్... స్పెషల్ సాంగ్ అదిరిపోవాలి... ఉన్నారుగా హీరోయిన్లు.. స్పెషల్ సాంగ్ చేసే తారలు.. 'ఫీమేల్ స్టార్స్' అంటే.. ఇంతకు మించి పెద్దగా ఆలోచించరు. హీరోయిన్లు కూడా గ్లామరస్ క్యారెక్టర్స్‌కి సై అంటారు. అయితే గ్లామర్‌కి అతీతంగా పర్ఫార్మెన్స్‌కి స్కోప్ ఉన్న క్యారెక్టర్ వస్తే వెంటనే ఒప్పేసుకుంటారు. సవాల్‌గా తీసుకుని ఆ పాత్రలను చేస్తారు. రిస్కీ ఫైట్స్ చేయదానికి కూడా వెనకాదరు. 2022 ఇలాంటి పాత్రలను చాలానే చూపించింది. హీరోయినే హీరోగా వచ్చిన లేడీ ఓరియంటెడ్ చిత్రాల గురించి తెలుసుకుందాం.



















'మహానటి' (2018) చిత్రంలో సావిత్రి పాత్రలో అద్భుతంగా అభినయించి, లేడీ ఓరియంటెడ్ ఫిలింస్‌కి ఓ మంచి చాయిస్ అయ్యారు కీర్తి సురేశ్. ఆ తర్వాత ఆమె 'పెంగ్విన్, మిస్ ఇండియా' వంటి లేడీ ఓరియంటెడ్ చిత్రాలు చేశారు. ఇక ఈ ఏడాది 'గుడ్‌లక్ సఖి', 'సాని కాయిదమ్' (తెలుగులో 'చిన్ని') వంటి కథానాయిక ప్రాధాన్యం ఉన్న చిత్రాలతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. నగేశ్ కుకునూరు దర్శకత్వంలో వచ్చిన 'గుడ్‌లక్ సఖి' జనవరి 28న థియేటర్స్‌లో విడుదల కాగా, దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ తెరకెక్కించిన 'సాని కాయిదమ్' మే 6 నుంచి డైరెక్ట్‌గా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఓ గ్రామీణ యువతి జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ఎలా బంగారు పతకం సాధించింది? అన్నది 'గుడ్‌లక్ సఖి' కథ. తన కుటుంబానికి జరిగిన అన్యాయానికి పగ తీర్చుకునే ఓ కానిస్టేబుల్ ఆవేదన నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'చిన్ని'. ఇక ఇప్పటికే పలు లేడీ ఓరియంటెడ్ చిత్రాలు చేసిన ప్రియమణి ఈ ఏడాది 'భామాకలాపం' చేశారు. అభిమన్యు దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఫిబ్రవరి 11 నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమాలో పక్కింటి విషయాలపై ఆసక్తి చూపిస్తూ, ఓ కుకింగ్ యూట్యూబ్ చానెల్‌ను రన్ చేసే అనుపమ ఇరుకుల్లో పడుతుంది. ఓ వ్యక్తి తాలూకు హత్యకి సంబంధించిన మిస్టరీ నుంచి తనను కాపాడుకునే అనుపమ పాత్రను ప్రియమణి చేశారు. మరోవైపు ఐదారేళ్లుగా బాలీవుడ్‌లో లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తున్న తాప్సీ 2019లో వచ్చిన 'గేమ్ ఓవర్' తర్వాత తెలుగులో ఈ ఏడాది 'మిషన్ ఇంపాజిబుల్'లో నటించారు. చైల్డ్ ట్రాఫికింగ్ (చిన్నారుల అక్రమ రవాణా) నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రానికి ఆర్‌ఎస్ స్వరూప్ దర్శకుడు. చిన్నారులను చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా బారి నుంచి రక్షించే శైలజ పాత్రను తనదైన శైలిలో చేసి, మెప్పించారు తాప్సీ. ఏప్రిల్ 1న ఈ చిత్రం విడుదలైంది. ఇంకోవైపు నివేదా పేతురాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'బ్లడీ మేరీ' చిత్రం ఏప్రిల్ 15 నుంచి ఆహా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. హ్యూమన్ ట్రాఫికింగ్ ముఠా నేరాలకు మర్డర్, రివెంజ్ అంశాల టచ్ ఇచ్చి ఈ సినిమాను తెరకెక్కించారు చందు మొండేటి. అనాథ నర్సు మేరీ పాత్రలో నటించారు నివేదా పేతురాజ్. ఇక 'కళ్యాణ ప్రాప్తిరస్తు' (1996) తర్వాత ప్రముఖ యాంకర్ సుమ కనకాల ఓ లీడ్ రోల్ చేసిన చిత్రం 'జయమ్మ పంచాయితీ'. విజయ్‌కుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో టైటిల్ రోల్ చేశారు సుమ. అడిగినవారికి సాయం చేస్తూ, శుభ కార్యాలప్పుడు గ్రామస్తులకు ఈడ్లు (చదివింపులు) ఇచ్చే మంచి మనసు ఉన్న మనిషి జయమ్మ. హఠాత్తుగా జయమ్మ భర్తకు గుండెపోటు వస్తుంది. కానీ ఆ సమయంలో గ్రామస్తులు జయమ్మకు సహాయం చేయకపోగా, కొందరు విమర్శిస్తారు. ఆ తర్వాత జయమ్మ ఏం చేసింది? కుటుంబాన్ని ఎలా చక్కదిద్దుకుంది? అన్నదే కథాంశం. మే 6న ఈ సినిమా రిలీజైంది. ఇంకోవైపు పదేళ్ల తర్వాత అంటే 2012లో వచ్చిన 'అందాల రాక్షసి' చిత్రం తర్వాత హీరోయిన్ లావణ్యా త్రిపాఠి చేసిన మరో ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్‌గా 'హ్యాపీ బర్త్‌డే'ని చెప్పుకోవచ్చు. రితేష్ రానా తెరకెక్కించిన ఈ చిత్రం జూలై 8న రిలీజైంది. దేశంలో గన్ కల్చర్‌ను ప్రోత్సహించే విధంగా ఓ కేంద్రమంత్రి గన్ బిల్లు ప్రతిపాదనను పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. ఫ్యాంటసీ జానర్‌లో సాగే ఈ చిత్రంలో గన్ కల్చర్‌కు, హ్యాపీ అనే అమ్మాయి బర్త్‌డేకి ఉన్న సంబంధం ఏంటి? అనేది ప్రధానాంశం. ఇక ఈ ఏడాది వచ్చిన చిత్రాల్లో సౌత్ కొరియన్ ఫిల్మ్ 'మిడ్‌నైట్ రన్నర్స్' ఆధారంగా రీమేక్ అయిన చిత్రం 'శాకినీ డాకినీ'. రెజీనా, నివేదా థామస్ టైటిల్ రోల్స్‌లో ఈ చిత్రాన్ని దర్శకుడు సుధీర్ వర్మ తెరకెక్కించారు. అమ్మాయిలను కిడ్నాప్ చేసి, అక్రమాలకు పాల్పడే ఓ ముఠా ఆట కట్టించే ఇద్దరు ఉమెన్ ట్రైనీ పోలీసాఫీసర్ల సాహసాల ఇతివృత్తంగా ఈ సినిమా సాగుతుంది. మరోవైపు సమంత తన కెరీర్‌లో దాదాపు యాభై సినిమాలు చేస్తే, వాటిలో 'యూ టర్న్', 'ఓ బేబీ'... లాంటి లేడీ ఓరియంటెడ్ ఫిలింస్ కూడా ఉన్నాయి. ఈ జాబితాలో ఈ ఏడాది 'యశోద' చిత్రం చేరింది. సమంత టైటిల్ రోల్‌లో హరి–హరీష్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం నవంబరు 11న రిలీజైంది. సరోగసీ సాకుతో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే ఓ ముఠా గుట్టును పోలీస్ ఆఫీసర్ యశోద ఎలా బయటపెట్టింది? అనే నేపథ్యంలో 'యశోద' సినిమా సాగుతుంది. అలాగే సమంత టైటిల్ రోల్ చేసిన మరో చిత్రం 'శాకుంతలం' ఈ ఏడాదే విడుదల కావాల్సింది. అయితే వచ్చే ఏడాదికి వాయిదా పడింది. ఈ మైథలాజికల్ ఫిల్మ్‌కు గుణశేఖర్ దర్శకుడు. ఇక ఐదారేళ్లుగా ప్రతి ఏడాదీ నయనతార నటించిన ఒక ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ అయినా వీక్షకుల ముందుకు వస్తోంది. ఈ ఏడాది ఆమె నటించిన 'ఓ2' చిత్రం డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ ప్లాట్‌ఫామ్‌లో జూన్ 17 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. జీఎస్ విఘ్నేష్ ఈ సినిమాకు దర్శకుడు. ఈ కథలో పార్వతిని ట్రాప్ చేస్తారు. సడన్‌గా అక్కడ ఆక్సిజన్ లెవల్స్ తగ్గిపోతాయి. ఆ పరిస్థితుల నుంచి పార్వతి ఎలా బయటపడింది? తన కొడుకును ఎలా కాపాడుకోగలిగింది? అన్నదే కథ. అలాగే నయనతార నటించిన లేటెస్ట్ ఫిల్మ్ 'కనెక్ట్' ఈ నెల 22న రిలీజ్ కానుంది. ఇక అనుపమా పరమేశ్వరన్ నటించిన తాజా చిత్రం 'బటర్ ఫ్లై'. గంటా సతీష్‌బాబు ఈ సినిమాకు దర్శకుడు. ఈ చిత్రం ఈ 29 నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది. వీరితో పాటు మరికొందరు హీరోయిన్లు 'కథనాయిక ప్రాధాన్యం'గా సాగే చిత్రాల్లోనూ, వెబ్ సిరీస్‌లోనూ నటించారు. ఈ ప్రాజెక్ట్స్‌లో కొన్ని సక్సెస్ కాగా, కొన్ని ఫెయిల్ అయ్యాయి. అయితే నటనపరంగా మాత్రం హీరోయిన్లు హిట్టే.

జపాన్‌లో ఆర్‌ఆర్‌ఆర్ రికార్డ్


● రామ్‌చరణ్, ఎన్టీఆర్

ఇప్పటికే పలు అంతర్జాతీయ ఘనతలు, అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్న 'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం ఖాతాలో మరో రికార్డు చేరింది. జపాన్‌లో విడుదలై అత్యధిక వసూళ్లను రాబట్టిన భారతీయ చిత్రంగా 'ఆర్‌ఆర్‌ఆర్' రికార్డు సృష్టించింది. ఈ రికార్డు గతంలో రజనీకాంత్ 'ముత్తు' చిత్రానికి ఉండేది. రజనీ హీరోగా కేఎస్ రవికుమార్ దర్శకత్వంలో వచ్చిన 'ముత్తు' (1995) జపాన్‌లో విడుదలై అప్పట్లోనే దాదాపు 23 కోట్ల వసూళ్లను రాబట్టింది. తాజాగా ఈ రికార్డును 'ఆర్‌ఆర్‌ఆర్' అధిగమించింది. ''410 మిలియన్ల యోన్ (జపాన్ కరెన్సీ.. 24 కోట్లకు పైగా) 2 లక్షల 71 వేల మంది ప్రేక్షకాదరణతో 'ఆర్‌ఆర్‌ఆర్' జపాన్‌లో బిగ్గెస్ట్ గ్రాసర్‌గా నిలిచింది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రం జపాన్‌లో ఈ ఏడాది అక్టోబరు 21న రిలీజైంది. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య ఈ చిత్రాన్ని నిర్మించారు.

నాలుగు నామినేషన్స్

80వ గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్‌లో 'ఆర్‌ఆర్‌ఆర్' రెండు నామినేషన్స్ (నాన్ ఇంగ్లిష్ ఫిలిం, బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగాల్లో...) దక్కించుకున్న సంగతి తెలిసిందే. తాజాగా హాలీవుడ్ క్రిటిక్స్ అసోసియేషన్ అందించే అవార్డుల్లో నాలుగు విభాగాల్లో (బెస్ట్ డైరెక్టర్, బెస్ట్ పిక్చర్, బెస్ట్ యాక్షన్ ఫిల్మ్, బెస్ట్ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్) 'ఆర్‌ఆర్‌ఆర్' నామినేషన్స్ దక్కించుకుంది.


● శిరీష్, హర్షిత్, హన్షిత, 'దిల్' రాజు, వేణు, ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్

సక్సెస్‌ఫుల్ సినిమా తీయడం అంత ఈజీ కాదు

దిల్ రాజు

''సినిమా తీయడం సులభం. కానీ సక్సెస్‌ఫుల్ సినిమా తీయడం అంత ఈజీ కాదు. సరైన నిర్ణయాలు తీసుకోగలగడం, కష్టపడటం, పరిశీలన, సమాచార సేకరణ వంటి అంశాలు ఓ సినిమా సక్సెస్ కావడానికి దోహదపడతాయి. అయితే ప్రతి సినిమాకీ మేం ఒకేలా కష్టపడతాం. అందుకే మా ఎస్‌వీసీసీ బేనర్‌లో డెబ్బై శాతానికి పైగా సక్సెస్ రేట్ ఉంది'' అన్నారు నిర్మాత 'దిల్' రాజు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్‌రామ్ జంటగా నటించిన చిత్రం 'బలగం'. దిల్ రాజు ప్రొడక్షన్స్ (డీఆర్‌పీ) పతాకంపై హర్షిత్, హన్షిత నిర్మించిన ఈ చిత్రంతో నటుడు వేణు దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. శుక్రవారం డీఆర్‌పీ బ్యానర్ లోగోను విడుదల చేశారు. ఈ సందర్భంగా 'దిల్' రాజు మాట్లాడుతూ– ''బొమ్మరిల్లు', 'శతమానంభవతి' చిత్రాలు మా ఎస్‌వీసీసీకి డబ్బుతో పాటు మంచి కుటుంబ ప్రేక్షకాదరణను తీసుకు వచ్చాయి. అలా ఈ డీఆర్‌పీ బ్యానర్‌కు 'బలగం' సినిమా ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఎమోషనల్ అండ్ ఫ్యామిలీ ఫిల్మ్ ఇది'' అన్నారు. ''తెలంగాణలోని సిరిసిల్ల నేపథ్యంలో తెరకెక్కిన సినిమా ఇది'' అన్నారు వేణు. ''ఈ చిత్రంతో దర్శకుడిగా వేణు ప్రతిభను చూస్తారు'' అన్నారు ప్రియదర్శి. ''కొత్త కథలను అందిస్తూ, ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే, లక్ష్యంతో ఈ బ్యానర్‌ను స్టార్ట్ చేశాం'' అన్నారు హన్షిత రెడ్డి.

ఇటీవల నేను ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో చెప్పిన విషయాల్లో (తమిళ హీరోలను ఉద్దేశించి) కొన్ని సెకన్ల వీడియోను కట్ చేసి, ప్రచారం చేశారు. అయితే ఆ ఇంటర్వ్యూ మొత్తం చూస్తే అసలు విషయం తెలుస్తుంది. ఒకర్ని ఎక్కువ మరొకర్ని తక్కువ చేయడం నాకిష్టం ఉండదు.
– 'దిల్' రాజు

సాక్షి **బిజినెస్**
శనివారం
17-12-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	461	61,338
నిఫ్టీ ▽	146	18,269

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	10,673	▽	137
డోజోన్స్	32,746	▽	456
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,332	▽	94
డాక్స్	13,893	▽	93
షాంఘై	3,168	▽	1
నికాయ్	27,527	▽	524

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	53,998 ▲	105
బంగారం (99.5 స్వచ్ఛత)	53,782 ▲	103
వెండి (కేజీ)	66,065 ▲	503

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.05	83.72
€	యూరో	ఒకటి	86.72	89.81
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.51	102.87
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	59.40	61.30
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.60	56.99
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.12	62.10
SAR	సౌదీ రియాల్	ధామమకట	21.01	22.78
UAE D	యూఏఈ దిర్హామ్	ధామమకట	21.67	23.46
¥	చైనా యువాన్	ధామమకట	10.76	12.79

హోండా కార్లు ప్రియం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హోండా కార్స్ ఇండియా కార్ల ధరలను జనవరి 23 నుంచి పెంచుతోంది. మోడల్‌నుబట్టి ధర రూ.30,000 వరకు అధికం కానుంది. ముడిసరుకు వ్యయాలు దూసుకెళ్లడం, నూతన ఉద్గార నిబంధనలకు అనుగుణంగా తయారీ చేపడుతుండడం ఇందుకు కారణమని కంపెనీ శుక్రవారం ప్రకటించింది. కాలుష్యం ఏ మేరకు విడుదల అవుతుందో తెలుసుకునే పరికరాన్ని కార్లలో ఏర్పాటు చేయాలన్న నిబంధన 2023 ఏప్రిల్ నుంచి అమలులోకి వస్తోంది. ధరలను సవరిస్తున్నట్టు మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్, మెర్సిడెస్ బెంజ్, ఆడి, రెనో, కియా ఇండియా, ఎంజీ మోటార్ ఇప్పటికే ప్రకటించాయి.

చిన్న పట్టణాలపై మరింత దృష్టి

బైట్‌ఎక్స్‌ఎల్ సీఈవో కరుణ్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఐటీ కెరీర్ ఔత్సాహికులకు నైపుణ్యాల్లో శిక్షణనిచ్చే ఎడ్‌టెక్ సంస్థ బైట్‌ఎక్స్‌ఎల్ .. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలపై మరింతగా దృష్టి పెడుతోంది. ప్రస్తుతం 90 పైచిలుకు కాలేజీలతో టై–అప్‌లు ఉన్నాయని, ఈ సంఖ్యను మరింతగా పెంచుకుంటున్నామని సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో కరుణ్ తాడేపల్లి తెలిపారు. అలాగే 163 మంది ఉద్యోగులు, కన్సల్టెంట్లు ఉండగా.. వచ్చే 6–9 నెలల్లో 350 వరకు పెంచుకోనున్నట్లు ఆయన వివరించారు. ఆదాయాన్ని 4 రెట్లు పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు కొత్తగా నిర్మించిన కార్యాలయంలోకి కార్యకలాపాలు మార్చిన సందర్భంగా విలేకరులకు చెప్పారు. ఇప్పటివరకూ ఏడు రాష్ట్రాల్లో 1,20,000 మంది విద్యార్థులకు క్లౌడ్, ఏఐ, ఎంఎల్ వంటి కొత్త టెక్నాలజీలపై తమ లెర్నింగ్ ప్లాట్‌ఫాం, ఎక్సలరేట్ ప్రోగ్రాంల ద్వారా శిక్షణనిచ్చినట్లు కరుణ్ వివరించారు. కరోనా తర్వాత దాదాపు అందరూ కాలేజీలు, ఆఫీసుల బాటపట్టిన నేపథ్యంలో ఇటీవలి కాలంలో ఎడ్‌టెక్ కంపెనీలపై కొంత ప్రభావం పడిందని ఆయన చెప్పారు. అయితే, కొత్త పరిస్థితులకు అనుగుణంగా వినూత్న సర్వీసులు అందించడంపై దృష్టి పెడుతున్నట్లు కరుణ్ చెప్పారు.



అంతర్జాతీయ తయారీదారులను ఆకర్షించాలి

- కావాల్సిన విధానాలపై పరిశ్రమ పనిచేయాలి
- సేవలే కాదు తయారీ కూడా కీలకమే
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ: భారత్‌ను అంతర్జాతీయ తయారీ కేంద్రంగా, వనరుల సమీకరణ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు, కావాల్సిన విధానాలను రూపొందించాలని దేశీ పరిశ్రమను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. అభివృద్ధి చెందిన దేశాలు మాంద్యం రిస్కలను ఎదుర్కొంటున్న వేళ అక్కడ వ్యాపారాలు ఎలా నడుస్తున్నాయో అధ్యయనం చేయాలని సూచించారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్రం ఎన్నో వసతులతోపాటు, నిబంధనలను కూడా సవరించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. "పాశ్చాత్య, అభివృద్ధి చెందిన దేశాల్లో దీర్ఘకాలంగా కొనసాగుతున్న మాంద్యం నేపథ్యంలో మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోవాలి. అక్కడి తయారీ దారులను భారత్‌కు తీసుకొచ్చేందుకు కావాల్సిన వ్యూహాలపై పనిచేసేందుకు ఇదే సరైన సమయం. ఆయా కంపెనీల ప్రధాన కార్యాలయాలు అక్కడే ఉన్నా కానీ.. ఎన్నో ఉత్పత్తులు, విడిభాగాలను ఇక్కడి నుంచి సమీకరించుకోవడం వాటికి సైతం సాయంగా ఉంటుంది. కొంతవరకు తయారీని ఇక్కడ చేయడం అవసరం"అని మంత్రి శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఫిక్కీ 95వ వార్షిక సమావేశంలో భాగంగా పరిశ్రమకు సూచించారు. దీర్ఘకాలం కొనసాగే మాంద్యం వల్ల యూరప్‌పై ప్రభావం పడుతుందన్న మంత్రి.. భారత్‌పై పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చన్నారు. యూరప్ తదితర పాశ్చాత్య ప్రపంచంలో పనిచేసే కంపెనీలకు, భారత్ ప్రత్యామ్నాయ కేంద్రం కాగలదన్నారు.

ఇప్పుడు ప్లస్ 2..: భారత్ చైనా ప్లస్1గా పనిచేస్తోందని, యూరప్ ప్లస్ వన్‌గా కూడా మారుతోందని మంత్రి సీతారామన్ అన్నారు. "కనుక ప్లస్ వన్ ఇప్పుడు ప్లస్ 2గా మారింది. ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో వసతులు కల్పించింది. నిబంధనల్లో మార్పులు తీసుకొచ్చింది. భారత్‌కు తయారీ వసతులను తరలించాలనుకుంటున్న కంపెనీలతో సంప్రదింపులు చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. కొందరు భారత్ తయారీపై దృష్టి సారించొద్దని, కేవలం సేవలపైనే దృష్టి పెట్టాలన్న సూచనలు చేస్తున్నారు. కానీ ఇదీ కుదరదు. తయారీపై, కొత్త విభాగాలపై తప్పకుండా దృష్టి పెట్టాల్సిందే"అని మంత్రి స్పష్టత ఇచ్చారు. చైనా తయారీ నమూనాను గుడ్డిగా అనుసరించకుండా, భారత్ సేవలపైనే దృష్టి కొనసాగించాలంటూ పలువురు



ఆర్థికవేత్తలు, నిపుణులు సూచిస్తున్న క్రమంలో మంత్రి దీనిపై మాట్లాడారు. ఇప్పటికే మన దేశ జీడీపీలో ఐటీ ఆధారిత సేవల రంగం వాటా 60 శాతంగా ఉన్నట్టు మంత్రి చెప్పారు. వాతావరణ మార్పులు తమపై ఏవిధమైన ప్రభావం చూపిస్తున్నాయన్నది పరిశ్రమ ప్రభుత్వానికి తెలియజేయాలని సూచించారు. తమపై దీనికి సంబంధించి వ్యయాల భారాన్ని ఎలా తగ్గించాలో కూడా సూచనలు ఇవ్వాలని కోరారు.

వృద్ధి ఆధారిత బడ్జెట్

వచ్చే బడ్జెట్‌లోనూ (2023–24) పూర్వపు బడ్జెట్ స్ఫూర్తి కొనసాగుతుందని, వృద్ధికి మద్దతుగా ఉంటుందని మంత్రి సీతారామన్ సంకేతం ఇచ్చారు. భారత్‌ను వచ్చే 25 ఏళ్ల కాలానికి ముందుకు నడిపించే పునాదిగా ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరానికి భారత్ జీడీపీ వృద్ధి అంచనాలను ఆర్‌బీఐ సహా అంతర్జాతీయ ఏజెన్సీలు తగ్గిస్తున్న తరుణంలో.. వచ్చే ఆర్థిక సంవత్సరానికి మంత్రి సీతారామన్ సమర్పించే బడ్జెట్ కీలకంగా మారింది. వచ్చే ఫిబ్రవరి 1న పార్లమెంట్‌కు మంత్రి బడ్జెట్‌ను సమర్పించనున్నారు.

2024-25లో 5 ట్రిలియన్ డాలర్లకు: నితిన్ గడ్కరీ



భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధిని సాధిస్తోందని, 2024–25 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల (రూ.410 లక్షల కోట్లు) స్థాయికి చేరుకోవాలన్న లక్ష్యాన్ని సాధిస్తామని కేంద్ర రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఫిక్కీ నిర్వహించిన వార్షిక కార్యక్రమంలో భాగంగా మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం సుస్థిరాభివృద్ధి కోసం వృద్ధిని, ఉపాధిని పెంచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్టు చెప్పారు.

సంస్కరణలతో భారత్ వృద్ధికి దన్ను

టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్

న్యూఢిల్లీ: రాబోయే కొన్ని దశాబ్దాల పాటు భారత్‌కు వృద్ధి అవకాశాలు పటిష్టంగా ఉన్నాయని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ ధీమా వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా అమలు చేస్తున్న సంస్కరణలు ఇందుకు ఊతంగా నిలవనున్నాయని ఆయన చెప్పారు. కరోనా మహమ్మారి ముందు, తర్వాత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంస్కరణలు 2047 నాటికి సాధించదల్చుకున్న లక్ష్యాలకు గట్టి పునాదిగా ఉండగలవని చంద్రశేఖరన్ చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అయ్యే నాటి కి భారత్ 25–30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఆవిర్భవించగలదని ఆయన తెలిపారు. అయితే, అసంఘటిత రంగంలోని వర్కర్లు, వ్యవసాయ కార్మికులు, మహిళలు సహా ప్రజలందరికీ ఆ ఫలాలు దక్కేలా చూసుకోవడం చాలా ముఖ్యమని చంద్రశేఖరన్ పరిశ్రమ సమాఖ్య ఫిక్కీ వార్షిక సదస్సులో పాల్గొన్న సందర్భంగా వివరించారు. మహమ్మారి సమయం నుంచి వ్యవస్థాగత సంస్కరణలు మరింతగా పుంజుకున్నాయని ఆయన చెప్పారు.



విదేశీ విస్తరణ బాటలో కేఫిన్

- ఏడాదిలో 500 నియామకాలు
- సంస్థ ఎండీ శ్రీకాంత్ నాదెళ్ల

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పబ్లిక్ ఇష్యూకి వస్తున్న ఫైనాన్షియల్ టెక్నాలజీ కంపెనీ కేఫిన్ టెక్నాలజీస్ అంతర్జాతీయంగా కార్యకలాపాలను మరింతగా విస్తరిస్తోంది. మలేసియా, ఫిలిప్పీన్స్, హాంకాంగ్ తదితర దేశాల్లో ఇప్పటికే 21 ఏఎంసీలకు (అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు) సర్వీసులు అందిస్తుండగా మలేసియా, సింగపూర్‌లలో ఏఎంసీలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. శుక్రవారమిక్కడ విలేకరుల సమావేశంలో ఐపీవో వివరాల వెల్లడి సందర్భంగా కంపెనీ ఎండీ శ్రీకాంత్ నాదెళ్ల ఈ విషయాలు చెప్పారు. ఈ మార్కెట్లలో పరిమాణం 1 ట్రిలియన్ డాలర్లకుపైగా ఉంటుందని వివరించారు. ఆగ్నేయాసియా, ఇతర మార్కెట్లలో అవకాశాలను దక్కించుకునేందుకు ఫండ్ అకౌంటింగ్, అడ్మినిస్ట్రేషన్ సర్వీసులు మొదలైనవి కూడా అందించడంపై దృష్టి పెడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం హెక్సాగ్రామ్ ఫిన్‌టెక్ వంటి కంపెనీలను కొనుగోలు చేసినట్లు వివరించారు. తమకు అనువుగా ఉండే మరిన్ని సంస్థలను కూడా కొనుగోలు చేసే యోచన ఉందని శ్రీకాంత్ చెప్పారు. మరోవైపు, ప్రస్తుతం సంస్థలో సుమారు 5,000 మంది పైచిలుకు సిబ్బంది ఉండగా, హైదరాబాద్‌లో 3,500 మంది ఉద్యోగులు ఉన్నారని శ్రీకాంత్ వివరించారు. కార్యకలాపాలను విస్తరిస్తున్న నేపథ్యంలో వచ్చే 12–18 నెలల్లో మరో 400–500 మందిని నియమించుకోనున్నట్లు చెప్పారు. డిసెంబర్ 19తో ప్రారంభమయ్యే ఐపీవో ద్వారా కేఫిన్ టెక్నాలజీస్ రూ. 1,500 కోట్లు సమీకరిస్తోంది. ధర శ్రేణి రూ. 347–366గా ఉండగా, కనీసం 40 షేర్లకు బిడ్ చేయాల్సి ఉంటుంది.



వడ్డీ రేట్లు.. మాంద్యం భయాలు పడేశాయ్

- సూచీలు రెండోరోజూ డీలా
- సెన్సెక్స్ 461 పాయింట్ల పతనం
- 18,300 దిగువకు నిఫ్టీ
- అన్ని రంగాల షేర్లలోనూ అమ్మకాలే

ముంబై: ద్రవ్యోల్బణ కట్టడి లక్ష్యంగా భారత్‌తో సహా పలు దేశాల కేంద్ర బ్యాంకులు కీలక వడ్డీ రేట్లను పెంచడంతో దేశీయ స్టాక్ మార్కెట్ రెండోరోజూ నష్టపోయింది. ఆర్‌బీఐ, అమెరికా ఫెడ్ రిజర్వ్‌లను అనుసరిస్తూ తాజాగా యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లూ అరశాతం వడ్డీరేట్ల పెంపును ప్రకటించాయి. సమీప భవిష్యత్తులోనూ ఇదే పంథా కొనసాగొచ్చనే సంకేతాలు ఇచ్చాయి. ఆయా దేశాల కేంద్ర బ్యాంకులు అనుసరిస్తున్న కఠిన ద్రవ్య విధాన వైఖరి మాంద్య పరిస్థితులకు దారితీమొచ్చనే భయాలు ఈక్విటీ మార్కెట్లను వెంటాడాయి. సంవత్సరాంతపు సెలవుల కారణంగా రానున్న రోజుల్లో విదేశీ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం పరిమితంగా ఉండొచ్చనే అంచనాలు సెంటిమెంట్‌పై ఒత్తిడిని పెంచింది. అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో శుక్రవారం సెన్సెక్స్ 461 పాయింట్లు పతనమై 61,338 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 146 పాయింట్లు నష్టపోయి 18,269 వద్ద నిలిచింది. అధిక వెయిటేజీ బ్యాంకింగ్, ఆర్థిక, ఆటో, ఎఫ్‌ఎంసీజీ రంగాల షేర్లు ఎక్కువగా నష్టపోయాయి.



రెండు రోజుల్లో రూ.5.78 లక్షల కోట్ల నష్టం

గడిచిన రెండు రోజుల్లో సెన్సెక్స్ 1,340 పాయింట్లు పతనమైనంది. ఈ క్రమంలో ఇన్వెస్టర్ల సంపద ఏకంగా రూ.5.78 లక్షల కోట్ల సంపద మాయమైంది. ఫలితంగా ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 285 లక్షల కోట్లకి దిగివచ్చింది. శుక్రవారం ఒక్కరోజే రూ.2.94 లక్షల కోట్ల సంపద తుడిచిపెట్టుకుపోయింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- కేంద్రం విండ్‌ఫాల్ ట్యాక్స్ తగ్గింపుతో తొలి సెషన్‌లో ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా షేర్లు రెండుశాతం చొప్పున లాభపడ్డాయి. ఆరంభ లాభాలను కోల్పోయి నష్టాలతో ముగిశాయి.
- ఐఆర్‌సీటీసీలో కేంద్రం 5 శాతంవరకూ వాటా విక్రయం నిర్ణయం రెండోరోజూ ప్రతికూల ప్రభావాన్ని చూపింది. బీఎస్‌ఈలో ఈ షేరు 2.5% నష్టపోయి రూ.672 వద్ద నిలిచింది.

సాక్షి **స్పోర్ట్స్**

నేడు అంధుల టి20 ప్రపంచ కప్ ఫైనల్
(బెంగళూరులో)
భారత్ X బంగ్లాదేశ్
ఉ.గం.10.30నుంచి దూరదర్శన్‌లో ప్రత్యక్ష ప్రసారం

నేటినుంచి ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తొలి టెస్టు
(బ్రిస్బేన్‌లో)
ఉ.గం. 5.50నుంచి సోనీ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం

నేటినుంచి పాకిస్తాన్, ఇంగ్లండ్ మూడో టెస్టు
(కరాచీలో)
ఉ.గం.10.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం

నేడు ప్రొ కబడ్డీ ఫైనల్
జైపూర్ పింక్ పాంథర్స్
X
పుణేరీ పల్టన్
(వేదిక: ముంబై)



రా.గం.7.30నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సిరీస్ కాపాడుకునేందుకు...

- గెలుపే లక్ష్యంగా భారత అమ్మాయిలు
- నేడు ఆసీస్‌తో నాలుగో టి20
- రాత్రి గం.7 నుంచి 'స్టార్‌స్పోర్ట్స్'లో ప్రసారం



ముంబై: ఆస్ట్రేలియాతో జరుగుతున్న ద్వైపాక్షిక సిరీస్ రేసులో నిలవాలంటే గెలవాల్సిన మ్యాచ్‌కు భారత మహిళల జట్టు సిద్ధమైంది. ఇరు జట్ల మధ్య శనివారం ఇక్కడ నాలుగో టి20 మ్యాచ్ జరుగుతుంది. ఇందులో గెలిస్తేనే భారత్‌కు సిరీస్ గెలిచే అవకాశముంటుంది. ఈ మ్యాచ్‌లో గనక ఓడితే ఇక్కడే సిరీస్‌ను సమర్పించుకుంటుంది. ఈ నేపథ్యంలో చావోరేవో తేల్చుకోవాల్సిన భారత అమ్మాయిలపైనే ఒత్తిడి నెలకొంది. పైగా ఆసీస్ లాంటి మేటి జట్టును ఎదుర్కోవాలంటే హర్మన్‌ప్రీత్ సేన సర్వశక్తులు ఒడ్డాల్సిందే! ముఖ్యంగా బ్యాటింగ్ ఫర్వాలేదనిపిస్తున్నా... బౌలింగే జట్టు మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. గత మ్యాచ్‌లో ఆరంభంలోనే ఆసీస్ వికెట్లను పడగొట్టినప్పటికీ తర్వాత పట్టు సడలించడంతో ఆస్ట్రేలియా స్కోరు మళ్లీ 170 పరుగులు దాటింది. ఆంధ్ర పేసర్ అంజలి శర్వాణి వికెట్లు తీస్తున్నప్పటికీ పరుగులు మాత్రం ధారాళంగా ఇస్తోంది. సీనియర్లు రాజేశ్వరి గైక్వాడ్, దీప్తి శర్మలు సైతం భారీగా పరుగులు ఇవ్వడం ప్రతికూలంగా మారుతోంది. ఈ నేపథ్యంలో కోచింగ్ బృందం బౌలింగ్ విభాగంపైనే ప్రధానంగా దృష్టి సారించాలి. లోపాలను సరిదిద్దుకొని బౌలింగ్ పదును పెంచాలి. ఇక బ్యాటింగ్ విషయానికొస్తే జెమిమా రోడ్రిగ్స్ పేలవ ఫామ్ వల్ల పటిష్ట భాగస్వామ్యాలకు అవకాశం లేకుండాపోతోంది. మూడు మ్యాచ్‌ల్లో ఆమె వరుసగా 0, 4, 16 పరుగులతో నిరాశపరిచింది. కీలకమైన నేటి మ్యాచ్‌లో ఆమె మంచి స్కోరు చేస్తే జట్టు భారీస్కోరుకు బాటపడుతుంది. మరోవైపు 2–1తో ఇప్పటికే ఆధిక్యంలో ఉన్న ఆసీస్ అమ్మాయిలు ఇక్కడే సిరీస్ గెలవాలనే పట్టుదలతో ఉన్నారు. ముఖ్యంగా బౌలింగ్, బ్యాటింగ్ రంగాల్లో మనకన్నా మెరుగ్గా ఉండటంతో ఆస్ట్రేలియాకు వరుస విజయం ఏమంత కష్టం కాదు.

'భారత జట్టు ప్రపంచ కప్ గెలుస్తుంది'

కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఆశాభావం




న్యూఢిల్లీ: వచ్చే నెలలో సొంతగడ్డపై జరిగే హాకీ ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలుస్తుందని కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ ఆతిథ్యమిచ్చే ఈ పురుషుల హాకీ టోర్నీ భువనేశ్వర్, రూర్కేలా వేదికలపై జనవరి 13 నుంచి 29 వరకు జరుగనుంది. వరల్డ్ కప్ ట్రోఫీ టూర్‌లో భాగంగా శుక్రవారం ట్రోఫీ రాజధాని నగరం ఢిల్లీకి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ 'ప్రపంచకప్ సమరం కోసం భారత జట్టు పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. 15 పోటీ జట్ల నుంచి ఎలాంటి సవాళ్లు ఎదురైనా ధీటుగా ఎదుర్కొంటుంది. భారత్ సన్నాహాలు, సన్నద్ధత చూస్తుంటే మరోసారి ప్రపంచ చాంపియన్ అవుతుందని అనిపిస్తుంది. జట్టు సభ్యులంతా కఠోరంగా శ్రమించారు. అందరూ ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. ప్రపంచకప్ మాత్రమే కాదు... పారిస్ ఒలింపిక్స్‌లోనూ భారత జట్టు సత్తా చాటుతుంది' అని అన్నారు. ఒకప్పుడు హాకీలో భారత్‌కు ఘనచరిత్ర ఉంది. చివరి సారిగా భారత్ 47 ఏళ్ల క్రితం కౌలాలంపూర్ (1975)లో జరిగిన ప్రపంచకప్‌లో విజేతగా నిలిచింది.

జగనన్న ఇళ్లపై విషపు రాతలు

చురుగ్గా వేంపల్లె జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం

- 620 ఇళ్లలో 423 శ్లాబ్ దశకు.. మిగిలిన ఇళ్ల నిర్మాణానికీ వేగంగా చర్యలు
- తుపాను కారణంగా కేవలం మూడు రోజులే నిలిచిన పనులు
- ఇదే అదనుగా అబద్ధాలతో కథనం ప్రచురించిన 'ఈనాడు'
- 'ఈనాడు' కథనంపై లబ్ధిదారులు, అధికారుల మండిపాటు
- భారీ వర్షాల్లో పనులెలా జరుగుతాయని నిలదీత
- ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు అదనపు భారం అన్నది అవాస్తవం


వివిధ నిర్మాణ దశల్లో ఉన్న జగనన్న కాలనీలోని గృహాలు


వివిధ దశల్లో ఉన్న జగనన్న కాలనీ

వేంపల్లె/కడప సిటీ: కళ్లుంటే చూసి రాయాలి.. నిజాయితీ ఉంటే నిజాలు రాయాలి. వాస్తవాలను ప్రజల కళ్ల ముందుంచాలి. రెండూ లేకపోతే విషపు రాత అవుతుంది. అది 'ఈనాడు' వార్త అవుతుంది. ఇందుకు ఉదాహరణ జగనన్న కాలనీల్లో పేదల ఇళ్ల నిర్మాణాలపై ఈనాడు రాస్తున్న కథనాలు. వాస్తవానికి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం వేంపల్లెలోని జగనన్న కాలనీలో కూడా గృహాల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఇటీవలి వర్షాల కారణంగా కేవలం మూడు రోజులు పనులు ఆగాయి. ఇదే అదనుగా జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనులన్నీ ఆగిపోయాయంటూ ఈనాడు విష ప్రచారం చేసింది. ఈ కథనంపై లబ్ధిదారులు, అధికారులు మండిపడుతున్నారు. రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలు అద్దె ఇళ్లలో అవస్థలు పడకూడదని, సొంతింట్లో సంతోషంగా ఉండాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇళ్లు నిర్మించుకోవడానికి ఆర్థిక సహకారమూ అందిస్తున్నారు. అదే విధంగా వేంపల్లెలోని జగనన్న కాలనీలో 620 పక్కా గృహాలు నిర్మిస్తున్నారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయానికి తోడు బ్యాంకుల నుంచి అదనంగా రూ.35 వేలు రుణ సాయం కూడా అందిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక, ఇనుము పూర్తిస్థాయిలో అందిస్తోంది. ప్రభుత్వ సహకారంతో లబ్ధిదారులు ఉత్సాహంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. 423 ఇళ్లు శ్లాబ్ దశకు చేరుకున్నాయి. మరికొన్ని వివిధ దశలలో ఉన్నాయి. అయితే, ఇటీవలి తుపాను కారణంగా భారీగా వర్షాలు కురవడంతో మూడు రోజులపాటు తప్పనిసరి పరిస్థితుల్లో ఇళ్ల పనులు ఆపాల్సి వచ్చింది. వాతావరణం చక్కబడటంతో రెండు రోజులుగా పనులు మళ్లీ వేగంగా సాగుతున్నాయి. కానీ వేంపల్లె జగనన్న కాలనీలో పనులు ఆగిపోయినట్లు గురువారం ఈనాడు దినపత్రికలో కథనం రావడంతో పులివెందుల నియోజకవర్గం ప్రజలు నివ్వెరపోయారు. లబ్ధిదారులు, అధికారులు పెద్ద ఎత్తున మండిపడుతున్నారు. వర్షాలు పడుతుంటే నిర్మాణ పనులు ఎలా చేపడతారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్, నీటి వసతి లేకపోవడం వల్ల పనులు నిలిచిపోయాయన్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని తెలిపారు. ఇంటి నిర్మాణానికి రూ.2 లక్షలు అదనంగా ఖర్చవుతోందన్నది కూడా పూర్తి అవాస్తవమని లబ్ధిదారులు చెబుతున్నారు.

మౌలిక సదుపాయాలకు కొరత లేదు

ఈనాడు కథనంపై జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఖండన

వేంపల్లెలోని జగనన్న కాలనీలో జరుగుతున్న పనులపై ఈనాడు దినపత్రికలో ప్రచురితమైన కథనం పూర్తిగా అవాస్తవం. ఇక్కడ నిర్మిస్తున్న 620 పక్కా గృహాల్లో 423 గృహాలు బేస్‌మెంట్ స్థాయి పూర్తి చేసుకుని శ్లాబ్ వరకు వచ్చాయి. మిగిలిన 197 గృహాల నిర్మాణానికి వేగంగా చర్యలు తీసుకుంటున్నాం. కాలనీలో మౌలిక సదుపాయాల పనులూ వేగంగా జరుగుతున్నాయి. రూ.30.90 లక్షలతో లే అవుట్ చదును చేస్తున్నాం. రూ. 25.50 లక్షలతో రోడ్లు నిర్మిస్తున్నాం. నీటి కోసం ఎనిమిది బోర్లు, మోటార్లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి ఇంటికి నీటి సదుపాయానికి రూ. 88.20 లక్షలతో మంచినీటి పథకం నిర్మాణం ప్రారంభించాం. విద్యుత్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇటీవల మాండూస్ తుపాను వల్ల భారీ వర్షాలు కురవడంతో నీటి పైపులైన్ గుంతలలో వర్షపు నీరు నిలిచి, రోడ్లు బురదగా మారాయి. వర్షపు నీటిని తొలగించేందుకు వెంటనే చర్యలు చేపట్టాం. ప్రతి ఇంటికి అవసరం మేరకు ఇసుక, సిమెంటు ఉచితంగా ఇస్తున్నాం.

ఇంటికి రూ.2 లక్షలు అదనపు ఖర్చు అవాస్తవం



వేంపల్లెలోని జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చకచకా జరుగుతున్నాయి. ఇంటి నిర్మాణాలకు రూ.2 లక్షలు అదనంగా ఖర్చవుతుందని చెప్పడం అవాస్తవం. మాలాంటి వారికి ప్రభుత్వం ఇంటి స్థలాన్ని ఇచ్చి అన్ని హక్కులు కల్పించడం చాలా సంతోషంగా ఉంది. ఈనాడులో వచ్చిన కథనం పూర్తి అసత్యాలతో ఉంది.

–షేక్ షబీనా, జగనన్న కాలనీ

జగనన్నతోనే పేదలకు న్యాయం



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే పేదలకు న్యాయం జరుగుతుంది. మా సంక్షేమం కోసం జగనన్న ఇంటి స్థలమిచ్చారు. ఇంటి నిర్మాణానికి అన్ని విధాలా సాయం చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో అనేక మార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. జగనన్న ముఖ్యమంత్రి కాగానే వెంటనే ఇల్లు మంజూరైంది. చాలా ఆనందంగా ఉంది. ఈనాడు తప్పుడు రాతలతో ప్రజలను మభ్య పరచాలని చూస్తోంది. ఇక్కడికి వచ్చి చూస్తే వాస్తవాలు తెలుస్తాయి.

–షేక్ గౌసియా, జగనన్న కాలనీ

నెల్లూరులో సీబీఐ అధికారుల విచారణ

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు నాలుగో అదనపు ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో చోరీ కేసుపై సీబీఐ అధికారులు రెండు రోజులుగా విచారణ చేస్తున్నారు. కోర్టులో చోరీపై హైకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ చెన్నై విభాగం ఈ నెల 13వ తేదీన కేసు నమోదు చేసింది. సీబీఐ ఏఎస్పీ ఆనందకృష్ణ, ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌తో కూడిన ప్రత్యేక బృందం గురువారం నెల్లూరు వచ్చి చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించింది. అప్పటి కోర్టు బెంచ్ క్లర్క్ బి.నాగేశ్వరరావును విచారించింది. ఎస్పీ సీహెచ్ విజయరావును కలిసి ఈ కేసు విషయమై చర్చించినట్లు సమాచారం. శుక్రవారం నెల్లూరు పోలీసు మైదానంలోని అతిథిగృహంలో పలువురిని సీబీఐ బృందం విచారించింది. చిన్నబజారు పోలీసుల వద్ద ఉన్న దొంగతనం కేసు రికార్డులను పరిశీలించింది. పూర్తిస్థాయి విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదికను అందజేయనున్నట్లు తెలిసింది.

కొనసాగుతున్న అల్పపీడనం

సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం అదే ప్రాంతంలో స్థిరంగా కొనసాగుతోంది. ఇది పశ్చిమ దిశగా పయనిస్తూ శనివారం ఉదయానికి దక్షిణ బంగాళాఖాతంలోకి చేరుకుంటుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శుక్రవారం రాత్రి నివేదికలో తెలిపింది. మరోవైపు రానున్న రెండు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొంది. అదే సమయంలో రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పొగమంచు ఆవరిస్తుందని వాతావరణ నిపుణులు తెలిపారు.

టీటీడీ బోర్డు సభ్యుడిగా దాసరి కిరణ్

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) బోర్డు సభ్యుడిగా దాసరి కిరణ్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి (ఎఫ్ఏసీ) ఎం.హరిజవహర్ లాల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్ (పిల్) ఫలితానికి లోబడి ఈ నియామకం ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'వైద్య విద్యలో సిమ్యులేషన్'పై వర్క్‌షాప్

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'వైద్య విద్యలో సిమ్యులేషన్ ప్రాధాన్యత' అంశంపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ నవీన్ కుమార్, కాంటినెంటల్ హాస్పిటల్ చైర్మన్ గురు ఎన్ రెడ్డి, వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ వర్క్‌షాప్‌లో మాట్లాడారు. ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలందించాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా ఆస్పత్రుల్లో వైద్య సేవల మెరుగుదలపై పలు సూచనలు చేశారు. ఆధునిక వైద్య పరికరాల నిర్వహణలో రియాల్టీ సిమ్యులేటర్ ద్వారా శిక్షణ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వైద్య బోధన ఆస్పత్రుల నుంచి సూపరింటెండెంట్స్, ప్రిన్సిపల్స్ ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

ట్యాబ్‌ల ద్వారా అత్యుత్తమ విద్యా బోధన

ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి నుంచి పిల్లలకు ట్యాబ్‌ల ద్వారా అత్యుత్తమ బోధన అందించనున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని తెలిపారు. శుక్రవారం సమగ్ర శిక్షా కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి బొత్స సమావేశమయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన ట్యాబ్‌లను బైజూస్ సంస్థ అత్యుత్తమ ఈ-కంటెంట్‌తో ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈనెల 21న బాపట్ల జిల్లా చుండూరు మండలం యడ్లపల్లి హైస్కూలులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ట్యాబ్‌ల పంపిణీ ప్రారంభిస్తారన్నారు. 8వ తరగతి టీచర్లకు కూడా వీటిని అందిస్తున్నట్లు చెప్పారు. మొత్తం 5.18 లక్షల ట్యాబ్‌లు ఇస్తామన్నారు. ఒక్క ట్యాబ్‌ల కోసమే రూ. 686 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి వెయ్యి హైస్కూళ్లని సీబీఎస్ఈ పాఠశాలలుగా మారుస్తున్నామని చెప్పారు. టీచర్ల బదిలీల విషయంలో ఉపాధ్యాయ సంఘాలు చేసిన సవరణలపై కూడా సానుకూలంగా ఉన్నామని తెలిపారు. సవరణలతో కూడిన వివరాలను శనివారం సాయంత్రానికి ప్రకటిస్తామని చెప్పారు. బదిలీల్లో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తామని, అక్రమాలు జరిగితే ఆయా అధికారులు, ఉపాధ్యాయులపై కఠిన చర్యలుంటాయని స్పష్టం చేశారు. విద్యా శాఖ కమిషనర్ సురేష్ కుమార్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.